శుక్రవారం
27•12•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 182
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM I KARIMNAGAR I HYDERABAD WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD




• ఆకాశవీధిలో అందాల సూర్యుడు



వెలుగుపంచే భానుడు కాసేపు నెలవంకలా మారి ప్రభాతవేళ వెన్నెల కురిపించిన అద్భుతదృశ్యం గురువారం ఉదయం యావత్ భారతావనికి కనువిందుచేసింది. అరుదుగా సంభవించే అంగుళీయక సూర్యగ్రహణం హైదరాబాద్‌లో ఉదయం 9.27 గంటలకు ఇలా కనిపించింది.

## పురపోరుకు సమాయత్తం



గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యం
నేడు టీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గం భేటీ
మున్సిపల్ ఎన్నికలపై చర్చ
పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
ఇంచార్జీల నియామకం.. ప్రచారవ్యూహం.. అభ్యర్థుల ఎంపికపై మార్గదర్శకాలు

2




బెంగళూరులో జరిగిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మహిళ

## నిరసనల సెగ

సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా పలుచోట్ల ర్యాలీలు
హింసవైపు నడిపేవారు నాయకులుకాదన్న బీపీ రావత్
సైన్యాధిపతిపై మండిపడ్డ విపక్షం

5

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 100.00 | రిటైల్ లైవ్ | 122.00 |
| డ్రెస్‌డ్ | 177.00 | స్కిన్‌లెస్ | 201.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 445.00 | రంగారెడ్డి | 445.00 |
| మెదక్ | 445.00 | కరీంనగర్ | 448.00 |
| వరంగల్ | 448.00 | డజన్ ధర | 69.00 |

## రైల్వే ఉద్యోగాలు యూపీఎస్సీతో భర్తీ




- రైల్వే చార్జీల 'హేతుబద్ధీకరణ'కు కసరత్తు
- సర్వీసుల విలీనంతో అధికారుల సీనియార్టీకి ఢోకాలేదు
- రైల్వే బోర్డు చైర్మన్ వీకే యాదవ్ స్పష్టీకరణ
- ఈ ఏడాది రైల్వే ప్రమాదాల్లో ఒక్క ప్రయాణికుడూ మరణించలేదన్న మంత్రి పీయూష్ గోయల్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 26:**

రైల్వేల్లో ఇకపై జరిగే అన్ని నియామకాలు యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) సివిల్ సర్వీస్ పరీక్షల ద్వారా నిర్వహిస్తామని, ఐదు విభాగాల్లో ఈ నియామకాలు జరుగుతాయని రైల్వే బోర్డు చైర్మన్ వీకే యాదవ్ గురువారం వెల్లడించారు. రైల్వేల్లోని ఎనిమిది సర్వీసులను విలీనంచేసి ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ (ఐఆర్ఎమ్మెస్) ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం మంగళవారం ఆమోదించిన విషయం తెలిసిందే. రైల్వేలో చేరాలనుకునే అభ్యర్థులు యూపీఎస్సీ అభ్యర్థుల మాదిరిగానే ప్రిలిమ్స్ పరీక్షలకు హాజరుకావాలని, ఆ తర్వాత ఐఆర్ఎమ్మెస్‌లోని ఐదు స్పెషాలిటీల్లో (వీటిలో సివిల్, మెకానికల్, టెలికం, ఎలక్ట్రికల్ విభాగాలకు సంబంధించిన టెక్నికల్ కార్యకలాపాలను నిర్వహించే ఇంజినీరింగ్ స్పెషాలిటీలు నాలుగు, అకౌంట్స్, పర్సనల్, ట్రాఫిక్ అధికారులను నియమించే నాన్-టెక్నికల్ స్పెషాలిటీ ఒకటి ఉంటాయి) దేనిని ఎంచుకొంటారో తెలియజేయాల్సి ఉంటుందని వీకే యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఐఆర్ఎమ్మెస్ పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. రైల్వే సర్వీసుల విలీనంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న క్రమంలో ఆయా అంశాలపై ఆయన స్పష్టతనిచ్చారు. క్యాడర్ విలీనానికి సంబంధించిన విధివిధానాలు ఖరారయ్యేవరకు అధికారులంతా తమ స్పెషలైజ్డ్ సర్వీసుల్లో కొనసాగుతారని, సీనియార్టీ విషయంలో ఏ అధికారికీ అన్యాయం జరుగకుండా చూస్తామని వీకే యాదవ్ స్పష్టం చేశారు. కెరీర్‌పరంగా వెనుకంజలో ఉన్న వాళ్లను ఈ నిర్ణయం (రైల్వేల్లోని ఎనిమిది సర్వీసుల విలీనం)తో ముందుకు

మిగతా 5వ పేజీలో








గురువారం హకీంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు స్వాగతం పలుకుతున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, హోంమంత్రి మహమూద్ అలీ

## నేడు రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం

రాష్ట్రపతి కోవింద్‌కు ఘనస్వాగతం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/మేడ్చల్ కలెక్టరేట్:** బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో శుక్రవారం ఎట్‌హోం కార్యక్రమం ఏర్పాటుచేశారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శీతాకాల విడిదిలో భాగంగా ఈ నెల 20న హైదరాబాద్‌కు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆయన బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బసచేశారు. రాష్ట్రపతి శనివారం తిరిగి ఢిల్లీ వెళ్లనున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు ఎట్‌హోం కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు పాల్గొననున్నారు. కాగా, కుటుంబ సమేతంగా కేరళ వెళ్లిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గురువారం తిరిగి హకీంపేట విమానాశ్రయానికి చేరుకోగా, గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌తోపాటు హోంమంత్రి మహమూద్ అలీ, మేడ్చల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎంవీ రెడ్డి తదితరులు ఘనస్వాగతం పలికారు.

## డీఎన్‌ఏను బాగుచేసే ప్రొటీన్

- ఐఐటీహెచ్ పరిశోధకుల ఆవిష్కరణ
- వైద్యరంగంలో సరికొత్త అధ్యాయం

**కంది:** హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీహెచ్) వైద్యరంగంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. అనారోగ్య సమస్యల వల్ల మనిషి దేహంలో పాడైపోయిన డీఎన్‌ఏను బాగుచేయడంతోపాటు క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులను నిరోధించే ప్రొటీన్‌ను ఐఐటీహెచ్ పరిశోధకులు ఆవిష్కరించారు. కేవలం డీఎన్‌ఏను రక్షించడమే కాకుండా పాడైన డీఎన్‌ఏను బాగుచేసి తీవ్రమైన నష్టాన్ని నిరోధించగలిగే పద్ధతులను ప్రకృతే రూపొందించిందని, డీఎన్‌ఏ రిపేర్ ప్రొటీన్లుగా పిలిచే ప్రత్యేక తరగతికి చెందిన ప్రొటీన్లను చైతన్యవంతం చేయగలిగే ఇలాంటి మరమ్మతు వ్యవస్థ మనుషుల్లోనూ ఉన్నదని ఐఐటీహెచ్ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ ప్రొటీన్‌పై పరిశోధనలు జరిపిన బృందానికి ఐఐటీహెచ్ బయోటెక్నాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ అనింద్యారాయ్ నాయకత్వం వహించారని, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలోని 'సెర్బ్' (సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రిసెర్చ్ బోర్డ్) నిధులతో సాగిన ఈ పరిశోధన ఫలితాలు 'జర్నల్ న్యూక్లిక్ యాసిడ్ రిసెర్చ్'లో ప్రచురితమయ్యాయని వివరించింది. ఈ పరిశోధన పత్రాన్ని అనింద్యారాయ్, అరుణ్ గోయల్, రిసెర్చ్ స్కాలర్లు మోనిషా మోహన్, దీప ఆకుల, అరుణ్ ధిల్లాన్ రూపొందించినట్టు తెలిపింది. మనిషిలోని డీఎన్‌ఏకు ఎలాంటి నష్టం జరిగినా దాని ఫలితాలు అనూహ్యంగా ఉంటాయి. ఎలాంటి హాని తలపెట్టని పుట్టుమచ్చలు అకస్మాత్తుగా పుట్టుకురావడం మొదలుకొని క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులవరకు ఇది దారితీస్తుంది. డీఎన్‌ఏ దెబ్బతినకుండా ఉన్నప్పుడే దేహంలోని అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తాయని, అయితే బాహ్యకారకాల వల్ల డీఎన్‌ఏ దెబ్బతినకుండా రక్షించుకోవడంతోపాటు అంతర్గతంగా డీఎన్‌ఏ అస్థిరతకు గురికాకుండా చూసుకోవడం చాలా క్లిష్టమైన విషయమని ఐఐటీహెచ్ వివరించింది.



డీఎన్‌ఏను బాగుచేసే ప్రొటీన్‌పై పరిశోధనలు జరిపిన ఐఐటీహెచ్ బృందం సభ్యులు



## టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగ నిబంధనల్లో మార్పులు

పదవీవిరమణ వయసు 60 ఏండ్లకు పెంపుతో సవరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 ఏండ్ల నుంచి 60కి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సర్వీస్ నిబంధనల్లో మార్పులుచేస్తూ టీఎస్‌ఆర్టీసీ గురువారం నోటిఫికేషన్ జారీచేసింది. టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ రెగ్యులేషన్స్-1964లో మార్పులుచేసినట్టు తెలిపింది. తాజా మార్పులు తక్షణం అమలులోకి వస్తాయని, అధికారులు తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

## మోడల్ స్కూళ్ల టీచర్లకు సర్వీస్‌రూల్స్‌పై అవగాహన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా సర్వీస్‌రూల్స్‌ను వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకున్నది. వీటిపై టీచర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడానికి ఉపాధ్యాయ సంఘాలు పూనుకున్నాయి. గురువారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్ నర్సిరెడ్డి రాష్ట్రస్థాయి అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో మోడల్ స్కూళ్ల టీచర్ల సంఘం అధ్యక్షుడు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పురపోరుకు సమాయత్తం

నేడు టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గం భేటీ ■ మున్సిపల్ ఎన్నికలపై చర్చ

- దిశానిర్దేశం చేయనున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యం
- ఇంచార్జీల నియామకం.. ప్రచారవ్యూహం.. అభ్యర్థుల ఎంపికపై మార్గదర్శకాలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయటమే లక్ష్యంగా టీఆర్‌ఎస్ పార్టీ ముందుకు వెళ్తున్నది. శుక్రవారం తెలంగాణభవన్‌లో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు.. పార్టీ నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, అనుబంధ సంఘాల అధ్యక్షులను ఈ సమావేశానికి ఆహ్వానించారు. జనవరి 7న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్నది. ఇందుకు సంబంధించిన షెడ్యూలును రాష్ట్ర ఎన్నికలసంఘం ఇప్పటికే విడుదలచేసింది. ఈ క్రమంలో ఎన్నికలు జరిగే అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో గులాబీ జెండా ఎగురవేసే విధంగా పక్కా ప్రణాళిక, వ్యూహాన్ని పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇప్పటికే ఖరారుచేశారు. సీఎం వ్యూహాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమలుచేయనున్నారు. శుక్రవారంనాటి సమావేశంలో ఈ వ్యూహంపై విస్తృతంగా చర్చించనున్నారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా పార్టీ ప్రధాన కార్యదర్శులను ఇంచార్జీలుగా ఇప్పటికే నియమించారు. పార్టీ కార్యదర్శులు, రాష్ట్రస్థాయి నాయకులు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని ముఖ్య నేతలను ఇతర జిల్లాలకు ఇంచార్జీలుగా నియమించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒకటి, రెండు మున్సిపాలిటీలకు ఒకరిని బాధ్యులను చేశారు. వీరందరితోనూ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమవుతారు. ఇంచార్జీల్లో ఒకరిద్దరి మార్పు మినహా అందరూ యథావిధిగా కొనసాగుతారు. ఎన్నికల వ్యూహంపై చర్చించిన అనంతరం అభ్యర్థుల ఎంపికపై మార్గదర్శకాలు ఇవ్వనున్నారు. వార్డులు, డివిజన్ల రిజర్వేషన్లు ఖరారైన వెంటనే.. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్నందున అభ్యర్థుల ఎంపికలో జాప్యంచేయకుండా సమర్థులు.. పార్టీ విధేయులు.. గెలుపు గుర్రాలు, ఉద్యమకారులు, సామాజిక సమీకరణాలు.. ఇలా అన్నింటినీ దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులను ఎంపికచేయాలని సూచనలు చేయనున్నారు.

### ప్రచారవ్యూహంపైనా చర్చ

మున్సిపల్ ఎన్నికల ప్రచారవ్యూహంపైనా ఈ భేటీలో చర్చించనున్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రచారం విభిన్నంగా ఉంటుంది. ఇక్కడ ఉద్యోగులు, విద్యార్థులు, విద్యావంతులు, కార్మికులు ఎక్కువసంఖ్యలో ఉంటారు. దీంతోపాటు పట్టణాల్లో సామాజిక, డిజిటల్ మాధ్యమాల ప్రభావం అధికంగా ఉంటుంది కాబట్టి.. ప్రచారంలో వీటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 120 మున్సిపాలిటీలు, పది కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగనున్నాయి. ఔటర్ రింగ్‌రోడ్ లోపల దాదాపుగా 30 వరకు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిని కైవసం చేసుకోవడంలో భాగంగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని ముఖ్యనేతల సేవలను అక్కడ వినియోగించుకోనున్నారు. వీరిని ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఇంచార్జీలుగా నియమించి.. ఎక్కడైనా నాయకుల మధ్య సమన్వయ లోపం కనిపిస్తే వీరిద్వారా సమాచారం తెప్పించుకొని వారిని సమన్వయపరిచేందుకు చర్యలు తీసుకుంటారు. ఈ నెల 30 నుంచి జరుగనున్న ఓటర్ల జాబితా సవరణలోనూ చురుగ్గా పాల్గొని అర్హులైన వారందరికీ ఓటుహక్కు ఉన్నదాలేదా అని మరోసారి పరిశీలించాలని సూచించనున్నారు.




నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించిన పీఆర్టీయూ విద్యాసదస్సులో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ విద్య

- సీఎం కేసీఆర్‌తో టీచర్ల సమస్యలకు పరిష్కారం
- పీఆర్టీయూ విద్యాసదస్సులో హోంమంత్రి మహమూద్ అలీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ కార్పొరేట్‌స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సీఎం కేసీఆర్ 900పైగా గురుకుల పాఠశాలలను ప్రారంభించారని హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. సమాజాభివృద్ధికి విద్యే ప్రధాన ఆయుధమన్నారు. గురువారం హైదరాబాద్ నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో పీఆర్టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసదస్సును మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డితో కలిసి హోంమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను సీఎం కేసీఆర్ పరిష్కరిస్తారని చెప్పారు.

### ఇంగ్లిష్ మీడియంలో తరగతులు

సదస్సులో పీఆర్టీయూ పలు తీర్మానాలు చేసింది. పాఠశాల విద్యావిధానంలో పరిశోధనలు మెరుగుపరచాల్సిన ఆవశ్యకత ఉన్నదని, తరగతి గదిలో నాణ్యత పెంచడానికి వినూత్న పద్ధతులను అనుసరించే విషయాన్ని పరిశీలించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చింది. ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానంగా ఎల్‌కేజీ, యూకేజీ, పూర్వ ప్రాథమిక తరగతులను ఇంగ్లిష్ మీడియంలోనే ప్రారంభించాలని, సీసీఈ విధానంలో మార్పులుచేయాలని విన్నవించింది. ప్రతి మండలంలో సాధారణ గురుకులాలను ఏర్పాటుచేయాలని, ఇంగ్లిష్ మీడియం బడులను ప్రభుత్వమే ప్రత్యేకంగా ప్రారంభించాలని కోరింది. సదస్సులో సంఘం రాష్ట్ర నాయకులు మారెడ్డి అంజిరెడ్డి, ఎం చెన్నయ్య, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, వందేమాతరం ఫౌండేషన్ కార్యదర్శి ఏ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆహ్లాదంగా నాలా గార్డెన్లు

- మురుగునీటిని సహజసిద్ధంగా శుద్ధి చేసే చర్యకు శ్రీకారం
- బేగంపేట ఫ్లైఓవర్ కింద ఆరంభమైన పైలట్ ప్రాజెక్టు
- ఇది విజయవంతం అయ్యాక నగరమంతా అమలుకు ప్రణాళిక
- 2020 ఫిబ్రవరిలోపు పూర్తిచేయాలని హెచ్‌ఎండీఏ లక్ష్యం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ నగరంలో నాలాలను పునరుద్ధరించి, సంరక్షించి, పచ్చదనంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్న మంత్రి కేటీఆర్ ఆదేశాల్ని హెచ్‌ఎండీఏ ఆచరణలో పెడుతున్నది. దశాబ్దాల నుంచి మురికి కూపాలుగా మారిన నాలాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంలో భాగంగా 'నాలా గార్డెన్ల'ను అభివృద్ధిచేయడానికి శ్రీకారం చుట్టింది. పైలట్ ప్రాజెక్టుగా బేగంపేట ఫ్లైఓవర్ దిగువ భాగంలో దాదాపు 40,550 చదరపు మీటర్ల స్థలాన్ని వృద్ధిచేస్తున్నది. ఇందుకు సంబంధించిన ప్రాథమిక పనులు వేగంగా జరుగుతున్నాయి. 2020 ఫిబ్రవరిలోపు పైలట్ ప్రాజెక్టును పూర్తిచేయాలన్న లక్ష్యాన్ని హెచ్‌ఎండీఏ నిర్దేశించుకున్నది. ఇది విజయవంతమయ్యాక నగరంలోని నాలాలన్నింటిని హరితమయంచేస్తారు. హైదరాబాద్ భౌగోళిక పరిస్థితుల్ని నిశితంగా గమనిస్తే.. వర్షాలు పడ్డప్పుడు నీళ్లన్నీ వరద నీటి కాల్వల ద్వారా చెరువులు, కాల్వల్లోకి వెళ్లి.. అక్కడ్నుంచి నదుల్లోకి వెళ్లి కలుస్తాయి. శరీరంలోని నీలం నాళము చెడు రక్తాన్ని ఏ విధంగా శుద్ధి చేస్తుందో అదే విధంగా, వరద కాల్వల్లోని మురికినీటిని సంప్రదాయ పద్ధతుల్లో శుద్ధిచేసి సురక్షితమైన నీటిని అందించే కాన్సెప్టే.. నాలా గార్డెన్లని నిపుణులు చెప్తున్నారు. 'దీన్ని బ్లూ గ్రీన్ వెయిన్ కనెక్టివిటీ'గా హెచ్‌ఎండీఏ అభివర్ణించింది.



హెచ్‌ఎండీఏ రూపొందించిన నాలా గార్డెన్ నమూనా చిత్రాలు



### ఇక్కడే అభివృద్ధి..

కూకట్‌పల్లి, జీడిమెట్ల, యూసుఫ్‌గూడా వంటి ప్రాంతాల నుంచి వచ్చే మురుగు, రసాయన వ్యర్థాలన్నీ కూకట్‌పల్లి నాలా ద్వారా ప్రవహిస్తున్నది. ఇది ప్రధానంగా బేగంపేట్ ఫ్లైఓవర్ కింది ప్రాంతం నుంచి ప్రవహిస్తూ హుస్సేన్‌సాగర్‌లో కలుస్తుంది. బేగంపేట్ ఫ్లైఓవర్ దిగువ భాగంపై ఇప్పటివరకూ ఎవరూ పెద్దగా దృష్టి సారించకపోవడంతో అరాచకశక్తులకు అడ్డాగా మారింది. రాత్రిపూట అక్కడ్నుంచి నడుచుకుంటూ వెళ్లాలంటే మహిళలు, వృద్ధులు భయపడాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపెట్టాలని మంత్రి కేటీఆర్ హెచ్‌ఎండీఏకు ఆదేశించారు. నాలాల అభివృద్ధిపై ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన కాన్సెప్ట్‌లను విస్తారంగా అధ్యయనంచేసిన హెచ్‌ఎండీఏ అధికారులు పుణెలో 300 కిలోమీటర్ల మేర నాలాలను సుందరీకరించిన విధానం వైపు మొగ్గుచూపారు. ఇంచుమించు ఇదే రీతిలో హైదరాబాద్ మొత్తం నాలాలను అభివృద్ధిచేయాలని మంత్రి కేటీఆర్ నిర్ణయం తీసుకున్నారు.

### ఎలా సుందరీకరిస్తారు?

- ముందుగా బేగంపేట నాలా ప్రవాహానికి ఎలాంటి అడ్డంకుల్లేకుండా చెత్తా, చెదారం, నిర్మాణ వ్యర్థాలు, ఇతరత్రా వ్యర్థ సామగ్రిని తొలగిస్తారు.
- ఆ తర్వాత మురుగునీటిని శుద్ధి చేసేందుకు అవసరమయ్యే క్యానా, అంబ్రెల్లా గ్రాస్, టైఫా, మూసా వంటి మొక్కల్ని అభివృద్ధిచేస్తారు.
- మొక్కల్లోనే ఆక్సిజన్ తయారవ్వడం వీటి ప్రత్యేకత. వాటిద్వారా సహజసిద్ధంగానే మురుగు మొత్తం శుద్ధి అవుతుంది.ఈ ప్రక్రియను రూట్‌జూన్ ట్రీట్‌మెంట్ అని పిలుస్తారు. ఒకవేళ వర్షాకాలంలో వరదలు పెరిగితే, ఈ మొక్కలన్నీ నీటిలో మునిగిపోతాయి. వరదనీటి ఉధృతి తగ్గినప్పుడు మొక్కలుగా యథావిధిగానే బయటికి కనిపిస్తాయి.
- నాలాకు ఇరువైపుల గల ప్రాంతాల్ని తివాచీ పర్చిన పచ్చదనం తరహాలో అభివృద్ధిచేస్తారు. పాదాచారులకు ఆహ్లాదకరమైన రీతిలో ఉద్యానవనాల్ని తీర్చిదిద్దుతారు. ప్రజలు సరదాగా గడిపేందుకు యాంఫీ థియేటర్, ప్రశాంతంగా కూర్చుని కబుర్లు చెప్పుకోవడానికి గజిబోలు, ఫిష్ పాండ్, సైకిల్ జోన్ వంటివి అభివృద్ధిచేస్తారు. నాలాకు ఇరువైపులా పది అడుగుల మేర రహదారిని ఏర్పాటుచేస్తారు. రోడ్డుకి ఒకవైపు కొబ్బరిచెట్లు పెంచుతారు.

### నాలా గార్డెన్ల ప్రయోజనాలివే..

- మురుగునీటిని శుద్ధిచేయడం వల్ల దోమల బెడద ఉండదు. దీంతో డెంగ్యూవ్యాధి ప్రబలే అవకాశం తగ్గుతుంది. ఫలితంగా ప్రజల ఆరోగ్యం మెరుగవుతుంది. జ్వరాల బారిన పడే అవకాశాలు తగ్గుతాయి.
- గ్రీన్‌బెల్ట్ అభివృద్ధిచేయడం వల్ల ప్రజలకు ఆహ్లాదకరమైన పార్కులు అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా ప్రజలు తీరిక వేళల్లో ప్రశాంతంగా గడిపేందుకు వీలు కలుగుతుంది.
- రాత్రి కాగానే అనైతిక కార్యకలాపాలకు కేంద్రాలుగా నాలా పరిసర ప్రాంతాలు మారుతున్నాయి. నాలా గార్డెన్ కాన్సెప్టు వల్ల నిర్మానుష్యంగా ఉండే ప్రాంతాలన్నీ నందనవనంగా మారుతాయి. అక్కడే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం, సెక్యూరిటీ సిబ్బందిని నియమించడం వల్ల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.
- స్థానిక ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లడానికి రహదారుల మీదకు వెళ్లక్కర్లేదు. ఈ గార్డెన్ల మీదుగా సులువుగా నడుచుకుంటూ వెళ్లొచ్చు.

### ముహూర్తం



సూర్యోదయం: 6.46 గంటలకు



సూర్యాస్తమయం: 5.40 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం పాడ్యమి ఉదయం 10.40 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: పూర్వాషాఢ సాయంత్రం 5.30 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, అమృతఘడియలు: మధ్యాహ్నం 12.35 నుంచి 2.13 వరకు, రాహుకాలం: ఉదయం 10.52 నుంచి మధ్యాహ్నం 12.14 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.58 నుంచి 9.41 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.36 నుంచి 1.20 వరకు, వర్జ్యం: అర్ధరాత్రి 1.54 నుంచి తె.జా. 3.36 వరకు.

## ఎన్నికలకు సన్నద్ధం

11 సర్పంచ్, 3 ఎంపీటీసీ, 119 వార్డుల

- వచ్చే నెల 21న ముసాయిదా, 28న తుది ఓటరు జాబితా విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వాయిదాపడిన సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతున్నది. ఇందులో భాగంగా ఆయా గ్రామాలు, వార్డులవారీగా ఓటరు జాబితా సిద్ధంచేయాలని ఆదేశాలిచ్చింది. మొత్తం 11 సర్పంచ్ స్థానా లు, 3 ఎంపీటీసీ స్థానాలతోపాటు 119 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా వచ్చేనెల 21న ఆయా గ్రామాల్లో ఓటర్ల జాబితా ముసాయిదా విడుదలచేయాలని షెడ్యూల్ విడుదల చేశారు. జనవరి 22న జిల్లాస్థాయిలో రాజకీయ పక్షాలతో, జనవరి 23న మండలస్థాయిలో రాజకీయ పక్షాలతో సమావేశం ఏర్పాటుచేయాలని షెడ్యూల్‌లో వివరించారు. 21 నుంచి 24వ తేదీవరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించాలని, 27 వరకు అభ్యంతరాలన్నీ పరిష్కరించి జనవరి 28న తుది జాబితా విడుదలచేయాలని ఆదేశించారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మర్లవాయి, మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం కోనాయిపల్లి, నాగర్‌కర్నూల్ జిల్లా గాగిళ్లపల్లి ఎంపీటీసీ స్థానాలకు ఓటరు జాబితా షెడ్యూల్ విడుదలచేశారు. ఆదిలాబాద్ జిల్లా అంకోలి, బేల మండలం కొగ్దూర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముల్కలపల్లి మండలం ముక్కమామిడి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం బోర్నపల్లి, కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ధర్మారం, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి, నెల్లికుదురు మండలం నైనాల, నల్లగొండ జిల్లా గుండ్లపల్లి మండలం రెహమత్‌పూర్, నిడమనూరు మండలం గుంటుకగూడెం, నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలం తుంబర్నీ, సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం దౌల్తాబాద్ పంచాయతీ సర్పంచ్‌స్థానాలకు ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. 119 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతుండగా.. ఈ వార్డుల్లో ఓటరు జాబితా షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం రాత్రి విడుదలచేసింది.

## జూనియర్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు

దరఖాస్తు గడువు మార్చి 31, మేలో అనుమతికి త్వరలో నోటిఫికేషన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలకు 2020-21 విద్యాసంవత్సరానికి అఫిలియేషన్ (అనుబంధ గుర్తింపు) ఇవ్వడానికి ఇంటర్‌బోర్డు చర్యలు తీసుకుంటున్నది. వచ్చే సంవత్సరం మార్చి 31లోగా అఫిలియేషన్ల కోసం దరఖాస్తులను స్వీకరించి, మే నెలలోగా అఫిలియేషన్ల ప్రక్రియ పూర్తిచేయాలన్న సంకల్పంతో ఇంటర్‌బోర్డు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆన్‌లైన్ ఆఫిలియేషన్‌కు దరఖాస్తులను స్వీకరిస్తామని, త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

## బీసీ రిజర్వేషన్లను పెంచాలి

బీసీ సంఘాల ప్రతినిధుల డిమాండ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా బీసీ జనాభా అసలు లెక్కలు తేల్చాలని, బీసీ రిజర్వేషన్ల పెంపుపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని బీసీ సంఘాల ప్రతినిధులు డిమాండ్‌చేశారు. గురువారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో నిర్వహించిన బీసీ సంఘాల జాతీయ సమావేశంలో తెలంగాణ తరఫున బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచాల యుగంధర్‌గౌడ్, ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకర్‌రావు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుచేయాలని, 2021లో చేపట్టే జనాభా లెక్కలను కుల ప్రాతిపదికన చేపట్టాలని బీసీ సంఘాలు ప్రతిపాదించాయి.

### లోకం పోకడ




స్కూలు ఫీజులు కట్టడానికి ఆ మాత్రం కష్టపడకుంటే ఎలా సార్? పైగా ఇంటర్నేషన్ స్కూలు!

# నెలవంకలా సూరీడు

ఆకాశంలో అద్భుతావిష్కరణ ■ పదేండ్ల తర్వాత సంపూర్ణ సూర్యగ్రహణం

ఆసక్తిగా వీక్షించిన ప్రజలు, విద్యార్థులు ■ మూతపడ్డ ఆలయాలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఆకాశంలో గురువారం ఉదయం అద్భుతం ఆవిష్కారమైంది. దాదాపు పదేండ్ల తర్వాత రాష్ట్రమంతటా సంపూర్ణ సూర్యగ్రహణం కనువిందుచేసింది. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలు, విద్యార్థులు ఆసక్తిగా గ్రహణాన్ని వీక్షించారు. ఉదయం 8.03 గంటలకు ప్రారంభమైన గ్రహణం 11.11 గంటలకు పూర్తయింది. పట్టపగలే సూర్యుడు నెలవంకలా మారడం అపూర్వంగా దృశ్యమానమైంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గ్రహణం చూసేందుకు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. హైదరాబాద్‌లో బిర్లా సైన్స్ సెంటర్‌లో టెలిస్కోప్‌లు, బైనాక్యులర్లు, సన్‌రేస్ ఫిల్టర్లతో గ్రహణాన్ని చూడటానికి సదుపాయాలు కల్పించారు. పెద్దఎత్తున యువకులు సైన్స్ సెంటర్ చేరుకొని గ్రహణాన్ని చూశారు. ఆకాశం కొంతమేర మేఘావృతం కావడంతో గ్రహణం పాక్షికంగా కనిపించిందని సైన్స్ సెంటర్ డైరెక్టర్ బీజీ సిద్ధార్థ తెలిపారు. పీపుల్స్ ప్లాజా వద్ద బ్రేక్‌త్రూ సొసైటీ గ్రహణాన్ని చూడటానికి ఏర్పాట్లుచేసింది. వీక్షకులకు సన్‌రేస్ ఫిల్టర్లను అందజేసింది.

### ఆలయాల్లో సంప్రోక్షణ

గ్రహణాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని అన్ని దేవాలయాలు మూతపడ్డాయి. వేములవాడ, భద్రాచలం, వరంగల్ భద్రకాళి, జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మదేవాలయం, సికింద్రాబాద్‌లోని మహంకాళి, బిర్లామందిర్, చిల్కూరు బాలాజీ తదితర ప్రధాన దేవాలయాలు గ్రహణం కారణంగా మూతపడ్డాయి. 11.11 గంటలకు గ్రహణం వీడిన తర్వాత సంప్రోక్షణ నిర్వహించి.. తిరిగి దైవదర్శనాలకు అనుమతించారు.



ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద జన విజ్ఞానవేదిక ఏర్పాటుచేసిన సన్‌రేస్ ఫిల్టర్లతో సంపూర్ణ సూర్యగ్రహణాన్ని వీక్షిస్తున్న దృశ్యం.



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామంలో సూర్యగ్రహణం సందర్భంగా తాంబాలంలో పసుపు నీటిని పోసి రోకలిని నిలబెట్టిన స్థానికులు

# చలిగాలులు తీవ్రతరం

- నేడు రాష్ట్రంలో ఓ మోస్తరు వానలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్/ హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో చలిగాలుల తీవ్రత పెరుగుతున్నది. శుక్రవారం నుంచి రానున్న మూడ్రోజులు చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్న గాలులతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశాలున్నట్టు పేర్కొన్నది. కామెరూన్ ప్రాంతం నుంచి దక్షిణ తమిళనాడు వరకు 0.9 కి.మీ. ఎత్తువరకు విస్తరించి ఉన్న ఉపరితల ద్రోణి ప్రభావంతో శుక్రవారం అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురువొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గురువారం మెదక్‌లో 15.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, నల్లగొండలో 16.4 డిగ్రీలు, ఖమ్మంలో 18.6 డిగ్రీలు, హకీంపేట, దుండిగల్‌లో 18.7 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయిందని చెప్పారు.

**గ్రేటర్ హైదరాబాద్‌లో 20.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత**

గ్రేటర్ హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగి చలి తీవ్రత తగ్గుముఖం పట్టింది. వారంరోజుల వరకు ఉష్ణోగ్రతలు ఇదే తరహాలో ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. నగరంలో గురువారం గరిష్ఠ ఉష్ణోగ్రత 28.2 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 20.6 డిగ్రీలు, గాలిలో తేమ 58 శాతంగా నమోదైందని చెప్పారు.

# ఆర్టీసీలో సంచార బయోటాయిలెట్స్

- నేడు ప్రారంభించనున్న రవాణాశాఖ మంత్రి పువ్వాడ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ ఉద్యోగుల కోసం సంచార బయోటాయిలెట్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. మహిళా ఉద్యోగులకు టాయ్‌లెట్స్, దుస్తులు మార్చుకునే ప్రత్యేక గదులు ఏర్పాటుచేయాలని ప్రగతిభవన్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు డిపోల్లో తాత్కాలిక ప్రాతిపదికన టాయిలెట్స్ ఏర్పాటుచేశారు. దీర్ఘకాలం ఉండేలా పురుష, మహిళా ఉద్యోగులకు చేంజ్ ఓవర్ పాయింట్లలో సంచార బయోటాయిలెట్లను ఏర్పాటుచేస్తున్నారు. పాత బస్సుల్లో పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా టాయిలెట్లను ఏర్పాటుచేశారు. నగరంలో 9 చేంజ్ ఓవర్ పాయింట్లలో మొదటవీటిని ఏర్పాటుచేస్తున్నారు. ఆర్టీసీ ఉద్యోగులతో శుక్రవారం శామీర్‌పేటలో జరిగే వనభోజనాల సందర్భంగా రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఈ బస్సులను ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.




మొబైల్ బయోటాయిలెట్



బస్సులో ఏర్పాటుచేసిన మరుగుదొడ్డి, ఇతర సదుపాయాలు

# ఫిబ్రవరి 1 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- పాతపద్ధతిలోనే పరీక్షలు.. ఏర్పాట్లలో బోర్డు
- ప్రైవేటు జూనియర్ కాలేజీలపై నిఘా పెంచండి
- డీఐఈవోలకు ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఫిబ్రవరి ఒకటి నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈసారి కూడా పాత విధానంలోనే పరీక్షలు నిర్వహించనున్నట్టు బోర్డు అధికారులు తెలిపారు. పరీక్షలకు గంటముందుగా యూజర్‌ఐడీ, పాస్‌వర్డ్ సాయంతో ప్రాక్టికల్ పరీక్షల ప్రశ్నపత్రాలను డౌన్‌లోడ్ చేసుకుంటారు. పరీక్షలు నిర్వహించిన రెండు లేదా మూడు గంటల్లోనే విద్యార్థులకు వచ్చిన మార్కులను తిరిగి ఇంటర్‌బోర్డు కార్యాలయానికి చేరేలా అప్‌లోడ్ చేయాల్సి ఉన్నది. ఈ విషయంపై బోర్డు అధికారులు ప్రిన్సిపాళ్లకు అవగాహన కల్పించనున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల యాజమాన్యాలు నిర్వహించే ప్రాక్టికల్స్ పరీక్షలను క్షుణ్ణంగా అధ్యయనంచేయాలని ఇంటర్‌బోర్డు అధికారులు జిల్లా ఇంటర్ విద్యాధికారుల (డీఐఈవో)ను ఆదేశించారు. ఎంసెట్ పరీక్షలకు 25 శాతం వెయిటేజీ, జేఈఈ పరీక్షలకు 75 శాతానికిపైగా మార్కులు రావాలనే నిబంధన ఉన్న నేపథ్యంలో ప్రాక్టికల్స్ మార్కులు కీలకమైన సంగతి తెలిసిందే. ఇంటర్‌లో ప్రతిభావంతులైన సైన్స్ గ్రూప్ విద్యార్థులకు అన్యాయం జరుగకుండా ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో అన్ని పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

# విదేశీ విద్యార్థి ఆత్మహత్య

- ఊపిరాడకుండా ముఖానికి ప్లాస్టిక్‌కవర్ బిగించుకొని బలవన్మరణం
- మృతదేహం ఇథియోపియాకు తరలింపు

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి, ఇథియోపియా దేశానికి చెందిన ఖలీద్ ములేట బలి (33) ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఖలీద్ ములేట బలి ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్‌డీచేస్తూ.. తార్నాకలోని ఇంటర్నేషనల్ హాస్టల్‌లో 109వ గదిలో ఉంటున్నాడు. ఆయనకు వివాహమై భార్య, ఒక పాప ఉన్నారు. కొంతకాలంగా ఖలీద్ మానసిక ఒత్తిడికి లోనవుతున్నాడు. ఈ క్రమంలో అతడిని స్వదేశానికి పంపించేందుకు స్నేహితులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఇంతలో గత శనివారం రాత్రి తనగదిలోని బాత్‌రూంలో తొలుత మాత్రలు మింగి, ప్లాస్టిక్ కవర్ మొహానికి కట్టుకుని ఊపిరాడకుండా చేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన స్నేహితుడు జరాడం ఏషివాస్ ఆదివారం ఉదయం ఖలీద్ గది తలుపులు ఎంత కొట్టినా తెరువకపోవడంతో వాచ్‌మెన్‌సాయంతో తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అప్పటికే ఖలీద్ బాత్‌రూంలో నిర్జీవంగా పడిఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని దవాఖానకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి, మంగళవారం స్వదేశానికి పంపించారు. హాస్టల్ కేర్‌టేకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సంక్రాంతికి 4,940 బస్సులు

- జనవరి 9 నుంచి 14వ తేదీ వరకు నడుపనున్న ఆర్టీసీ
- హైదరాబాద్ నుంచి జిల్లాలకు, ఏపీకి సౌకర్యం




**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** సంక్రాంతికి టీఎస్‌ఆర్టీసీ సిద్ధమైంది. ప్రజలు సొంతూళ్లకు వెళ్లేందుకు రవాణా సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపట్టింది. జనవరి 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ముఖ్య కూడళ్లతోపాటు శివార్ల నుంచి 4,940 అదనపు బస్సులను తెలంగాణలోని అన్ని జిల్లాలతోపాటు ఇతర రాష్ర్టాల్లోని ముఖ్యప్రాంతాలకు నడపడానికి ప్రణాళికలు రూపొందించింది. గురువారం ఎంజీబీఎస్‌లో ఆర్టీసీ ఉన్నతాధికారులు, జిల్లాల ఆర్‌ఎంలతో సంక్రాంతి ఆపరేషన్స్‌పై చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ మునిశేఖర్ సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు జనవరి 9వ తేదీ నుంచి 14 వరకు 4,940 అదనపు బస్సులను నడుపనున్నట్టు తెలిపారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని 10వ తేదీ నుంచి అదనపు బస్సుల సంఖ్య పెంచుతామని చెప్పారు. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్, జూబ్లీ బస్‌స్టేషన్, దిల్‌సుఖ్‌నగర్, లింగంపల్లి, చందానగర్, కేపీహెచ్‌బీ, ఎస్సార్‌నగర్, అమీర్‌పేట, టెలిఫోన్ భవన్, ఈసీఐఎల్, ఉప్పల్ క్రాస్‌రోడ్, ఎల్బీనగర్ పాయింట్ల నుంచి ప్రత్యేక బస్సులు నడుపడానికి ఏర్పాట్లుచేశామని తెలిపారు. ప్రతి పాయింట్ వద్ద ప్రత్యేక అధికారులను నియమించినట్టు పేర్కొన్నారు. ప్రయాణికులకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ఇందుకోసం www.tsrtconline.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని మునిశేఖర్ కోరారు.

**ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య ప్రాంతాలకు సదుపాయం**

ఏపీలోని విజయవాడ, విజయనగరం, తెనాలి, గుంటూరు, గుడివాడ, రాజమండ్రి, కాకినాడ, రాజోలు, పోలవరం, మచిలీపట్నం, ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, విశాఖపట్నం, శ్రీకాకుళం, భీమవరం, నర్సాపురం, కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, ఉదయగిరి, కనిగిరి, కందుకూరు, పామూరు, పొదిలి తదితర ప్రాంతాలకు సంక్రాంతికి ప్రత్యేక బస్సులు నడిపించనున్నట్టు మునిశేఖర్ తెలిపారు. రాష్ట్రంలో 3,414, ఏపీకి 1,526 అదనపు బస్సులు నడుపనున్నట్టు చెప్పారు. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే జనవరి 10న 965 బస్సులు, 11న 1463, 12న 1181, 13న 1152 బస్సులను అదనంగా నడిపిస్తామని వివరించారు. సమీక్షా సమావేశంలో వివిధ జిల్లాల ఆర్‌ఎంలు వరప్రసాద్, కేఎస్ ఖాన్, యుగేందర్, రాజశేఖర్, వెంకన్న, ఉషాదేవి, డీ విజయభాస్కర్, శ్రీధర్, జీవన్ ప్రసాద్, సాలొమన్, కృష్ణమూర్తి, డివిజన్, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

**వివిధ ప్రాంతాలకు అందుబాటులో బస్సులు**

**జేబీఎస్ నుంచి:** కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలకు వెళ్లే బస్సులు.
**ఉప్పల్ క్రాస్‌రోడ్స్, ఉప్పల్ బస్‌స్టేషన్ నుంచి:** యాదగిరిగుట్ట, జనగామ, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూర్, వరంగల్ వైపు వెళ్లే బస్సులు
**సీబీఎస్ నుంచి:** కర్నూలు వైపు, తిరుపతి, మాచర్ల, ఒంగోలు, నెల్లూరు వైపు, అనంతపురం, గుత్తి, పుట్టపర్తి, ధర్మవరం, మదనపల్లి వైపు వెళ్లే బస్సులు.

**ఎంజీబీఎస్ నుంచి వెళ్లే బస్సులు**

| ప్లాట్‌ఫాం | వివిధ ప్రాంతాలకు బస్సులు |
|---|---|
| 01-05 | గరుడ ప్లస్, గరుడ, అంతర్రాష్ట్ర షెడ్యూలు |
| 06-07 | బెంగళూరు వైపు |
| 10-13 | ఖమ్మం వైపు |
| 14-15 | దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్‌కు 15 నిమిషాలకో సిటీ బస్సు నడుస్తుంది. |
| 18-19 | ఉప్పల్ ఎక్స్‌రోడ్డుకు 15 నిమిషాలకో బస్సు |
| 23-25 | శ్రీశైలం, కల్వకుర్తి |
| 26-31 | రాయచూర్, మహబూబ్‌నగర్ |
| 32-34 | నాగర్‌కర్నూల్, షాద్‌నగర్ |
| 35-36 | విజయవాడ, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, గుంటూరు |
| 41-42 | పెబ్బేరు, కొత్తకోట, గద్వాల |
| 46-47 | మెదక్, బాన్సువాడ, బోధన్ |
| 48-52 | జహీరాబాద్, బీదర్, సంగారెడ్డి, నారాయణఖేడ్ |
| 53-55 | జేబీఎస్‌కు 10 నిమిషాలకో బస్సు |
| 56-58 | నాగ్‌పూర్, అమరావతి, నాందేడ్, అకోలా |
| 62 | దేవరకొండ |
| 63-65 | పరిగి, తాండూరు, వికారాబాద్ |

## సంక్రాంతికి 28 ప్రత్యేక రైళ్లు

- లింగంపల్లి - కాకినాడ మధ్య నడుపనున్న దక్షిణమధ్య రైల్వే

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సంక్రాంతి పండుగ దృష్ట్యా ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు జనవరి 1వ తేదీ నుంచి నెల చివరి వారం వరకు లింగంపల్లి –కాకినాడ టౌన్ మధ్య 28 సూపర్‌ఫాస్ట్ ఏసీ ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్టు దక్షిణమధ్య రైల్వే గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. లింగంపల్లి నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక రైళ్లు బేగంపేట, సికింద్రాబాద్, వరంగల్, ఖమ్మం, రాయనపాడు, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి స్టేషన్లమీదుగా కాకినాడకు రాకపోకలు సాగిస్తాయని వెల్లడించింది. ఈ రైళ్లలో ఒక ఏసీ ఫస్ట్ క్లాస్, 3 ఏసీ టూ టైర్, 12 ఏసీ త్రీ టైర్ కోచ్ సదుపాయాలున్నాయని పేర్కొన్నది.

## ఆలస్యంగా బయలుదేరనున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్– న్యూఢిల్లీ మధ్య నడిచే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం రెండుగంటలు ఆలస్యంగా బయలుదేరనున్నదని దక్షిణమధ్య రైల్వే గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సాధారణంగా హైదరాబాద్ నుంచి ఉదయం 6.25 గంటలకు బయలుదేరాల్సిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్.. శుక్రవారం మాత్రం ఉదయం 8.25 గంటలకు బయలుదేరుతుందని, ప్రయాణికులు సహకరించాలని కోరింది.

## వరంగల్ లైంగికదాడి కేసులో చార్జిషీట్ దాఖలు

**వరంగల్ క్రైం:** వరంగల్ యువతిపై లైంగికదాడి కేసులో సుబేదారి పోలీసులు గురువారం చార్జిషీట్ దాఖలుచేశారు. నవంబర్ 28వ తేదీన జరిగిన ఈ ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించిన పోలీసులు.. 28 రోజుల్లోనే కోర్టులో చార్జిషీట్ దాఖలుచేయడం విశేషం. నిందితుడు సాయి తన స్నేహితురాలిని నమ్మించి, బయటకు తీసుకెళ్లి, లైంగికదాడికి పాల్పడి, హత్య చేసినట్టు ఆరోపణలున్నాయి. నిందితుడు ఆ యువతిని కారులో తీసుకెళ్లిన ప్రాంతాలతోపాటు, దుస్తులు కొనుగోలుచేసిన షాపులోని సీసీ ఫుటేజీలను సేకరించిన పోలీసులు వాటిని న్యాయస్థానానికి అందజేశారు.

## సమత కేసులో ఐదుగురు సాక్షుల విచారణ

**ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** ఆదిలాబాద్ ప్రత్యేక కోర్టులో ఏడోరోజైన గురువారం సమత కేసు విచారణ కొనసాగింది. ఆదిలాబాద్ జైలు నుంచి ముగ్గురు నిందితులు షేక్ బాబా, షేక్ షాబొద్దీన్, షేక్ మగ్దూమ్‌ను పోలీసులు బందోబస్తు మధ్య ప్రత్యేక కోర్టుకు తీసుకొచ్చారు. షెడ్యూల్ ప్రకారం ఏడోరోజు ఎనిమిది మంది సాక్షులకుగాను కోర్టు ఐదుగురిని విచారించింది. అనంతరం కేసు విచారణను శుక్రవారానికి వాయిదావేసింది. నిందితులను తిరిగి ఆదిలాబాద్ జైలుకు తరలించారు.

# పెరుగుతున్న ఖైదీలు

- 2017లో దేశవ్యాప్తంగా అన్ని జైళ్లలో 4.45 లక్షల ఖైదీలు
- శిక్ష ఖరారైనవారిలో సగం మంది 30-50 ఏండ్ల లోపువారే
- మొదటిస్థానంలో యూపీ.. 20వ స్థానంలో తెలంగాణ
- జాతీయ నేర రికార్డు బ్యూరో గణాంకాలు విడుదల



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

దేశంలో ఏయేటికాయేడు నేరాల సంఖ్య పెరుగుతున్నది. ఖైదీలతో దేశవ్యాప్తంగా జైళ్లు నిండుతున్నాయి. గతంలో పోలిస్తే శిక్షల ఖరారుశాతం పెరుగుతున్నప్పటికీ ఖైదీల సంఖ్య మాత్రం తగ్గడంలేదు. 2012 సంవత్సరం కంటే.. 2017లో శిక్ష ఖరారైనవారి సంఖ్య 9.3శాతం పెరిగినట్టు నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) 2017 నివేదిక వెల్లడించింది. అదేసమయంలో అండర్ ట్రయల్ ఖైదీల సంఖ్యలోనూ 22.2శాతం పెరుగుదల నమోదైంది. 2017 డిసెంబర్ 31 నాటికి దేశవ్యాప్తంగా అన్ని జైళ్లలో 4,45,779 మంది ఖైదీల్లో 1, 36,922 మంది ఖైదీలకు శిక్ష ఖరారుకాగా 3,06,468 మంది అండర్ ట్రయల్ ఖైదీలు ఉన్నారు. మరో 2,096 మంది విచారణ ఎదుర్కోవాల్సి ఉన్నది. 96,040 మంది ఖైదీలతో ఉత్తరప్రదేశ్ మొదటిస్థానంలో ఉండగా.. తర్వాత బీహార్ (40,086), మధ్యప్రదేశ్ (38,638) ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం 20వ స్థానంలో ఉన్నది. రాష్ట్రంలోని అన్ని జైళ్లలో కలిపి 2017లో 5516 మంది ఖైదీలున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి.

**50 ఏండ్ల లోపువారే ఎక్కువ**

జైళ్లలోని శిక్ష ఖరారైన ఖైదీలను వయసులవారీగా వర్గీకరిస్తే.. 30 నుంచి 50 ఏండ్ల లోపువారే అధికంగా ఉన్నట్టు తెలుస్తున్నది. 2017లో దేశవ్యాప్తంగా జైళ్లలో శిక్ష ఖరారైన ఖైదీలసంఖ్య 1,36,922 కాగా, వీరిలో 49.77శాతం (68,147) మంది 30 ఏండ్ల నుంచి 50 ఏండ్లలోపు వారని ఎన్సీఆర్బీ నివేదిక వెల్లడించింది. 18 నుంచి 30 ఏండ్లలోపు వారు 30.89 శాతం(42,291 మంది), 50 ఏండ్లు, ఆ పైబడినవారు 19.34 శాతం (26,483 మంది ఖైదీలు) ఉన్నట్టు ఎన్సీఆర్బీ గణాంకాలు వెల్లడించాయి.

**దేశవ్యాప్తంగా జైళ్లలో ఖైదీల సంఖ్య 2012 నుంచి 2017 వరకు పరిశీలిస్తే..**

| ఏడాది | అండర్ ట్రయల్ ఖైదీలు | శిక్ష ఖరారు అయిన ఖైదీలు |
|---|---|---|
| 2012 | 2,50,873 | 1,25,306 |
| 2013 | 2,74,150 | 1,27,155 |
| 2014 | 2,79,303 | 1,29,022 |
| 2015 | 2,78,281 | 1,31,815 |
| 2016 | 2,89,800 | 1,33,317 |
| 2017 | 3,06,468 | 1,36,922 |

## శాంతిభద్రతల్లో హైదరాబాద్ బెస్ట్

- ఈ ఏడాది నగరంలో 3 శాతం తగ్గిన నేరాలు
- సిటీ పోలీస్ వార్షిక నివేదిక విడుదలలో సీపీ అంజనీకుమార్



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** శాంతిభద్రతల పరిరక్షణలో హైదరాబాద్ బెస్ట్ సిటీగా గుర్తింపు పొందుతున్నదని పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ చెప్పారు. ఈ ఏడాది హైదరాబాద్‌లో 3 శాతం క్రైమ్‌రేట్ తగ్గిందని తెలిపారు. 2019లో నగర పోలీస్ కమిషనరేట్ పనితీరును వివరిస్తూ నేరాలు, శాంతిభద్రతలకు సంబంధించిన వార్షిక నివేదికను ఇతర ఉన్నతాధికారులతో కలిసి సీపీ అంజనీకుమార్ గురువారం కోఠి ఉమెన్స్ కాలేజీలో విడుదలచేశారు. వచ్చే ఏడాది నుంచి హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రతి స్టేషన్‌లో సైబర్ విభాగాన్ని ఏర్పాటుచేయనున్నట్టు ఆయన చెప్పారు. నగరంలో 2018లో 16,084 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 15,598 కేసులు నమోదయ్యాయని చెప్పారు. చైన్‌స్నాచింగ్‌లు 30 శాతం తగ్గాయని, ఈ ఏడాది 14 స్నాచింగ్‌లే జరిగాయన్నారు. ఈ ఏడాది సాధారణ ఎన్నికల వేళ రూ.26.78 కోట్ల సొత్తును స్వాధీనం చేసుకున్నామని, పోలీసుల పటిష్ఠ నిఘాతోనే ఇది సాధ్యమైందని తెలిపారు. నేరాల తగ్గుదలతోపాటు శిక్షలశాతం 34 నుంచి 42 శాతానికి పెరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాలు పది శాతంకంటే ఎక్కువ పెరుగగా, అందులో పాదచారుల మరణాలు 20 శాతం వరకు తగ్గాయని అంజనీకుమార్ వివరించారు.



కుటుంబసభ్యులతో కలిసి సూగురేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న రైతు సత్యాంజనేయులు

# నిత్యాన్నదానానికి తొలి పంట

- సూగురేశ్వర స్వామికి 36 క్వింటాళ్ల బియ్యం వితరణ
- భక్తిని చాటుకున్న మక్తల్ వాసి

**నారాయణపేట ప్రతినిధి/నమస్తే తెలంగాణ:** అన్నదానాన్ని మించిన దానం ఈ లోకంలో మరేముంటుంది? అది కూడా దేవుడిపేరుతో చేస్తే మరింత సంతృప్తినిస్తుంది. నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన రైతు తన పొలంలో మొట్టమొదటిసారి పండించిన పంటనంతా.. దేవుడికి సమర్పించుకున్నాడు. ఆలయంలో నిత్యాన్నదానం చేయాలని అధికారులను కోరాడు. మక్తల్ లయన్స్ క్లబ్ కమిటీ సభ్యుడు, రైతు అయిన సత్యాంజనేయులు రెండేండ్ల కిందట పొలం కొన్నాడు. సత్యాంజనేయులు కర్ణాటక రాష్ట్రంలోని దేవసూగూర్‌లో ఉన్న సూగురేశ్వరస్వామి భక్తుడు. ఆ పొలం ద్వారా మొదటిసారి వచ్చే పంటనంతా సూగురేశ్వరస్వామికి సమర్పిస్తానని మొక్కుకున్నాడు. అనుకున్నట్టుగానే ఇటీవల సత్యాంజనేయులు పొలంలో వరి దిగుబడి వచ్చింది. మొత్తం 72 బస్తాల ధాన్యం రాగా వాటిని పట్టించడంతో 36 క్వింటాళ్ల బియ్యం వచ్చింది. ఈ మొత్తం 72 బస్తాల్లో సేకరించి .. ప్రత్యేక వాహనంలో దేవసూగూరుకు వెళ్లి సూగురేశ్వరస్వామి వారికి పూజలు నిర్వహించి ఆలయ ఈవో హనుమప్పగౌడ్, సిబ్బంది చేతికి అందించారు. పేదలకు నిత్యాన్నదానం చేయాలనే సంకల్పంతో పొలంలో పండిన ధాన్యంతో పట్టించిన బియ్యాన్ని ఇస్తున్నానని సత్యాంజనేయులు తెలిపారు. అతని వితరణశీలానికి రైతులు, లయన్స్‌క్లబ్ సభ్యులు సంతోషం వ్యక్తంచేశారు.




# తెలియదు.. కాదు..!

- నల్లగొండ పోక్సో కోర్టులో హాజీపూర్ హత్యల కేసు నిందితుడి సమాధానాలు
- కేసు విచారణ జనవరి 3కు వాయిదా

**నల్లగొండ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** యాదాద్రి భువనగిరి జిల్లా హాజీపూర్‌లో వరుస హత్యల కేసు విచారణ సందర్భంగా జడ్జి అడిగిన పలు ప్రశ్నలకు ప్రధాన నిందితుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి.. 'తెలియదు.. కాదు' అంటూ సమాధానాలిచ్చినట్టు తెలుస్తున్నది. శ్రీనివాస్‌రెడ్డిని రాచకొండ కమిషనరేట్ పోలీసులు గురువారం భారీభద్రత మధ్య నల్లగొండ పోక్సో కోర్టులో హాజరుపరిచారు. సీఆర్పీసీ 313 కింద శ్రీనివాస్‌రెడ్డిని ఎగ్జామినేషన్ చేసిన కోర్టు.. తదుపరి విచారణను జనవరి 3వ తేదీకి వాయిదా వేసింది. సాక్షులు చెప్పిన స్టేట్‌మెంట్లను శ్రీనివాస్‌రెడ్డికి వినిపించి.. నిందితుడి తరఫున వాదనలను కోర్టు నమోదు చేసుకున్నది. విచారణకు హాజరైన నిందితుడి ముఖంలో ఎలాంటి ఆందోళన కనిపించలేదు. ఫోరెన్సిక్ రిపోర్ట్ చూస్తావా? అంటూ జడ్జి అడిగిన ప్రశ్నకు తన వద్ద ఆండ్రాయిడ్ ఫోన్‌లేదని జవాబిచ్చినట్టు తెలిసింది. కర్నూలులో యువతి హత్య గురించి అడిగిన ప్రశ్నకు ఆమె ఎవరో తనకు తెలియదన్నాడు. ఫోరెన్సిక్ రిపోర్టులో బాలికల దుస్తులపై స్పెర్మ్, రక్తపు మరకల ఆనవాళ్లు నీవేనని తేలింది కదా? అని న్యాయమూర్తి అడగటంతో.. ఎస్వోటీ పోలీసులు సిరంజీలతో చల్లారని జవాబిచ్చాడని సమాచారం. హత్య జరిగిన రోజు.. తాను ఫోన్‌ను స్విచ్‌ఆఫ్ చేయడంతోనే టవర్ లొకేషన్ ఆ ప్రాంతంలో చూపించిందని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నట్టు తెలిసింది. మరో కేసులో 29 మంది సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాన్ని న్యాయమూర్తి.. నిందితుడికి వినిపించినట్టు తెలిసింది. తనకు సాక్షులుగా తన అమ్మనాన్నతోపాటు అన్నను తీసుకురావాలని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొనడంతో కోర్టు.. విచారణ జనవరి 3కు వాయిదావేసింది. మరోసారి ఎగ్జామినేషన్, వాదనల తర్వాత.. తుదితీర్పు వెల్లడయ్యే అవకాశం ఉన్నదని అడిషనల్ పీపీ వెంకటరెడ్డి తెలిపారు.

# ఆస్పిరిన్‌తో రొమ్ముక్యాన్సర్‌కు చెక్

- వ్యాధి కారకాలను 20 శాతం నిరోధించవచ్చని యూఎన్సీ పరిశోధనల్లో వెల్లడి
- మెనోపాజ్ దశలో ఉన్న మహిళలు నిత్యం వాడాలి
- ఎంఎన్‌జే హాస్పిటల్ వైద్యుడు సాయిరాం సూచన



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఆస్పిరిన్ మాత్రలతో రొమ్ము క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చంటున్నారు వైద్యనిపుణులు. రొమ్ము క్యాన్సర్ కారకాలను ఆస్పిరిన్ నివారిస్తుందని ఇటీవల పరిశోధనల్లో వెల్లడైనట్టు యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా (యూఎన్సీ) తన క్యాన్సర్ జర్నల్‌లో పేర్కొన్నది. ఆస్పిరిన్ మాత్రలతో క్యాన్సర్ కారకాలను 20 శాతం మేరకు అడ్డుకోవచ్చని, మెనోపాజ్ దశలో ఉన్న మహిళలు ఈ మాత్రలను వాడడం ఉత్తమమని హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ క్లినికల్ ఆంకాలజిస్టు డాక్టర్ సాయిరాం స్పష్టంచేశారు. సాధారణంగా ఆస్పిరిన్ మాత్రలను దీర్ఘకాలిక నొప్పుల నివారణతోపాటు రక్తం గడ్డకట్టకుండా ఉండేందుకు, గుండెపోటును నిరోధించేందుకు ఉపయోగిస్తారు. ఇవే మాత్రలు రొమ్ము క్యాన్సర్‌కు దారితీసే మిథలైజేషన్ ప్రక్రియను కూడా అడ్డుకొంటుందని యూఎన్సీ క్యాన్సర్ పరిశోధకుడు డాక్టర్ టెన్ టెన్ వాంగ్ తను రాసిన జర్నల్స్‌లో పేర్కొన్నట్టు డాక్టర్ సాయిరాం తెలిపారు. మహిళల్లో వంశపారంపర్యంగా రొమ్ము క్యాన్సర్ రావడానికి దోహదపడే బ్రాకా–1, బ్రాకా–2 కారకాలతోపాటు అసహజరీతిలో కణవిభజనకు దారితీసే మిథలైజేషన్ ప్రక్రియను ఆస్పిరిన్ మాత్రలు అడ్డుకుంటాయని ఆయన వివరించారు.

**రోజుకొకటి వాడాలి**



అతితక్కువ ధరకు (కేవలం రూపాయికే) లభించే ఆస్పిరిన్ మాత్రలను మెనోపాజ్ దశకు చేరిన మహిళలు ముందుజాగ్రత్త చర్యగా రోజుకు ఒకటి చొప్పున వాడితే రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలను అడ్డుకోవచ్చు. అసిడిటీ సమస్య లేనివారు రోజూ భోజనం తర్వాత ఈ మాత్రను తీసుకోవాలి.

**- డాక్టర్ సాయిరాం, ఎంఎన్‌జే హాస్పిటల్**

తెలంగాణ ప్రభుత్వం
సమాచార మరియు పౌర సంబంధాల శాఖ

No. 003596/Exhibitions/2019, **షార్ట్ టెండర్ నోటీస్** తేది: 27-12-2019

న్యూఢిల్లీలోని రాజ్‌పథ్ వద్ద జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్–2020లో తెలంగాణ సంస్కృతి మరియు పండుగలు (బతుకమ్మ, మేడారం జాతర మరియు 1000 స్థంభాల గుడి) ఇతివృత్తంతో శకటం రూపొందించుటలో ప్రముఖమైన/అనుభవం/నైపుణ్యంగల సంస్థలు/ఏజెన్సీల నుండి సమాచార మరియు పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్‌వారు సీల్డ్ టెండర్లు కోరుతున్నారు.

పాల్గొనదలచినవారు శకటం రూపకల్పన, తయారీ మరియు ప్రదర్శనలో (అన్ని అవసరమైన ఇన్‌పుట్స్ మొ॥వాటితో సహా) తగిన అనుభవం కలిగి వుండాలి. వారు జాతీయ స్థాయిలో కనీసం 10 సంవత్సరాల అనుభవం కలిగి వుండాలి, వీటిలో వరుసగా గణతంత్ర దినోత్సవ పరేడ్ వద్ద 3 శకటాలను వరుసగా ప్రదర్శించి వుండాలి. వారు టర్న్‌కీ ప్రాతిపదికన జాబ్ చేపట్టుటలో ఆసక్తిని కలిగి వుండాలి.

నియమ నిబంధనలు కలిగిన టెండరు మరియు ఆమోదించిన డిజైన్ కాపీని **https://ipr.telangana.gov.in/tenders** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

అవసరమైన అనుభవం, కావాల్సిన ప్రొఫైల్స్, డాక్యుమెంట్లతో సహా దరఖాస్తులను తేది: 31-12-2019, మ॥ 3.00 గంటల్లోగా **తెలంగాణ స్టేట్ ఇన్ఫర్మేషన్ సెంటర్, రెసిడెంట్ కమిషనర్ కార్యాలయం, తెలంగాణ భవన్, 1, అశోకా రోడ్, న్యూఢిల్లీ–110 001** వద్ద దాఖలు చేయాలి మరియు పాల్గొనే టెండరుదారుల సమక్షంలో అదేరోజున సా॥ 4.00 గంటలకు తెరువబడతాయి.

ఏవైనా వివరాల కొరకు సంప్రదించండి: **శ్రీమతి P.హర్ష భార్గవి (మొబైల్: 9949351270), పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, తెలంగాణ భవన్, న్యూఢిల్లీ.**

DIPR RO.No. 2071-DP/CL/ADVT/1/2019-20, Dt: 26-12-2019 **కమిషనర్**



కాంగ్రెస్ నేతృత్వంలోని దేశాన్ని విచ్ఛిన్నం చేసే మూకల ఆటలు కట్టించి శిక్షించాల్సిన సమయం ఆసన్నమైంది. దేశ రాజధానిలో హింసకు వారే కారకులు. ఢిల్లీ ప్రజలే వారికి తగిన గుణపాఠం చెప్పాలి. పార్లమెంట్‌లో పౌరసత్వ సవరణ చట్టంపై చర్చ జరిగింది. అప్పుడు వారేమీ మాట్లాడలేదు. ఇప్పుడు బయటి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

**అమిత్ షా, కేంద్ర మంత్రి**

ఎన్నార్సీ, సీఏఏ చట్టాలతో దేశ పరిస్థితులే మారిపోతున్నాయి. బీజేపీ అధికారంలోని ప్రభుత్వాలు, మద్దతు పలికే ప్రభుత్వాలు కూడా ఆ చట్టాలను అమలుచేయటం లేదని చెప్తున్నాయి. మేం ఇదివరకే స్పష్టపరిచాం. రాజస్థాన్‌లో మేం ఆ చట్టాలను అమలుచేయబోం.

**సచిన్ పైలట్, రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



**1923**

కొరియా స్వాతంత్ర్యోద్యమకారుడు లీ బాంగ్- చాంగ్ చేసిన హత్యాయత్నం నుంచి బయటపడ్డ జపాన్ చక్రవర్తి హిరోహిటో.

**1934**

పర్షియా దేశం పేరును ఇరాన్‌గా ప్రకటించిన రాజు మహమ్మద్ రెజా పహ్లావి.





**1945**

హారీ డెక్స్‌టర్ వైట్, జాన్ మేనార్డ్ కీన్స్ ఆలోచనలకు అనుగుణంగా 29 సభ్య దేశాలతో ఐ.ఎం.ఎఫ్. స్థాపన.

నేపాల్‌లో కొద్దికాలంగా సమాఖ్య ఫలాలు స్థానికసంస్థల స్థాయికి అందుతున్నాయి. తొలిసారిగా కేంద్రం పర్వతాలు, నదులు, అడవులు, గనుల మీద వచ్చిన రాయల్టీని స్థానికసంస్థలకు అందించింది. ఆదాయంలో సగం కేంద్రం మిగిలించుకోగా, పావు భాగం రాష్ట్రాలకు, మరో పావు స్థానిక సంస్థలకు పంపిణీ చేసింది. దీనివల్ల ఎవరెస్టు శిఖరం ఉన్న గ్రామీణ మున్సిపాలిటీకి భారీ ఆదాయం లభించింది. స్థానిక ప్రభుత్వాలు కూడా తమ నిధులను సేకరించుకోగలుగాలె. నిధులను సద్వినియోగం చేసుకునే సమర్థతను సంతరించుకోవాలె.

**ది హిమాలయన్ టైమ్స్**

ఢాకా నగరం వాయు కాలుష్యానికి సంబంధించిన పట్టికలో అగ్రస్థానంలో ఉండటం విచారకరం. ప్రపంచంలోని నివాసయోగ్యమైన నగరాల్లో ఢాకా నగరం కిందినుంచి 2వ స్థానంలో నిలిచింది. 2019లో నగర కాలుష్యం ఇరువై శాతం పెరిగిపోయింది. గాలి ఏడాదిలో 107 రోజులు అనారోగ్యకరంగా, 82 రోజులు అత్యంత అనారోగ్యకరంగా ఉంటున్నదని ఎకనమిక్ ఇంటలిజెన్స్ యూనిట్ వెల్లడించింది. ఇటుక బట్టీలు, పాత వాహనాలు కాలుష్యానికి ప్రధాన కారణం. ప్రభుత్వం ఇప్పటికైనా వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలె.

**ది డైలీ స్టార్**



# హద్దు మీరవద్దు

సైన్యాధిపతి పదవిలో ఉండి కూడా జనరల్ బిపిన్ రావత్ పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సాగుతున్న ఆందోళనలపై మాట్లాడటం దిగ్భ్రాంతిని కలిగిస్తున్నది. రావత్ వ్యాఖ్యలు సమంజసమైనవా కాదా అనేది కూడా ఇక్కడ చర్చించాల్సింది. దేశ రాజకీయాలపై, ఆంతరంగిక విషయాలపై సైన్యాధికారులు మాట్లాడటం మన దేశంలో పాతుకుపోయిన ప్రజాస్వామ్య సంస్కృతికి విరుద్ధం. అందుకే ఈ వ్యాఖ్యలు రాజకీయవర్గాలతో పాటు ప్రజాస్వామ్య ప్రియులంతా ఉలిక్కిపడేలా చేశాయి. 'నాయకత్వం అంటే నడిపించడానికి సంబంధించినది. మీరు ముందుకు నడిస్తే ప్రతి ఒక్కరూ అనుసరిస్తారు. గుంపులో కూడా నాయకులు కనిపిస్తారు. కానీ నాయకులంటే ప్రజలను మంచి మార్గంలో నడిపించేవారు. ప్రజలను అనుచితమైన దారిలో నడిపేవారు నాయకులు కారు' అంటూ నగరాల్లో వీరు జన సమూహాల్ని హింసా విధ్వంసాలు సాగించేవిధంగా నడిపిస్తున్నారని ఆయన తప్పుబట్టారు. ఇటువంటి విధానం నాయకత్వం అనిపించుకోదని ఆయన అన్నారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ రావత్ ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కొద్దిరోజులుగా దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగుతున్నాయనేది తెలిసిందే. ప్రధాని మోదీ కూడా ఈ నిరసనల పట్ల తీవ్రంగా స్పందించిన సందర్భమిది. దేశీయ వ్యవహారాల్లో తటస్థంగా ఉండవలసిన సైన్యాధిపతి ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా వ్యాఖ్యానించడం విమర్శలకు తావిస్తున్నది.

**లెఫ్టినెంట్ జనరల్ చౌహాన్ లేదా సైన్యాధిపతి రావత్‌లతోసహా మన సైన్యంలోని అధికారుల నిజాయితీని ఎవరూ శంకించడంలేదు. మనదేశ సైన్యం ప్రజా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుందనేది కలలో కూడా ఊహించలేం. మన సైన్యానికున్న గొప్పతనమిది. అయినప్పటికీ సైనికాధికారులు రాజకీయాల దిశగా మాట్లాడటం శ్రేయస్కరం కాదు. బీజేపీ నాయకత్వం కూడా ఈ వ్యాఖ్యలను ఖండించాలె. ప్రధాని మోదీ కూడా ఈ పోకడ తమ ప్రభుత్వ బలహీనతగా భావించాలె.**

జనరల్ రావత్ వ్యాఖ్యలపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నుంచి తక్షణ స్పందన కనిపించింది. తమ అనుచరులను ఊచకోతకు, మత హింసకు అనుమతించేవారు (నాయకులు) కారా? మీరు ఏకీభవిస్తారా జనరల్ సాహెబ్ అని కాంగ్రెస్ పార్టీ ప్రముఖుడు దిగ్విజయ్‌సింగ్ ఒక ట్వీట్‌లో ప్రశ్నించారు. 'నేను ఆయనతో ఏకీభవిస్తున్నా. అవును, ప్రజలను నాయకులు మంచి మార్గంలో నడిపించాలె. ఆయన ఈ మాటలు అనే ముందు ప్రధానిని దృష్టిలో పెట్టుకొని ఉంటారు అని స్వరాజ్ ఇండియా నేత యోగేంద్ర యాదవ్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 'పౌరసత్వ సవరణ చట్టం పట్ల నిరసనలకు వ్యతిరేంగా సైన్యాధిపతి బిపిన్ రావత్ రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి విరుద్ధం. ఇవాళ సైన్యాధిపతిని రాజకీయ అంశాలపై మాట్లాడనిస్తే, రేపు సైన్యం అధికారం చేపట్టే ప్రయత్నానికి అనుమతి ఇచ్చినట్టవుతుంది' అని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బ్రిజేష్ కాలప్ప తీవ్రంగా స్పందించారు. ఇటీవలి కాలంలోనే మరో సైనికాధికారి కూడా రాజకీయ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తూర్పు విభాగ సైనిక కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ అనిల్ చౌహాన్ కూడా ఈ నెల 14వ తేదీన కోల్‌కతాలో పౌరసత్వ సవరణ చట్టానికి అనుకూలంగా మాట్లాడారు. 'ఒకట్రెండు ఈశాన్య రాష్ర్టాలు అభ్యంతరం చెప్పినప్పటికీ, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఎంతోకాలం పక్కనపెట్టిన అంశాలపై దృఢమైన నిర్ణయాలు తీసుకుంటున్నది' అని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలు యథాలాపంగా వెలువడ్డవి కావు. సైన్యం క్రమంగా రాజకీయమయం కావడాన్ని ఈ వ్యాఖ్యలు సూచిస్తున్నాయనే అనుమానం కలుగుతున్నది. బాధ్యతాయుత పదవిలో ఉన్న లెఫ్టినెంట్ జనరల్ అనిల్ చౌహాన్ వ్యాఖ్యలే అభ్యంతరకరంగా ఉన్నాయంటే, ఇక సైన్యాధిపతి స్థానంలో ఉన్న రావత్ ఇదే కోవలో మాట్లాడటం మరింత ఆక్షేపణీయం. జనరల్ రావత్ ఈ నెల 31న పదవీ విరమణ పొందవలసి ఉన్నది. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసిన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనే అత్యంత కీలక పదవికి జనరల్ రావత్‌ను ఎంపిక చేసే అవకాశం ఉందనే వార్త ఒకటి ఇప్పటికే వ్యాపించింది. ఉత్తరాది సైనిక విభాగ కమాండర్ రణబీర్ సింగ్ కూడా ఈ పదవి కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఇంకా వెలువడలేదు. ఈ దశలో రావత్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయకుండా జాగ్రత్తగా ఉండాల్సింది.

రాజకీయాల్లో సైన్యం తటస్థంగా ఉంటుందంటూ, మన ప్రజాస్వామ్యవ్యవస్థకు మన దేశ సైన్యం గొప్ప వరం వంటిదని లెఫ్టినెంట్ జనరల్ డీఎస్ హుడా ఇటీవలే ఒక సందర్భంలో గొప్పగా చెప్పుకున్నారు. గతేడాది పాకిస్థాన్ సైన్యాధిపతి జనరల్ ఖమర్ జావేద్ బజ్వా ఒక సమావేశంలో మాట్లాడుతూ భారత సైన్యాన్ని ప్రశంసించారు. ప్రభుత్వాన్ని నడుపడం సైన్యం పనికాదని అంటూ, సైన్యం రాజ్యాంగం నిర్వచించిన పాత్రకే పరిమితం కావాలని ఆయన హితవు చెప్పారు. భారత ప్రజాస్వామ్యం, సైన్యం పాత్ర గురించి తెలుసుకోవడానికి ఈ విషయమై చర్చించిన ఒక పుస్తకాన్ని చదువవలసిందిగా ఆయన పాక్ సైనికాధికారులకు సూచించారు. అనేక ఆసియా ఆఫ్రికా దేశాలలో సైనిక తిరుగుబాట్లు వచ్చినప్పటికీ, మన దేశంలో ప్రజాస్వామ్యం నిలదొక్కుకోవడాన్ని ప్రపంచమంతా ప్రశంసిస్తున్నది. లెఫ్టినెంట్ జనరల్ చౌహాన్ లేదా సైన్యాధిపతి రావత్‌లతో సహా మన సైన్యంలోని అధికారుల నిజాయితీని ఎవరూ శంకించడంలేదు. మనదేశ సైన్యం ప్రజా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుందనేది కలలో కూడా ఊహించలేం. మన సైన్యానికున్న గొప్పతనమిది. అయినప్పటికీ సైనికాధికారులు రాజకీయాల దిశగా మాట్లాడటం శ్రేయస్కరం కాదు. బీజేపీ నాయకత్వం కూడా ఈ వ్యాఖ్యలను ఖండించాలె. ప్రధాని మోదీ కూడా ఈ పోకడ తమ ప్రభుత్వ బలహీనతగా భావించాలె. ఈ పోకడను వెంటనే కట్టడి చేయాలె.

**జనగళం**

## హర్షణీయం

ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 నుంచి 60 ఏండ్లకు పెంచుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని ఆర్టీసీ డిపోల్లోని ఉద్యోగులు స్వీట్లు పంచుతూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేస్తున్నారు. దీంతోపాటు ఆర్టీసీ బస్సుల్లో సరకు రవాణాపై తీసుకున్న నిర్ణయాన్ని కూడా ఆర్టీసీ ఉద్యోగులు హర్షిస్తున్నారు.

**- ఎం.రాజేంద్రప్రసాద్, వరంగల్**

## పెరుగుతున్న ప్రసవాల సంఖ్య

ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు రోజురోజుకు పెరుగుతుండటం శుభపరిణామం. ఈ సంఖ్యను పెంచేందుకు సీఎం కేసీఆర్ తీసుకున్న 'కేసీఆర్ కిట్', ఆడబిడ్డ పుడితే రూ.13 వేలు, మగ బిడ్డ పుడితే రూ.12వేల వితరణ వంటి పథకాలే ప్రత్యేక కారణం. దీంతో పాటు గర్భిణీల సంక్షేమం కోసం వైద్య సిబ్బంది తీసుకుంటున్న శ్రద్ధ కూడా కొనియాడదగినది.

**- పి.విశ్వాస్‌రావు, బేగంపేట్**

## ప్రైవేట్ దవాఖానల దాష్టీకం

సాధారణ మనిషి ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు పాటిస్తాడు. ఏదైనా చిన్న వ్యాధి వచ్చిందంటే దాన్ని నయం చేసుకోవడానికి అప్పు చేయడానికి కూడా వెనుకాడడు. బతికుంటే బలుసాకైనా తిని బతుకచ్చనే చందంగా అప్పు తెస్తే కాయకష్టం చేసి తీర్చవచ్చని ఆరోగ్యానికే ప్రాధాన్యం ఇస్తాడు. ఇలాంటి బలహీనతను కార్పొరేట్ దవాఖానలు సొమ్ముచేసుకుంటున్నాయి. ఏ చిన్న సమస్యతోనైనా ప్రైవేట్ దవాఖానను ఆశ్రయిస్తే అందినకాడికి దండుకోవడానికే ప్రయత్నిస్తున్నాయి. అసలు సమస్యను వదిలేసి ఆ పరీక్ష, ఈ పరీక్ష అంటూ వేలకు వేలు వసూలు చేస్తున్నాయి. ప్రాణం మీద తీపి, డాక్టర్ అంటే గౌరవంతోనే ప్రజలు డబ్బుకు వెనుకాడకుండా అప్పులు చేస్తున్నారు. తీరా ఏం లేంటూ నాలుగు మందు గోలీలు రాసి ఇంటికి పంపిస్తున్నారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ దవాఖానల్లో నడుస్తున్న తంతు. ఇలాంటి ప్రైవేట్ దవాఖానలపై చర్యలు తీసుకోవాలి.

**- నర్మాల కృష్ణతేజ, లక్ష్మీనగర్, కరీంనగర్**

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**జాతీయం**



**మాలిని సుర్**

# దేశంలో పౌరసత్వ ప్రకంపనలు

బీజేపీ తలపెట్టిన దేశవ్యాప్త జాతీయ పౌరపట్టిక (ఎన్నార్సీ) అనేది అల్పసంఖ్యాక వర్గాలను వేధించడానికి అనే అభిప్రాయం నెలకొన్నది. ఈ చట్టంతో దేశంలోని భారతీయ ముస్లింలకు వ్యతిరేకంగా కూడా దుర్వినియోగపర్చటానికి అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా ఎన్నార్సీ, సీఏఏలకు నిరసనగా కొనసాగిన ఉద్యమాలలో ఇప్పటికే 25 మంది దాకా నిరసనకారులు మరణించారు.

బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా దేశంలోకి చొరబడిన ముస్లింల సమస్య, శరణార్థులుగా వచ్చినవారికి పౌరసత్వం కట్టబెట్టే విషయంపై కేంద్రం తీసుకున్న చర్యలు అనేక సమస్యలకు హేతువవుతున్నది. ఈ క్రమంలో కేంద్రం తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) ఉదారత్వాన్ని మరిచింది. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన పౌరసత్వ సవరణ చట్టానికి 2019 డిసెంబర్ 11న భారతపార్లమెంట్ ఆమోదం తెలిపింది. అధికార బీజేపీ చాలా జాగ్రత్తగా పదాలను ఉపయోగించి ఈ చట్టాన్ని రూపొందించింది. అందులో పొరుగు దేశాలైన ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ నుంచి దేశంలోకి 2014 డిసెంబర్ 31 కన్నా ముందువచ్చిన బాధిత మైనారిటీలకు భారత పౌరసత్వం కల్పిస్తామని వెల్లడించారు.

అధికారవర్గాలు చెబుతున్న దాన్నిబట్టి భారత పౌరసత్వం కోరుతూ 31,313 దరఖాస్తులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 81 శాతం హిందువులవి అని తెలుస్తున్నది. ఈ క్రమంలో కేంద్ర హోం మంత్రి చెబుతున్న దానిప్రకారం 'చట్టవ్యతిరేకంగా' దేశంలో అక్రమంగా ఉన్న కోట్లాదిమంది కూడా పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఇందులో పొరుగు దేశాల నుంచి వచ్చిన బాధిత ముస్లింల ప్రస్తావన లేకపోవటం ఆశ్చర్యం కలిగించలేదు. అలాగే ముస్లిమేతరులైన శ్రీలంక నుంచి వచ్చిన శరణార్థుల ప్రస్తావన కూడా లేదు.

బీజేపీ తలపెట్టిన దేశవ్యాప్త జాతీయ పౌరపట్టిక (ఎన్నార్సీ) అనేది అల్పసంఖ్యాక వర్గాలను వేధించడానికి అనే అభిప్రాయం నెలకొన్నది. ఈ చట్టంతో దేశంలోని భారతీయ ముస్లింలకు వ్యతిరేకంగా కూడా దుర్వినియోగపర్చటానికి అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా ఎన్నార్సీ, సీఏఏ లకు నిరసనగా కొనసాగిన ఉద్యమాలలో ఇప్పటికే 25 మంది దాకా నిరసనకారులు మరణించారు. అరెస్టయి, చిత్రహింసలకు గురైనవారు వేలాదిమంది ఉంటారు.

ఈ నేపథ్యంలోనే నా అనుభవాలను పంచుకోవాలి. నేను 2007లో ఈశాన్యభారతంలోని భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతంలో ప్రజా సమూహాల గణనపై అధ్యయనం కోసం ఆ ప్రాంతానికి వెళ్లాను. అప్పుడు బంగ్లాదేశ్‌తో ఉన్న 2500 మైళ్ల సరిహద్దు పొడవునా అనేక అంచెల కంచెను నిర్మాణం చేస్తున్నది. అప్పుడు అక్కడున్న భారత అధికారులు ఆ కంచె నిర్మాణంతో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చే చొరబాట్లకు చెక్ పెడుతామని చెప్పారు. అలాగే అలా చొరబడిన ముస్లిం శరణార్థులు దేశంలో, ఈశాన్యభారతంలో టెర్రరిజానికి పాల్పడుతున్న ముస్లింల ఆట కట్టిస్తామన్నారు. ఆ క్రమంలోనే అక్కడ పెద్ద ఎత్తున సైనికీకరణ జరుగటం కనిపించింది. ఇది 2015 దాకా కొనసాగింది.

నా క్షేత్ర అధ్యయనంలో గమనించిందేమంటే.. వలసలు, శరణార్థులకు పునరావాసాలు కల్పించటమనేది అనేక సంక్లిష్టతలు, నిర్దిష్టతలు లేని ప్రక్రియగా కనిపించింది. అస్సాం నుంచి మేఘాలయ చేరుకున్న ఓ హోటల్ నిర్వాహకుడైన బాలుని ఉదంతం అక్కడి సంక్లిష్టతలకు అద్దం పడుతుంది. బంగ్లాదేశ్‌కు ఈ పిల్లవాడు అస్సాం సరిహద్దు ప్రాంతం గుండా ప్రయాణించి సరిహద్దు దాటి మేఘాలయలోని తురా ప్రాంతానికి చేరుకున్నాడు. అప్పుడు వెంటనే కొంతమంది స్థానికులు చుట్టుముట్టి అతను నివాసముంటున్న ఇంటిని తగులబెట్టి అతని తండ్రిని చంపేశారు. ఆ ప్రాంతంలో అస్సాంకు చెందిన నిర్మాణ కార్మికులు, వండ్రంగి పనివారు ఆ హోటల్‌ను ఆక్రమించుకొని సొంతం చేసుకున్నారు. తర్వాత అక్కడ ఓ హోటల్ ఉండేదని, దాని నిర్వాహకుని ఉందంతాన్ని అందరూ దాచి ఉంచారు. ఆ తర్వాత కాలంలో కూడా అది అలాగే కొనసాగింది.

ఆ తర్వాత కాలంలో ఆ హోటల్ బాలుడు ఎనిమిదేండ్ల తర్వాత అతని తల్లిని కలుసుకోగలిగాడు. సరిహద్దును దాటించే ఓ ముఠా సాయంతో అతను సరిహద్దును దాటిన తర్వాత తన కుటుంబంతో ఎలాంటి సంబంధం లేదు. కనీసం ఉత్తరం ద్వారా కూడా కుటుంబ సమాచారాన్ని తెలుసుకోలేకపోయాడు. బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతం వెంట ఉన్న మారుమూల గ్రామాల్లో చివరికి ఆ హోటల్‌ను కనుక్కోగలిగాను. నా శాయశక్తులా ప్రయత్నించి కుటుంబ సభ్యులను కలిపిస్తానని హామీ ఇచ్చాను. ఆ తర్వాత ఆ గ్రామస్థులు నన్ను మరో యువకుని దగ్గరికి తీసుకొనిపోయారు. అతని రెండు చేతులు విరిగిపోయి ఉన్నాయి. కాలు కూడా విరిగి ఉన్నది. నేను ఆ హోటల్ కుటుంబానికి సంబంధించి సమగ్ర సమాచారం సేకరించటానికి ప్రయత్నించాను. స్థానిక ముస్లింలు, హిందువులు, క్రిస్టియన్లు ఆ హోటల్ యువకునికి నివాస వసతి కల్పించి పోలీసుల దాడుల నుంచి రక్షించారు. స్థానికులైన వీరే ఆ బాలునికి అవసరమైన గుర్తింపు పత్రాలను సమకూర్చారు. మేఘాలయ, అస్సాంలో ఎన్నార్సీ ప్రక్రియ చేపట్టారు. ఈ పౌరపట్టిక 1971 తర్వాత అస్సాంలోకి అక్రమంగా చొరబాటుదారులైన వారిని గుర్తించటానికి ఉద్దేశించబడినది. మొదట మతాలకతీతంగా చొరబాటులెవరో గుర్తించే పనికి పూనుకున్నారు. దీనిద్వారా స్థానిక ప్రజల సంస్కృతి, భూమి యాజమాన్యం, అస్తిత్వాల హక్కులను పరిరక్షించటానికి ఉద్దేశించినదిగా భావించారు.

అస్సాం విషయానికి వస్తే.. వలస పాలనాకాలం నుంచి అస్సాంలోకి వలసల బెడద ఉన్నది. ముఖ్యంగా తూర్పు పాకిస్థాన్ నుంచి వలసలు తీవ్రస్థాయిలో కొనసాగి ఆ సమస్య మరింత తీవ్రరూపం దాల్చింది. ఆ క్రమంలో 1950 మార్చిలో జనాభా పట్టిక తయారీలో ముస్లిం మత ప్రస్తావన లేదు. ప్రస్తుత పౌరసత్వ సవరణ చట్టం మాదిరిగా మతం ప్రాతిపదికన పౌరసత్వం, గుర్తింపు కల్పించే విధానం లేదు. ప్రస్తుతం చేపట్టిన ఎన్నార్సీ కారణంగా దేశంలో హిందు, ముస్లింల మధ్య అగాథం పెరిగిపోయే పరిస్థితి ఏర్పడింది. భారత అధికారుల ముందు అవసరమైన పత్రాలు సమర్పించలేని వారు అక్రమ చొరబాటుదారులుగా ముద్రపడే పరిస్థితి ఏర్పడింది. చాలా సందర్భాల్లో పౌరసత్వం కోసం చూపిస్తున్న పత్రాలు నకిలీవని, చెల్లనేరవని అధికారుల చెబుతూ వారికి పౌరజాబితాలో చోటు కల్పించటం లేదు. ఈ నేపథ్యంలోనే ప్రజలపై వేధింపులు, నిర్బంధాలు పెరిగిపోతున్నాయి. చాలాచోట్ల ఆత్మహత్యలకు దారితీస్తున్నది. బీజేపీ తలపెట్టిన సీఏఏ సరిహద్దు దాటి వచ్చిన హిందువులకు వక్రమార్గంలో పౌరసత్వం కట్టబెడుతూ, ఇతరులను మాత్రం నేరస్థులుగా చేస్తున్నది.

> నరేంద్ర మోదీ చేపట్టిన ఈ రాజకీయ ప్రక్రియ భారత ప్రజాస్వామ్యంపై తనదైన ముద్ర వేస్తున్నది. సీఏఏ అనేది దేశంలోని ప్రజలందరి దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తున్నది. ప్రజల జీవనాన్ని, నివాసాన్ని, భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నది. మత ప్రాతిపదికపై ప్రజల మధ్యన విభజన రేఖ ఏర్పడుతున్నది. చారిత్రకంగా ప్రజల మధ్య, ప్రజా సమూహాల మధ్య ఉన్న విశ్వాసం, సాంస్కృతిక ఐక్యత సన్నగిల్లుతున్నది. ఈ విధమైన అభద్రత, అపనమ్మకం దేశవ్యాప్తంగా ప్రజల మధ్యనే కాకుండా సరిహద్దు ప్రాంతాలకు పాకుతున్నది.

ప్రతిచోట ఉండే చెక్‌పోస్టులలో సాధారణ దినకూలీల దగ్గర గుర్తింపు కార్డులను పరిశీలిస్తారు. సరైన గుర్తింపు పత్రాలుంటేనే విడిచిపెడుతారు.

మిలటరీతో నిండి ఉండే సరిహద్దు ప్రాంతంలో అవసరమైన పత్రాలు అనివార్యం. ముఖ్యంగా జాతీయ, మత ప్రాతిపదికన ఉన్న సరిహద్దుల దగ్గర ఈ పత్రాలే ఉనికికి హామీ పడుతాయి. సరిహద్దు ప్రాంతాల్లో పేదవారైన దినకూలీలు, ముస్లింలు, క్రిస్టియన్లు, హిందు మతంలోని నిమ్నకులాల వారికి ఈ గుర్తింపు పత్రాలతోనే భద్రతా బలగాల నుంచి మనుగడ సాధ్యం. ఇలాంటి పరిస్థితులున్న సరిహద్దు ప్రాంతాల్లోని నిరుపేదలైన ప్రజలు పౌరసత్వ సవరణ చట్టం ద్వారా తమ నివాసాన్ని ఎలా నిరూపించుకుంటారన్నది పెద్ద ప్రశ్న. ఈ నేపథ్యంలోంచే చాలాకాలంగా సరిహద్దు ప్రాంతాల్లో విదేశీ చొరబాటుదారుల సమస్య అనేక ఉద్రిక్తతలకు దారితీస్తున్నది. ఈ క్రమంలోనే సరిహద్దు ప్రాంతాల్లోని గ్రామ పెద్దలు చొరబాటుదారుల దయనీయ స్థితిని ఆసరా చేసుకొని అనేక అక్రమాలకు పాల్పడుతుంటారు. చొరబాటుదారుల భూములను ఆక్రమించి వారిని నిర్వాసితులుగా మార్చి నిలువ నీడ లేకుండా చేస్తుంటారు.ఈ పరిస్థితుల్లో భారత ప్రభుత్వం చొరబాటుదారుల ఏరివేత పేరిట మరింత కఠినంగా అమానవీయంగా వ్యవహరిస్తున్నది. ప్రభుత్వాలు తెస్తున్న చట్టాలు ప్రజల సమస్యలు పరిష్కరించకపోగా మరింతగా పరిస్థితులను దిగజార్చుతున్నది.

1980 ప్రాంతంలో వచ్చిన అస్సాం ఉద్యమం కారణంగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఒక మంచి ఆశావహ దృక్పథంతో 2015 నుంచి

నరేంద్ర మోదీ చేపట్టిన ఈ రాజకీయ ప్రక్రియ భారత ప్రజాస్వామ్యంపై తనదైన ముద్ర వేస్తున్నది. సీఏఏ అనేది దేశంలోని ప్రజలందరి దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తున్నది. ప్రజల జీవనాన్ని, నివాసాన్ని, భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నది. మత ప్రాతిపదికపై ప్రజల మధ్యన విభజన రేఖ ఏర్పడుతున్నది. చారిత్రకంగా ప్రజల మధ్య, ప్రజా సమూహాల మధ్య ఉన్న విశ్వాసం, సాంస్కృతిక ఐక్యత సన్నగిల్లుతున్నది. ఈ విధమైన అభద్రత, అపనమ్మకం దేశవ్యాప్తంగా ప్రజల మధ్యనే కాకుండా సరిహద్దు ప్రాంతాలకు పాకుతున్నది. ఈ క్రమంలోనే హిందువేతరులను టెర్రరిస్టులుగా, అనుమానితులుగా చూసే, పరిగణించే పరిస్థితి ఏర్పడుతున్నది. అస్సాంతో మొదలై ఇప్పుడు దేశవ్యాప్త సమస్య అయిన ఎన్ఆర్సీ ఇప్పుడు సీఏఏ రూపంలో 2021 ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని దేశంలోని బెంగాలీలను లక్ష్యం చేసుకునే దిశగా సాగుతున్నది. బీజేపీ నియంతృత్వంగా చేపడుతున్న చర్యల ఫలితంగా ప్రజలంతా భయాందోళనలకు గురయ్యే పరిస్థితులు దాపురిస్తున్నాయి. బీజేపీ అనుసరిస్తున్న విధానాల కారణంగా దేశ లౌకిక ప్రజాస్వామిక విలువలే కాదు, భారత రాజ్యాంగమే ప్రశ్నార్థకంగా మరుతున్నది.

**(వ్యాసకర్త: వెస్టర్న్ సిడ్నీ వర్సిటీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ కల్చర్ అండ్ సొసైటీలో పరిశోధకులు)**

# ప్రవాసుల్లో అభద్రతాభావం

**విశ్లేషణ**



**చందుపట్ల రమణకుమార్‌రెడ్డి**

పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల్లోని మైనారిటీల మీద, ముఖ్యంగా ఆయా దేశాల్లోని హిందువుల మీద భారత ప్రభుత్వం అలవికాని అనురాగాన్ని కురిపిస్తున్నది. దీనికి ఈ మధ్య తీసుకొచ్చిన పౌరసత్వం చట్ట సవరణ బిల్లే చక్కటి ఉదాహరణ. ఈ బిల్లు ద్వారా మన దేశంలోకి వివిధ కారణాలతో వలసవచ్చిన కొందరు ఆయా దేశీయులకు ఎంతమేరకు సాంత్వన చేకూరుస్తుందో తెలియదు. కానీ, ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా ముస్లిం జనాభా అధికంగా ఉన్న దేశాల్లో నివసిస్తున్న కోట్లాది హిందువుల్లో అభద్రతాభావాన్ని పెంచే ప్రమాదం పొంచి ఉన్నది. ఇప్పటికిప్పుడు ఆయా ముస్లిం దేశాలు స్పందించకపోయినా పౌరసత్వం చట్ట సవరణ వల్ల ఏర్పడిన విభజన ప్రభావం ఆయా ఇస్లాం దేశాల్లోని ఛాందసవాదుల మీద ప్రభావాన్ని చూపుతుందనేది చరిత్ర మీద అవగాహన ఉన్న ప్రతి ఒక్కరు ఒప్పుకోవలసిన సత్యం. బంగ్లాదేశ్‌లో 9 శాతం, పాకిస్థాన్‌లో 3 శాతం పైగా హిందువులు జీవిస్తున్నారు, అరబ్ దేశాల్లో లక్షలాది హిందూ కుటుంబాలు ఉపాధిని పొందుతున్నాయి. ఆఫ్రికా, ఇస్లాం దేశాల్లో భారతీయ మూలాలున్న లక్షలాది కుటుంబాలు ఉన్నాయన్నది నిర్వివాదాంశం. రేపటిరోజు అనుకోని ఉపద్రవం సంభవిస్తే ఇన్ని కోట్లమందిని భరించే సత్తా మన దేశానికి లేదన్నది వాస్తవం. ఇటువంటి పరిస్థితుల్లో సున్నితమైన ఈ అంశాన్ని తెరపైకి తీసుకురావలసిన అగత్యం ఏమిటో పాలకులు ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలి. ఉరుము ఉరిమి మంగళం మీద పడినట్లు భారతదేశంలో చేయాలనుకుంటున్న ఎరివేతలు, చేరికల ప్రభావం ఎక్కడ తమ మీద పడుతుందోనని ఆయా ముస్లిం దేశాల్లోని కోట్లాది హిందువులు, ఇతర భారతీయ మైనారిటీలు మధనపడుతారన్నది వాస్తవం. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్ల మీదికి వచ్చి ఆయా దేశాల్లోని మెజారిటీ ప్రజలకు సంఘీభావం ప్రకటించాల్సిన సంకటస్థితిని మనవారికి మనమే కల్పించడాన్ని అభిమానమనుకుందామా లేక అత్యుత్సాహమనుకుందామా?.

రాజ్యాంగంలో పొందుపరిచిన సమానత్వం కేవలం భారత పౌరులకు మాత్రమే, చొరబాటుదారులకు కాదని గొంతు చించుకొని నినదిస్తున్న (సూడో) దేశభక్తులకు తెలియాల్సిన విషయం మరొకటి కూడా ఉన్నది. శత్రువు పట్ల చూపే కరుణ, ఆశ్రయం కోరినవారి పట్ల చూపాల్సిన మానవత్వంలో కూడా సమానత్వాన్ని పాటించాలన్నది భారత రాజ్యాంగ ప్రవేశిక (ప్రియాంబుల్) నిర్దేశిస్తున్న, పాటించి తీరాల్సిన విధి. ప్రపంచంలో అత్యంత పెద్దదైన ప్రజాస్వామ్య భారతదేశం ప్రపంచానికి అందించాల్సిన సందేశం కూడా సర్వమానవ సౌభ్రాతృత్వమే తప్ప విభజనతో కూడిన సౌభ్రాతృత్వం ఎంతమాత్రం కాదు. దశాబ్దాలుగా మేధావులు, శాస్త్రజ్ఞులు, యువత, ధనవంతుల్లో అత్యధికులు ఏ మాత్రం వీలుచిక్కినా ఈ దేశాన్ని వదిలి అమెరికా వైపు లేదంటే యూరప్ దేశాల్లోకి పోవడానికి ఆలోచిస్తున్నారు, వీరిలో కనీసం 25 శాతం మంది కూడా తమ మాతృభూమికి తిరిగిరావడం లేదు. గుండెల్లో పెనవేసుకున్న దేశభక్తి కన్నా, అవకాశాల పట్ల, సామాజిక భద్రత పట్ల వారి మనసులో గూడుకట్టుకున్న అభద్రతా భావమే వారి కాళ్లకు బంధం వేస్తున్నది. మేధావుల వలసను వాస్తవ దృష్టితో సమీక్షించి సరైన చర్యలు చేపట్టాల్సిన ఈ తరుణంలో లాంటి చట్టాలు తేవడం వర్గాల మధ్య వైషమ్యాలు పెంచడమే కాదు, భారతీయ మేధావులను శాశ్వతంగా మనదేశానికి దూరం చేసే ప్రమాదం ఉన్నది. ఇప్పటికీ ఆలోచన చేయడం వల్ల సమస్య చిక్కులు విప్పలేని కటిక ముడిగా మారుతుందే గానీ ఆయా దేశాల్లోని మైనారిటీలకు మనోధైర్యాన్ని ఎంతమాత్రం అందించదు. ధనిక బౌద్ధ దేశాలైన జపాన్, చైనాలు కూడా చూపించని ఔదార్యం బౌద్ధుల మీద మనదేశం చూపించడం ఎందుకో ఏలినవారికే తెలియాలి. నిజంగా మతం పేరుతో వివక్షకు గురైన హిందువుల మీద, బౌద్ధుల మీద మానవత్వం చూపాలనుకుంటే అది కేవలం పాకిస్థాన్, బంగ్లాదేశ్, బర్మా, ఆఫ్ఘనిస్తాన్‌లకు మాత్రమే ఎందుకు ప్రపంచంలో ఏ మూల, ఏ దేశంలో ఉన్నా వారికి ఆశ్రయమిస్తామని ప్రకటించాలి కదా! అంతటి తెగింపు నిర్ణయం చేయగలమా? విభజనకారుల ఆలోచనలకు, ప్రజాస్వామికవాదుల ఆలోచనలకు మధ్య ఉండాల్సిన అంతరాన్ని చెరిపేయడం మానవాళి భవిష్యత్తును రక్తపాతంలోకి తోసేస్తుంది. నాడెప్పుడో బౌద్ధులకు హిందువులకు మధ్య, ముస్లింలకు హిందువులకు మధ్య, ముస్లింలకు క్రిస్టియన్లకు మధ్య, వైష్ణవులు శైవులకు మధ్య జరిగిన నరమేధం, బానిస వ్యాపారం పేరుతో నల్లజాతీయుల మీద, జాతి పేరుతో నాజీలు యూదుల మీద చూపిన క్రౌర్యం, అణుబాంబుల దాడుల నేపథ్యంలో మానవ రక్తం ఏరులైపారిన ఈ పుడమిలో, శాంతి కుసుమాలు పూయాలంటే ప్రభుత్వాల ఆలోచనల వెనుక మానవతా విలువలతో కూడిన ఆశయాలుండాలి. విభజన లేకుండా 130 కోట్ల మంది త్రివర్ణ పతాకాన్ని చేతబట్టి మేం భారతీయులమని నినదించగలిగే దిశలో నిర్ణయాలున్న రోజు నా దేశం మళ్లీ విశ్వగురువుగా నిలుస్తుంది.

> పాకిస్థాన్‌లోని మైనారిటీ జనాభాను దేశ విభజన నాటి స్థితికి, నేటి స్థితితో పోల్చి దారుణంగా తగ్గిపోయిందని చూపిస్తున్న నేతలు 1971లో బంగ్లాదేశ్ విభజన తర్వాత ఆ దేశ జనాభా లెక్కల్లోకి వెళ్లిపోయిన సుమారు 23 శాతం మైనారిటీలను తీసేసి చూపకపోవడంలోని ఆంతర్యం ఏమిటి? ఇది వాస్తవాలను పాతిపెట్టడం కాదా. పాకిస్థాన్‌లో మత మార్పిడిలు జరుగనే లేదు, బంగ్లాదేశ్‌లో పరమత సహనం వెల్లివిరుస్తున్నదని ప్రపంచ చరిత్ర మీద, సమకాలీన అంశాల మీద అవగాహన ఉన్న ఏ ఒక్కరూ చెప్పరు.

మనదేశంలో పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌లతో కూడిన అఖండ భారతం కోసం పరితపిస్తున్నారు. వారి మంచి మనసుకు శతకోటి వందనాలు, కాకపోతే ఒక్కటే అనుమానం, భారత ఉపఖండంలో ఉన్న 36 కోట్లమంది ముస్లింలను కలుపుకోకుండా అఖండ భారతాన్ని సాధించాలనుకోవడం అసాధ్యం కాదా, మరెందుకు ఆ దిశలో కూడా ఆలోచించరు.

పాకిస్థాన్‌లోని మైనారిటీ జనాభాను దేశ విభజన నాటి స్థితికి, నేటి స్థితితో పోల్చి దారుణంగా తగ్గిపోయిందని చూపిస్తున్న నేతలు 1971లో బంగ్లాదేశ్ విభజన తర్వాత ఆ దేశ జనాభా లెక్కల్లోకి వెళ్లిపోయిన సుమారు 23 శాతం మైనారిటీలను తీసేసి చూపకపోవడంలోని ఆంతర్యం ఏమిటి? ఇది వాస్తవాలను పాతిపెట్టడం కాదా. పాకిస్థాన్‌లో మత మార్పిడిలు జరుగనే లేదు, బంగ్లాదేశ్‌లో పరమత సహనం వెల్లివిరుస్తున్నదని ప్రపంచ చరిత్ర మీద, సమకాలీన అంశాల మీద అవగాహన ఉన్న ఏ ఒక్కరూ చెప్పరు. అంతమాత్రం చేతనే అంకెల గారడీ చేసి, అక్కడేమో జరిగిపోతున్నదనే భయోత్పాతాన్ని సృష్టించి, ఇక్కడున్న మెజారిటీ వర్గాన్ని కూడగట్టే


Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల లొంగుబాటు

**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లా మలంగిర్ ఏరియాకు చెందిన ఐదుగురు మావోయిస్టులు గురువారం లొంగిపోయినట్టు దంతెవాడ జిల్లా ఎస్పీ అభిషేక్ పల్లవ్ తెలిపారు. లొంగిపోయిన వాళ్లలో మడకం దేవా, మడకం మాసా, సోనా హేమ్లా, సుక్డా మాండవి, ధృవ్ సోరి ఉన్నట్టు ఆయన వెల్లడించారు. వీరిలో మడకం దేవాపై రూ.లక్ష రివార్డు ఉన్నదని, లొంగిపోయిన ప్రతిఒక్కరికీ రూ.10 వేలు ప్రోత్సాహకాలను అందజేసినట్టు ఎస్పీ పేర్కొన్నారు.



## బిడ్డలను మెడదాకా పాతిపెట్టారు!

- సూర్యగ్రహణంలో అంగవైకల్యం పోతుందనే మూఢనమ్మకం.. కర్ణాటకలో ఘటన

**బెంగళూరు:** సాంకేతికత ఎంతపెరిగినా.. మానవుడు విశ్వరహస్యాలను ఛేదించినా.. కొందరు మాత్రం మూఢనమ్మకాలను వీడటం లేదు. సూర్యగ్రహణం సందర్భంగా కర్ణాటకలో జరిగిన కొన్ని ఘటనలే ఇందుకు ఉదాహరణలు. అంగవైకల్యం కలిగిన పిల్లలను సూర్యగ్రహణం సందర్భంగా శిరస్సు వరకు మట్టిలో పాతిపెడితే.. అంగవైకల్యం పోతుందనే నమ్మకంతో పలువురు తల్లిదండ్రులు.. గొయ్యితీసి మెడ వరకు తమ పిల్లలను పాతిపెట్టారు. ఇలా ఒకరిద్దరు కాదు పదుల సంఖ్యలో చేశారు. కర్ణాటకలోని కలబురిగి జిల్లాలో తాజ్‌సుల్తానాపూర్ గ్రామంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. అంగవైకల్యంతో బాధపడుతున్న తమ పిల్లలను తల్లిదండ్రులు మట్టిలో కప్పిపెట్టారు. చిన్నారులు ఏడుస్తున్నా పట్టించుకోకుండా సూర్యగ్రహణం వీడేవరకు సుమారు మూడుగంటలు అలాగే ఉంచారు. ఈ విషయం అధికారులకు తెలియడంతో గ్రామానికి వెళ్లి అడ్డుకున్నారు. వేలకు వేలు ఖర్చుచేసి వైద్యం చేయించినా తమ పిల్లల అంగవైకల్యం బాగుకాలేదని, గతంలో తమ పెద్దలు ఇలాగే చేశారని, నయం అవుతుందేమోనని ఒకసారి దీనిని ప్రయత్నించామని ఓ బాలిక తండ్రి తెలిపారు. విజయపుర జిల్లాలోని ఇండి గ్రామంలో కూడా ఇలాంటి ఘటనలే చోటుచేసుకున్నాయి.

## వినువీధిలో మహాద్భుతం



గురువారం కేరళలోని కోజికోడ్‌లో పురమెరి ప్రాంతంలో సంభవించిన సూర్యగ్రహణం తాలూకు దృశ్య మాలిక

- కనువిందు చేసిన సూర్యగ్రహణం
- దక్షిణాదిలోని పలు ప్రాంతాల్లో స్పష్టంగా కనిపించిన గ్రహణం దృశ్యాలు
- మబ్బులు కమ్ముకోవడంతో గ్రహణాన్ని వీక్షించలేకపోయానన్న మోదీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 26:** ఆకాశ వీధిలో అద్భుతం ఆవిష్కృతమైంది. ప్రతిరోజు భగభగ మండుతూ కనిపించే సూర్యుడు గురువారం ఉదయం చిన్నబోయాడు. నిశీధి రాతిరి వచ్చే చంద్రుడు సూర్యకాంతులకు అడ్డునిలిచాడు. గురువారం సంభవించిన సూర్యగ్రహణంలో భాగంగా నల్లని చంద్రుడి చుట్టూ బంగారం వర్ణంలో మెరిసిపోతున్న సూర్యుడ్ని చూస్తూ ఔత్సాహికులు మురిసిపోయారు. ఈ దశాబ్దంలో చివరిసారిగా గురువారం ఉదయం సంభవించిన సూర్యగ్రహణాన్ని దేశవ్యాప్తంగా పలు చోట్ల ప్రజలు వీక్షించారు. ఉత్తర భారత దేశంలోని పలు ప్రాంతాల్లో ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో సూర్యగ్రహణం దృశ్యాలు అస్పష్టంగా కనిపించాయి. దీంతో ఈ అరుదైన దృశ్యాల్ని కొందరు వీక్షించలేకపోయారు. వీరిలో ప్రధాని మోదీ కూడా ఉన్నారు. ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో దురదృష్టవశాత్తు తాను గ్రహణాన్ని వీక్షించలేకపోయానని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పాక్షిక సూర్యగ్రహణం దశ గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమై, ఉదయం 9.06గంటలకు అంగుళీయకం(రింగ్ ఆఫ్ ఫైర్) దశలోకి ప్రవేశించిందని, అంగుళీయకం దశ మధ్యాహ్నం 12.29 గంటలకు పూర్తవ్వగా, మధ్యాహ్నం 1.36 గంటలకు పాక్షిక సూర్యగ్రహణం పూర్తిగా ముగిసిందని భూవిజ్ఞానశాస్త్ర మంత్రిత్వ శాఖ పేర్కొంది. పాక్షిక సూర్యగ్రహణంలో భాగంగా సూర్యుడిని చంద్రుడు కప్పివుంచే ఉచ్ఛదశలో కనిపించే సూర్యగ్రహణం దృశ్యాలు బెంగళూరులో 90శాతం, చెన్నైలో 85శాతం, ముంబైలో 79శాతం, కోల్‌కతాలో 45శాతం, ఢిల్లీలో 45శాతం, పాట్నాలో 42శాతం, గువాహటిలో 33శాతం, పోర్ట్ బ్లేయర్‌లో 70శాతం వరకు కనిపిస్తాయని భూ విజ్ఞానశాస్త్ర మంత్రిత్వ శాఖ గతవారం ఓ ప్రకటనలో పేర్కొంది. అయితే, ఆయా ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతం కావడం వల్ల సూర్యగ్రహణం దృశ్యాలు స్పష్టంగా కనిపించలేదు. ఈసారి సంభవించిన సూర్యగ్రహణంలో భూమికి అత్యంత దూరంగా ఉండటంవల్ల సూర్యుడిని చంద్రుడు పూర్తిగా కప్పివేయలేకపోయాడు. దీంతో సూర్యుడి అంచు చంద్రుడి చుట్టూ ఓ వలయంలా కనిపించింది. దీన్నే 'రింగ్ ఆఫ్ ఫైర్ (అంగుళీయక(ఉంగరం ఆకారంలో) సూర్యగ్రహణం)' అని పిలుస్తారు. గ్రహణం సమయంలో దేశంలోని పలు ఆలయాల్ని మూసివేసిన నిర్వాహకులు.. గ్రహణం ముగిశాక ఆలయం సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రానున్న కాలంలో.. 2020, జూన్ 21న(అంగుళీయక సూర్యగ్రహణం), 2020 డిసెంబర్ 14న (సంపూర్ణ సూర్య గ్రహణం), 2021, జూన్ 10న (అంగుళీయక సూర్యగ్రహణం), 2021, డిసెంబర్ 4(సంపూర్ణ సూర్యగ్రహణం) తేదీల్లో సూర్యగ్రహణాలు సంభవించనున్నాయి.

**ఢిల్లీవాసులకు నిరాశ**

దేశ రాజధాని ఢిల్లీలో పొగమంచు కమ్ముకొని ఉండటం వల్ల సూర్యగ్రహణ దృశ్యాల్ని రాజధాని వాసులు చూడలేకపోయినప్పటికీ, దక్షిణ భారతంలోని పలు చోట్ల సూర్యగ్రహణాన్ని ప్రజలు స్పష్టంగా చూడగలిగారు. ఢిల్లీలో ఆకాశం మేఘావృతమై ఉండటం వల్ల గురువారం ఏర్పడిన సూర్యగ్రహణాన్ని తాను వీక్షించలేకపోయానని, అయితే, కేరళలోని కోజికోడ్‌లో సంభవించిన సూర్యగ్రహణాన్ని టీవీలో వీక్షించానని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గ్రహణం సమయంలో సూర్యున్ని చూసేందుకు ప్రయత్నిస్తున్న ఫొటోలను మోదీ ట్విట్టర్‌లో పంచుకున్నారు. సూర్యగ్రహణానికి సంబంధించి నిపుణులతో చర్చించి మరిన్ని విషయాలు తెలుసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు.

**విదేశాల్లో ఇలా..**

గురువారం సంభవించిన సూర్యగ్రహణాన్ని భారత్‌తో పాటు సౌదీఅరేబియా, ఖతార్, యూఏఈ, ఒమన్, శ్రీలంక, మలేషియా, ఇండోనేషియా, సింగపూర్ తదితర దేశాల్లోని ప్రజలు వీక్షించారు.

## పట్టణాల్లో మహిళ భద్రతపై దృష్టి పెట్టాలి

'యు గవ్' సర్వేలో భారతీయుల మనోగతం

**ముంబై:** 2020లో మహిళాభద్రతపై దృష్టిని కేంద్రీకరించాలని భారత్‌లోని పట్టణ ప్రజల్లో 29 శాతం మంది కోరుతున్నారని 'యు గవ్' అనే ఆన్‌లైన్ మార్కెట్ రీసెర్చ్ అండ్ డేటా అనలిటిక్స్ సంస్థ సర్వేలో తేలింది. 2019లో మహిళా భద్రతలో చెప్పుకోదగిన పురోగతి ఏమీ లేదని 45% మంది తెలిపారు. బ్రిటన్ కేంద్రంగా నడుస్తున్న ఈ సంస్థ ఈనెల 10-13మధ్య ప్రపంచ వ్యాప్తంగా 80 లక్షల మందికి పైగా సర్వే జరిపింది. భారత్‌లో 1,011 మంది అభిప్రాయాలను తెలుసుకున్నది. 2020లో దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చాలని 12% మంది, ఉపాధి కల్పన మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని 11% మంది చెప్పారు. 39% మంది దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుదలకు 2019లో ప్రభుత్వం చెప్పుకోదగిన చర్యలేమీ తీసుకోలేదన్నారు. 2019లో ఉద్యోగాల కల్పనలో పురోగతి లేదని, టెక్నాలజీ పరమైన అభివృద్ధి సానుకూల మార్పు అని 35% మంది తెలిపారు. కాగా తమ సర్వేలో క్రీడలు, వినోదంపైనే వివిధ దేశాల ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపారని యు గవ్ తెలిపింది. భారతీయులు వీక్షించిన సామాజిక, క్రీడా వేదికల్లో 'అంబానీ వివాహ వేడుక', 'ఫ్రెండ్స్ రజతోత్సవాలు', ప్రపంచ కప్‌లో టీమిండియా ప్రతిభ' తదితర అంశాలకు ప్రాధాన్యం లభించిందని, ప్రతి ఐదుగురికి ఒకరు వచ్చే ఏడాది ఇస్రో ప్రయోగించనున్న చంద్రయాన్-3 గురించి తెలుసుకోవడానికి ఆసక్తి చూపారని పేర్కొంది. 35ఏ అధికరణాన్ని రద్దు చేయడం చాలా ముఖ్యమైన అంశమని 28 శాతం మంది పేర్కొన్నారు. అయోధ్యపై 18 శాతం, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయంపై 17 శాతం మంది ఆసక్తి ప్రదర్శించారని యు గవ్ పేర్కొంది.

# తీపి.. చేదుల దశాబ్దం

- గత పదేండ్లలో అంతర్జాతీయంగా కీలక పరిణామాలు
- హైతీని వణికించిన భూకంపం : సిరియాలో అంతర్యుద్ధం
- పర్యావరణంపై చారిత్రాత్మక పారిస్ ఒప్పందం
- సుస్థిరాభివృద్ధికి 2030 ఎజెండా
- ఐరాస 'దశాబ్దపు సమీక్ష' నివేదికలో వెల్లడి

**ఐక్యరాజ్యసమితి, డిసెంబర్ 26:** హైతీలో భయానక భూకంపం.. సిరియాలో అంతర్యుద్ధం.. బాలికల విద్యకు మలాలా యూసఫ్‌జాయ్ చేసిన స్ఫూర్తిదాయక పోరాటం.. చారిత్రాత్మక పారిస్ వాతావరణ ఒప్పందం.. ఐక్యరాజ్యసమితి (ఐరాస) 2030 అజెండా.. గత దశాబ్ద కాలంలో అంతర్జాతీయంగా చోటుచేసుకున్న ముఖ్యమైన ఘట్టాలు ఇవి. 'దశాబ్దపు సమీక్ష' నివేదికలో ఐరాస ఈ వివరాలు వెల్లడించింది. 21వ శతాబ్దానికి టీనేజ్ ముగిసిందని, ప్రపంచం 2020లోకి అడుగుపెట్టబోతున్నదని పేర్కొంది. 2010-19 మధ్య కాలంలో అంతర్జాతీయంగా చోటుచేసుకున్న ముఖ్యమైన సంఘటనలను ఈ నివేదికలో ఐరాస ప్రస్తావించింది. పశ్చిమాసియాలో నిరుపేద దేశమైన హైతీలో భయంకర విపత్తుతో ఈ దశాబ్దం మొదలైంది. ఆ ద్వీప దేశంలో 2010 జనవరి 12న 7.0 తీవ్రతతో భూకంపం సంభవించింది. సుమారు 2,20,000 మంది ప్రాణాలు కోల్పోయారు.



హైతీలో భూకంపం సృష్టించిన విధ్వంసం (ఫైల్)

### అరబ్ వసంతం

2011లో సిరియాలో అంతర్యుద్ధం మొదలైంది. ఉత్తర ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాల్లో ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమాలు హింసకు దారితీశాయి. ఈ ఉద్యమాల ఫలితంగా ట్యునీషియా, ఈజిప్టులలో నియంతల పాలనకు తెరపడింది. దీనినే అరబ్ వసంతంగా పిలుస్తున్నారు. ఎనిమిదేండ్ల తర్వాత కూడా సిరియాలో ఇప్పటికీ అంతర్యుద్ధం కొనసాగుతున్నది. ఘర్షణల్లో వందలాది మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఇది వలస సంక్షోభానికి దారితీసింది. 2011 నుంచి సుమారు 50-60 లక్షల మంది సిరియాను వదిలివెళ్లినట్లు అంచనా.





### మలాలా స్ఫూర్తి

బాలికలవిద్య కోసం స్ఫూర్తిదాయక పోరాటం చేసిన పాకిస్థాన్ బాలిక మలాలా యూసఫ్‌జాయ్ పేరు 2012లో ప్రపంచవ్యాప్తంగా మారుమోగిపోయింది. ఆ ఏడాది అక్టోబర్‌లో పాక్‌లో పాఠశాల బస్సుపై దాడి చేసిన తాలిబన్లు.. మలాలా, మరో ఇద్దరు బాలికలపై కాల్పులు జరిపారు. ఈ ఘటనపై ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. హత్యాప్రయత్నం తర్వాత కూడా మలాలా పోరాటాన్ని కొనసాగించింది. 2014లో ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి ఆమెను వరించింది. 2017లో ఐరాస శాంతి ప్రచారకర్తగా ఆమె నియమితులయ్యారు.

### వణికించిన ఎబోలా

2014లో ప్రాణాంతక ఎబోలా వైరస్ ప్రపంచాన్ని వణికించింది. గునియా, లైబీరియా, సియెర్రా లియోన్ ఈ వ్యాధితో విలవిల్లాడాయి. 2014 ఆగస్టులో ఐరాస అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. రెండేండ్ల తర్వాత దాన్ని ఎత్తివేసింది. అప్పటికి పై మూడు దేశాల్లో 11,310 మంది మరణించారు.

### పారిస్ ఒప్పందం..

పర్యావరణ కార్యాచరణపై ఈ దశాబ్దం ఆశలను రేకెత్తించింది. పర్యావరణ మార్పులపై పోరాటానికి ప్రపంచ దేశాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయి. 2015 డిసెంబర్‌లో పారిస్ వేదికగా చారిత్రాత్మక ఒప్పందం కుదిరింది. ఉష్ణోగ్రతల పెరుగుదలను 2 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువకు పరిమితం చేయాలని ప్రపంచ దేశాలు ప్రతినబూనాయి.

### 2030 ఎజెండా




అందరి సుస్థిరాభివృద్ధి కోసం 2030 ఎజెండాకు రూపకల్పన చేయడం ఈ దశాబ్దంలో చోటుచేసుకున్న ముఖ్యమైన పరిణామం. సహస్రాభివృద్ధి లక్ష్యాలను అనుసరించి 2016లో 2030 ఎజెండాను రూపొందించారు. ఇందులోభాగంగా ప్రపంచానికి పెను సవాల్‌గా మారిన పేదరికాన్ని నిర్మూలించడంతోపాటు ప్రజలు (పీపుల్), గ్రహం (ప్లానెట్), శ్రేయస్సు (ప్రాస్పరిటీ) కోసం ప్రత్యేకంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఈ లక్ష్యాల సాధనకు 2020 నాటికి ఇక 10 ఏండ్లే మిగిలి ఉన్న నేపథ్యంలో కార్యాచరణను వేగవంతం చేసేందుకు ఐరాస దశాబ్దపు ప్రణాళికను ప్రారంభించింది.

## రైల్వే ఉద్యోగాలు యూపీఎస్సీతో భర్తీ

మొదటిపేజీ తరువాయి...

తీసుకురావాలని రైల్వేశాఖ ప్రయత్నిస్తున్నదని, అంతేగానీ, కెరీర్‌లో దూసుకుపోతున్నవాళ్లకు అడ్డుపుల్ల వేయడం తమ అభిమతంకాదని అన్నారు.



**ఐఆర్‌ఎంఎస్‌పై అధికారుల నిరసన**

రైల్వే సర్వీసుల విలీనం వల్ల తమ సీనియార్టీకి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్న అధికారులకు రైల్వే మంత్రి పీయూష్ గోయల్ అభయమిచ్చారు. అధికారుల క్యాడర్ (హోదా) ఆధారంగా పోస్టులను నిర్ణయించబోమని, సీనియార్టీతోపాటు ప్రతిభ ఆధారంగా అధికారులందరికీ సమాన అవకాశాలు లభిస్తాయని ఆయన ట్విట్టర్ వేదికగా భరోసా ఇచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ రైలు ప్రమాదాల్లో ఒక్క ప్రయాణికుడూ మరణించలేదని, 166 ఏండ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన భారతీయ రైల్వేల్లో ఇంతగొప్ప రికార్డు నమోదవడం ఇదే తొలిసారని మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. కాగా రైల్వే సర్వీసుల విలీనంపై ఆ శాఖాధికారులు సోషల్ మీడియా వేదికగా తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. 'ఐఆర్‌ఎంఎస్‌కు అనుమతించం' పేరిట హ్యాష్‌ట్యాగ్ జోడించి తమ నిరసన ప్రకటిస్తున్నారు. ఇంజినీరింగ్ పూర్తయిన అభ్యర్థులు 23-24 ఏండ్ల వయసులో రైల్వే ఇంజినీరింగ్ సర్వీసుల్లో వచ్చి చేరుతారు. సివిల్ సర్వీసుల్లో చేరేటప్పుడు అధికారుల వయసు రమారమి 27-28 ఏండ్లుగా ఉంటుంది. తాజా విలీనం ద్వారా ఇంజినీరింగ్ సర్వీసుల ద్వారా వచ్చిన అధికారులకు విభాగాధిపతులుగా పదోన్నతులు ఇస్తే, వాళ్లు మరింత కాలం ఆ సర్వీసులో కొనసాగుతారు. దీంతో సివిల్ సర్వీసుల ద్వారా వచ్చిన అధికారులు తీవ్రంగా నష్టపోతారు' అని సివిల్ అధికారి ఒకరు ఆందోళన వ్యక్తంచేశారు.

**చార్జీల పెంపుపై సుదీర్ఘంగా చర్చించాలి**

ప్రయాణ చార్జీలతోపాటు సరుకు రవాణా చార్జీల 'హేతుబద్ధీకరణ'కు రైల్వేలు కసరత్తు చేస్తున్నట్టు రైల్వే బోర్డు చైర్మన్ వీకే యాదవ్ వెల్లడించారు. అయితే చార్జీలను పెంచుతారా? అన్న ప్రశ్నకు సమాధానమిచ్చేందుకు ఆయన నిరాకరించారు. ఆదాయ తగ్గుదలను అడ్డుకొనేందుకు రైల్వేలు అనేక చర్యలు ప్రారంభించాయని, చార్జీల పెంపుదల 'సున్నితమైన' అంశమని, దీనిపై తుది నిర్ణయానికి వచ్చేముందు సుదీర్ఘంగా చర్చించాల్సి ఉన్నదని గురువారం ఆయన మీడియా సమావేశంలో చెప్పారు. ప్రస్తుతం దేశంలోని దాదాపు అన్ని రంగాలపై దుష్ప్రభావం చూపుతున్న ఆర్థిక మందగమనం రైల్వేలను కూడా దెబ్బతీసింది. దీంతో గత ఆర్థిక సంవత్సరం (2018-19)తో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సర ద్వితీయ త్రైమాసికం (జులై-సెప్టెంబర్)లో భారత రైల్వే ఆదాయం రూ.4,056 కోట్లు తగ్గింది. ఈ నేపథ్యంలోనే ప్రయాణ, సరుకు రవాణా చార్జీల హేతుబద్ధీకరణకు రైల్వేశాఖ కసరత్తు చేస్తున్నది.

# నిరసనల సెగ

- సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా పలు చోట్ల ర్యాలీలు
- యూపీ పోలీసుల తీరుపై హక్కుల సంఘాల ఆందోళన
- బీజేపీ నిప్పుతో చెలగాటం ఆడుతున్నదని మమత విమర్శ
- గవర్నర్ ధన్‌కర్‌ను చాన్స్‌లర్ పదవి నుంచి తొలగించినట్లు జేయూ విద్యార్థుల లేఖ



సీఏఏకు వ్యతిరేకంగా గురువారం మైసూరులో నిర్వహించిన సభకు భారీగా హాజరైన జనం

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ), జాతీయ పౌర జాబితా(ఎన్నార్సీ)కి వ్యతిరేకంగా పలు రాష్ర్టాల్లో నిరసనలు కొనసాగుతున్నాయి. గురువారం తమిళనాడులో రచయితలు, సామాజిక కార్యకర్తల సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. డీఎంకే ఎంపీ కణిమొళి, సీపీఐ నేత నల్లకన్ను, వీసీకే వ్యవస్థాపకుడు, ఎంపీ థోల్ తిరుమావళవన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కే బాలకృష్ణన్, ఐయూ ఎంఎల్ నేతలు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్ పోలీసుల తీరును నిరసిస్తూ ఢిల్లీలోని యూపీ భవన్ వద్ద గురువారం పలువురు నిరసన తెలిపారు. దీంతో 213 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**ప్రభుత్వానివి పచ్చి అబద్ధాలు**

జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) ప్రక్రియ అనుమానాస్పద పౌరులను గుర్తించేందుకేనని ప్రముఖ హక్కుల కార్యకర్త హర్ష మందర్ ఆరోపించారు. ఎన్పీఆర్ కోసం సేకరించే సమాచారాన్ని ఎన్నార్సీకి వినియోగించే అవకాశమున్నదన్నారు. ఉత్తరప్రదేశ్‌లో భయానక పాలన నెలకొన్నదని స్వరాజ్ ఇండియా నేత యోగేంద్ర యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు.

**యూపీలో 19కి చేరిన మరణాల సంఖ్య**

ఉత్తరప్రదేశ్‌లో సీఏఏ వ్యతిరేక ఆందోళలను అణిచివేసే క్రమంలో జరిగిన పోలీసు కాల్పుల్లో ఇప్పటి వరకు 19 మంది మరణించినట్లు గురువారం పోలీసులు ప్రకటించారు. తొక్కిసలాటలో చనిపోయిన 8 ఏండ్ల బాలుడ్ని ఈ జాబితాలో చేర్చలేదన్నారు.

**వెనక్కి తీసుకునే వరకు నిరసనలు: మమత**

సీఏఏను వెనక్కి తీసుకునే వరకు శాంతియుతంగా నిరసనలు కొనసాగిస్తామని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తెలిపారు. గురువారం కోల్‌కతాలో జరిగిన నిరసన ర్యాలీకి ఆమె నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ.. నిప్పుతో చెలగాటమాడవద్దని బీజేపీని హెచ్చరించారు. చొరబాటుదారుల పేరుతో అందరినీ తరిమేస్తే నువ్వు మాత్రం ఎలా ఉండగలవంటూ ప్రధాని మోదీనుద్దేశించి వ్యాఖ్యానించారు. బెంగాల్ గవర్నర్ జగదీప్ ధన్‌కర్‌ను చాన్స్‌లర్ పదవి నుంచి తొలగిస్తున్నట్లు జాదవ్‌పూర్ యూనివర్సిటీ (జేయూ)కు చెందిన రెండు విద్యార్థి సంఘాలు పేర్కొన్నాయి. తమ పరీక్షల్లో ఆయన అన్నింటా విఫలమయ్యారంటూ గురువారం ఓ బహిరంగ లేఖ రాశాయి.

### విపక్షాలు, ఒక వర్గం మీడియా అసత్య ప్రచారం: కిషన్‌రెడ్డి

ఎన్పీఆర్‌పై విపక్షాలు, ఒక వర్గం మీడియా ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జీ కిషన్‌రెడ్డి విమర్శించారు. ఎన్నార్సీకి, ఎన్పీఆర్‌కు మధ్య ఎలాంటి సంబంధం లేదన్నారు. 2021లో జరుగనున్న జనగణనలో ప్రస్తుత ఎన్పీఆర్ అంతర్భాగమన్నారు. గత యుపీఏ చేపట్టిన ఎన్పీఆర్ ప్రక్రియకు మూడు, నాలుగు అదనపు అంశాలను జోడించి 2019లో వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఒక వ్యక్తి తల్లిదండ్రులు, జన్మ స్థలం వివరాలు, ఆధార్ నంబర్, చివరి నివాస స్థలం వివరాలను ఎన్పీఆర్‌లో పొందుపరుచనున్న కనీస ప్రాథమిక అంశాలన్నారు.



## ఎన్నార్సీపై బీజేపీ వెనుకడుగు వ్యూహాత్మకం

- మళ్లీ తెరపైకి ఎన్నార్సీ రావొచ్చు
- జేడీయూ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యలు

**పాట్నా:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)లపై దేశ వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలోనే కేంద్రం వెనుకడుగు వేసిందని జనతాదళ్ (యూ) ఉపాధ్యక్షుడు, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అన్నారు. కానీ ఇది తాత్కాలికమైనదేనని, మళ్లీ ఎన్నార్సీ తెరపైకి వచ్చే అవకాశముందని తెలిపారు. గురువారం ఆయన ట్వీట్ చేస్తూ 'ఎన్నార్సీపై కేంద్రం వెనుకడుగు వేయడం వ్యూహంలో భాగమే. అంతేగానీ సమస్యకు ఫుల్‌స్టాప్ పడ్డట్టుకాదు. సీఏఏను వ్యతిరేకిస్తూ చాలా మంది సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై సుప్రీంకోర్టు తీర్పు కోసం కేంద్రం ఎదురుచూస్తున్నది. ఒకవేళ కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తే మాత్రం మొత్తం ప్రక్రియ (సీఏఏ అమలు, ఎన్నార్సీని చేపట్టడం) యథావిధిగా అమలు అవుతుంది' అని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు.

## కరీంనగర్, ఆదిలాబాద్‌లో భారీ ర్యాలీలు

**ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ/సుభాష్‌నగర్:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)లను వ్యతిరేకిస్తూ కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో భారీ నిరసన ప్రదర్శలు జరిగాయి. గురువారం కరీంనగర్‌లో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. స్థానిక తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు జరిగిన ఈ ర్యాలీలో పలు ముస్లిం సంఘాలు పాల్గొన్నాయి. కలెక్టరేట్ వద్దకు చేరుకున్న తర్వాత అక్కడ నిరసనకారులు ధర్నాకు దిగారు. సీఏఏ, ఎన్నార్సీలను ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మరోవైపు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోనూ భారీ ర్యాలీ జరిగింది. పట్టణంలోని ఈద్గా నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఆర్డీవో కార్యాలయం వరకు కొనసాగింది. దీనిలో ఎమ్మెల్యే జోగు రామన్న కూడా పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్న తర్వాత జోగు రామన్న, ఇతర పార్టీల నాయకులు కలిసి ఆర్డీవో సూర్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు.



ఆదిలాబాద్‌లో భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

## బీజేపీది ప్రమాదకర ఎజెండా

- 2010 ఎన్పీఆర్ వేరు.. ఇప్పటి ఎన్పీఆర్ వేరు
- కేంద్రంపై చిదంబరం ధ్వజం



**న్యూఢిల్లీ:** జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్)ను రూపొందించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంపై కాంగ్రెస్ నేత చిదంబరం విరుచుకుపడ్డారు. ఈ జాబితాను రూపొందించాలన్న దాని వెనుక అసలు రహస్యాలు వేరే ఉన్నాయని, ఇది చాలా ప్రమాదకరమని చెప్పారు. '2010లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఎన్పీఆర్ వేరు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం చేపట్టాలనుకుంటున్న ఎన్పీఆర్ వేరు. 2010 నాటి ఎన్పీఆర్ ఉద్దేశం, అందులోని సారాంశానికి భిన్నంగా ప్రస్తుత ఎన్పీఆర్ ఉన్నది. కేంద్రం ఓ ప్రమాదకర ఎజెండాతో ముందుకుపోతున్నది' అని ఆయన ట్వీట్ చేశారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం సదుద్దేశంతోనే ఎన్పీఆర్‌ను చేపడుతున్నట్లయితే.. కాంగ్రెస్ ప్రభుత్వం 2010లో రూపొందించిన ఎన్పీఆర్ మార్గదర్శకాల ప్రకారమే ప్రస్తుతం ముందుకెళ్తామని, దీన్ని జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)కు అనుసంధానించమని ప్రభుత్వం భేషరతుగా ప్రకటించాలని చిదంబరం డిమాండ్ చేశారు. 2010లో ఎన్పీఆర్ ప్రారంభానికి సంబంధించిన వీడియో క్లిప్‌ను బీజేపీ విడుదల చేయడంపై ఆయన స్పందిస్తూ.. 'బీజేపీ నాయకులారా.. ఆ వీడియోను వినండి. అప్పుడు మేము దేశంలోని సాధారణ పౌరులను లెక్కించాము. ఎన్పీఆర్‌లో నివాసానికి ప్రాధాన్యమిచ్చాముగానీ పౌరసత్వానికి కాదు' అని పేర్కొన్నారు.

### భరతమాతనూ తప్పుదోవ పట్టిస్తున్నారు

ప్రధానిపై రాహుల్ మండిపాటు

**న్యూఢిల్లీ:** తరుచుగా భరతమాత గురించి చెప్పుకునే ప్రధాని మోదీ ప్రస్తుతం ఆమెను కూడా తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ మేరకు గురువారం ట్వీట్ చేశారు. దేశంలోని ముస్లింలను నిర్బంధ కేంద్రాలకు పంపుతారని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు వదంతులు వ్యాప్తి చేస్తున్నాయంటూ ఇటీవల ప్రధాని పేర్కొన్న ఓ వీడియోనూ ట్వీట్‌కు జత చేశారు. ఆ వీడియోలో అసోంలో నిర్మించిన నిర్బంధ కేంద్రం కూడా ఉన్నది. ఓ వైపు నిర్బంధ కేంద్రాలు నిర్మిస్తూనే మరోవైపు అలాంటివేమీ లేవంటూ ప్రధాని చెబుతున్నారని చివరికి భరతమాతను కూడా తప్పుదోవ పట్టిస్తున్నారన్నారని రాహుల్ విమర్శించారు.

## తుక్డే తుక్డే గ్యాంగ్‌ను ఓడిద్దాం

బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై గందరగోళం సృష్టించి, ప్రజలను తప్పుదారి పట్టించి రాజధాని నగరం ఢిల్లీలోని సామరస్యపూర్వక వాతావరణాన్ని చెడగొట్టిందంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా గురువారం ప్రతిపక్ష కాంగ్రెస్‌ను నిందించారు. ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ (డీడీఏ) నిర్వహించిన ఓ కార్యక్రమంలో సీఏఏను వ్యతిరేకించిన వామపక్ష మేధావులను ఉద్దేశిస్తూ 'తుక్డే తుక్డే గ్యాంగ్'ను ఓడించే సమయం వచ్చిందని అమిత్‌షా తెలిపారు. 'కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రతిపక్షాలు పౌరసత్వ సవరణ చట్టంపై గందరగోళాన్ని సృష్టించాయి. సీఏఏపై తప్పుదారి పట్టించిన ప్రతిపక్షం ఢిల్లీ ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టింది' అని అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీ పరిస్థితి మెరుగైందన్న అమిత్‌షా.. ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వానికి సమయం ముగిసిందని తెలిపారు. 'కమలం వికసిస్తుంది. ఢిల్లీ.. నువ్వు బీజేపీకి మొత్తం ఏడు ఎంపీ సీట్లిచ్చావు, దేశ రాజధాని అభివృద్ధికి వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఎమ్మెల్యేలను ఇచ్చే సమయం వచ్చింది' అని వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ తీరు కేంద్ర పథకాలకు అడ్డుగా పరిణమించిందని విమర్శించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్ పథకాలను అమలు చేయని కేజ్రీవాల్‌కు.. కేంద్రం పథకాలకు తన పేరును తగిలించుకోవడమే కావాలని విమర్శించారు. ఢిల్లీ అసెంబ్లీకి వచ్చే ఏడాది ప్రారంభంలోనే ఎన్నికలు జరుగనున్నాయి.



కర్మాన్‌ఘాట్ చంద్రా గార్డెన్స్‌లో బుధవారం రాత్రి జన్మదిన వేడుకలు జరుపుకొంటున్న టీఆర్ఎస్ నేత కొత్త మనోహర్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న ఎంపీ రాములు. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కూడా ఉన్నారు

రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్‌శాఖ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సర్ఫరాజ్ అహ్మద్ ఆ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రుల నివాస సముదాయంలో కలిసి మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నూతన కమిషనర్‌కు అభినందనలు తెలిపారు.

- హైదరాబాద్, నమస్తే తెలంగాణ



## జనవరి 2 నుంచి హైదరాబాద్‌లో అశ్వమేధ యజ్ఞం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** లోక కల్యాణం, విశ్వమానవ శ్రేయస్సు కోసం జనవరి 2 నుంచి 5వ తేదీ వరకు హైదరాబాద్‌లో అశ్వమేధ గాయత్రి మహాయజ్ఞం నిర్వహించనున్నట్టు గాయత్రి పరివార్ ప్రతినిధులు తెలిపారు. యజ్ఞాన్ని మైసమ్మగూడ మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో నాలుగురోజులపాటు నిర్వహిస్తామన్నారు. అఖిల విశ్వగాయత్రి పరివార్ శాంతి కుంజ్ హరిద్వార్ సారథ్యంలో 551 యజ్ఞకుండాలతో మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఇందులో అందరూ పాల్గొనవచ్చని, యాత్రికులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు.



మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో అశ్వమేధ గాయత్రి మహాయజ్ఞానికి సిద్ధమవుతున్న వేదిక



## అందంగా 130 పట్టణ అటవీబ్లాక్‌లు

- అటవీశాఖపై ట్విట్టర్‌లో సీఎస్ ఎస్కే జోషి ప్రశంసలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రేటర్ హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న కేబీఆర్ జాతీయపార్కును సందర్శించాలనే తన చిరకాల కోరిక క్రిస్మస్ పర్వదిన ఉదయాన నెరవేరిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శైలేంద్రకుమార్ జోషి గురువారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కేబీఆర్ పార్కును సర్వాంగసుందరంగా తీర్చిదిద్దడానికి అటవీ శాఖ ఎంతో కృషిచేసిందని తెలిపారు. రాష్ట్రంలోని 130 పట్టణ అటవీ బ్లాక్‌లను అందంగా తీర్చిదిద్దుతున్నదని ప్రశంసించారు. కేబీఆర్ పార్కులో అటవీశాఖ అధికారులు, తన జీవిత సహచరినితో కలిసిదిగిన ఫొటోలను జోషి ట్విట్టర్‌లో షేర్‌చేశారు. పార్కులో కనువిందుచేస్తున్న నెమళ్ల ఫొటోలను సైతం సోషల్‌మీడియాలో పంచుకున్నారు.

## జర్నలిస్టుల కుటుంబాలకు
# నేడు చెక్కుల పంపిణీ

- మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జర్నలిస్టుల సంక్షేమనిధి నుంచి అందించే ఆర్థిక సహాయం కింద 34 మంది జర్నలిస్టుల కుటుంబాలకు శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని మీడియా అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేయనున్నట్టు మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. ఆర్థికసహాయం అందుకోనున్నవారిలో 30 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబసభ్యులు, నలుగురు తీవ్ర ప్రమాదాలు లేదా అనారోగ్యం బారినపడిన జర్నలిస్టులు ఉన్నట్టు వివరించారు. ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా జర్నలిస్టుల సంక్షేమనిధిని ఏర్పాటుచేసిన తెలంగాణ ప్రభుత్వం.. గత మూడేండ్లలో రూ.34.50 కోట్లు విడుదలచేసిందని చెప్పారు. ఇప్పటివరకు 224 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఆర్థికసాయంతోపాటు ప్రతినెలా రూ.మూడువేల చొప్పున పెన్షన్ అందజేస్తున్నామన్నారు. బాధిత కుటుంబాల్లోని 124 మంది విద్యార్థులకు నెలకు రూ.1000 చొప్పున ట్యూషన్‌ఫీజు చెల్లిస్తున్నట్టు తెలిపారు. తీవ్ర అనారోగ్యం కారణంగా పనిచేయలేనిస్థితిలో ఉన్న 87 మంది జర్నలిస్టులకు ఒక్కొక్కరికీ రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేసినట్టు వివరించారు.



## నేటినుంచి భద్రాద్రిలో అధ్యయన మహోత్సవాలు

**భద్రాచలం, నమస్తేతెలంగాణ:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో శుక్రవారం నుంచి శ్రీవైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయన మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. శుక్రవారం నుంచి వచ్చే నెల 6 వరకు ఈ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈనెల 27న మత్స్యావతారం, 28న కూర్మావతారం, 29న వరాహవతారం, 30న నర్సింహావతారం, 31న వామనావతారం, జనవరి ఒకటిన పరశురామావతారం, 2న శ్రీరామావతారం, 3న బలరామావతారం, 4న శ్రీకృష్ణావతారం, 5న స్వామివారి తెప్పోత్సవం, 6న స్వామివారి ఉత్తర ద్వారదర్శనం వేడుకలు నిర్వహించనున్నారు.



దండేపల్లి మండలం తాళ్లపేట కొనుగోలు కేంద్రం తూకం వేసిన ధాన్యంపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

## మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో జల్లులు

**నవస్తే నెట్‌వర్క్:** అల్పపీడన ద్రోణి ప్రభావంతో గురువారం మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో చిరు జల్లులు కురిశాయి. మంచిర్యాల జిల్లా జన్నారం, దండేపల్లి, నెన్నెల, వేమనపల్లి, కోటపల్లి, చెన్నూర్, మందమర్రి మండలాల్లో గురువారం జల్లులు పడ్డాయి. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం కుప్పల మీద టార్పాలిన్లు కప్పారు. కాగా కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి చిరుజల్లులు కురిశాయి.



అర్వపల్లిలో వందో పుట్టినరోజు వేడుకలను జరుపుకుంటున్న లక్ష్మీనర్సమ్మ

## ఐదు తరాల కుటుంబసభ్యుల నడుమ
# 100వ పుట్టిన రోజు

**అర్వపల్లి :** పాలవరపు లక్ష్మీనర్సమ్మ అనే శతాధిక వృద్ధురాలు ఐదు తరాల కుటుంబసభ్యుల నడుమ తన 100వ పుట్టినరోజు వేడుకలను గురువారం సూర్యాపేట జిల్లా, అర్వపల్లి మండల కేంద్రంలోని తన కుమార్తెల నివాసంలో అత్యంత ఘనంగా జరుపుకున్నారు. లక్ష్మీనర్సమ్మకు ఇద్దరు కుమార్తెలు, 36మంది మనుమలు, మనుమరాండ్లు ఉన్నారు. కాగా ఆమె సొంతూరు శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ గ్రామం కాగా కుమార్తెల వద్ద అర్వపల్లిలో ఉంటుంది. ఈ సందర్భంగా లక్ష్మీనర్సమ్మ చేత మనమలు, మనమరాండ్లు పుట్టినరోజు కేకును కట్ చేయించారు. కార్యక్రమంలో కుమార్తెలు సుగుణమ్మ, ధనలక్ష్మి, మనమలు సోమయ్య, జగత్, లక్ష్మి, రూప, సుభద్ర, రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఆసరా.. అంతా పారదర్శకమే

- 42 వేలమంది చనిపోయిన పింఛన్‌దారుల గుర్తింపు
- గ్రామాల్లో పదిలక్షల పింఛన్లపై విచారణ పూర్తి
- పట్టణ ప్రాంతాల్లోనూ విచారణకు కసరత్తు
- అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలన్నదే లక్ష్యం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించడానికి ప్రభుత్వం పక్కాగా వ్యవహరిస్తున్నది. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులకు అందించే పింఛన్లలో లోటుపాట్లు రాకుండా చర్యలు తీసుకుంటున్నది. కొంతకాలంగా రాష్ట్రంలో చనిపోయిన కొందరికి పింఛన్లు అందుతున్నాయని భావించిన ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది. గ్రామస్థాయిలో విచారణ జరిపిన అధికారులు 42వేల మంది పింఛన్‌దారులు చనిపోయినప్పటికీ వారి ఖాతాల్లోకి పింఛన్ సొమ్ము వెళ్తున్నట్లు గుర్తించారు. బ్యాంకు ఖాతాలున్న పింఛనుదారులకు వారు లేకున్నప్పటికీ.. పింఛన్ సొమ్ము జమ అవుతున్నది. పోస్టాఫీసుల నుంచి తీసుకొనేవారి పింఛనుసొమ్మును కొన్నిచోట్ల వారి బంధువులో, పింఛన్ పంపిణీదారులో తీసుకుంటున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల రెండుమూడేండ్ల కింద చనిపోయినవారి పింఛన్ కూడా ఖాతాల్లో జమవుతున్నట్లు బయటపడింది. బ్యాంకు ఖాతాల నుంచి పింఛన్లు తీసుకునేవారు ప్రతిఏటా వారి లైఫ్ సర్టిఫికెట్ (బతికి ఉన్నామని తెలిపే ధ్రువీకరణ పత్రం) బ్యాంకుకు సమర్పించాలి. కానీ కొన్ని బ్యాంకులు అలాంటి ధ్రువీకరణ పత్రాలను పరిగణనలోకి తీసుకోకుండానే వ్యవహరించడం వల్ల.. చనిపోయినవారి ఖాతాల్లోనూ పింఛన్ జమ అవుతున్నది. దీంతో ఈ నెల 18 నుంచి ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల జాబితా ఆధారంగా విచారణ చేపట్టారు. ముందుగా గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ చేస్తున్న 10,14,980 పింఛన్లపై పరిశీలనచేశారు. బుధవారం నాటికి దాదాపు పది లక్షల పింఛన్ల పంపిణీదారులపై విచారణ ముగించారు. మొదట చనిపోయినవారి వివరాలను సేకరించారు. పంచాయతీ కార్యదర్శులు కూడా కొన్నిచోట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తించారు. మరణ ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నవారికి సైతం పింఛన్లు యథావిధిగా మంజూరు చేసినట్లు తేలింది. 32 జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో 42,035 మంది పింఛన్‌దారులు మృతి చెందినట్లు తేలింది. వీరిలో 3,400 మంది రెండు, మూడేండ్ల కిందటే చనిపోయినా ఇంకా పింఛన్ వస్తున్నట్లు గుర్తించారు. జిల్లాలవారీగా చనిపోయిన పింఛన్‌దారుల జాబితా సిద్ధంచేశారు.

### మృతులను జాబితా నుంచి తొలగిస్తున్నాం

గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 10 లక్షల మంది పింఛన్ల జాబితాను పరిశీలించాం. 42 వేల మంది చనిపోయినట్లు తేలింది. పింఛన్ల సొమ్ము ఎక్కడ వృథా అయ్యిందో గుర్తిస్తున్నాం. బ్యాంకు ఖాతాల నుంచి, పోస్టాఫీసుల నుంచి.. ఎప్పుడు, ఎవరు విత్‌డ్రా చేశారనే అంశాలపై సమగ్రంగా విచారిస్తున్నాం.

– నవీన్ కుమార్,
సెర్ప్ పింఛన్ విభాగం డైరెక్టర్

### పింఛన్లు తీసుకుంటున్న కుటుంబ సభ్యులు

రాష్ట్రంలో మొత్తం 39.14 లక్షల మందికి ఆసరా పింఛన్లు ఇస్తున్నారు. బ్యాంకుల నుంచి 17.42 లక్షలు, పోస్టాఫీసుల నుంచి 21.72 లక్షల మందికి పంపిణీచేస్తున్నారు. పోస్టాఫీసుల్లో వేలిముద్ర ద్వారా పింఛన్లు ఇస్తుండగా, వరుసగా మూడునెలలు తీసుకోకుంటే వారి పింఛన్లను నిలిపివేయాల్సి ఉంటుంది. అన్నిచోట్ల అలా నిలిపివేయలేదని విచారణలో తేలింది. పలు కారణాలను చూపిస్తూ కుటుంబ సభ్యులు, పంపిణీదారులు డ్రా చేసినట్లు భావిస్తున్నారు. బ్యాంకుల నుంచి తీసుకుంటున్న లబ్ధిదారులకు సంబంధించిన పింఛన్ సొమ్మును కుటుంబ సభ్యులు తీసుకుంటున్నట్లు సమాచారం. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించడానికే ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటున్నది. పింఛన్ అర్హత వయస్సును కూడా సీఎం కేసీఆర్ తగ్గించడంతో ఐదారు లక్షల మంది లబ్ధిదారులు పెరిగే అవకాశం ఉన్నది. అందుకే కచ్చితంగా అర్హులను గుర్తించి పింఛన్ ఇవ్వడానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తున్నది.

**జిల్లాలవారీగా చనిపోయిన లబ్ధిదారులు**

| జిల్లా | గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ చేస్తున్న పింఛన్లు | చనిపోయిన పింఛన్‌దారులు |
|---|---|---|
| ఆదిలాబాద్ | 5,277 | 894 |
| భద్రాద్రి కొత్తగూడెం | 84,488 | 353 |
| జగిత్యాల | 1,43,261 | 1,550 |
| జనగామ | 5,681 | 1,299 |
| జయశంకర్ భూపాలపల్లి | 17,593 | 861 |
| జోగుళాంబ గద్వాల | 21,576 | 264 |
| కామారెడ్డి | 9,213 | 1,826 |
| కరీంనగర్ | 78,455 | 925 |
| ఖమ్మం | 1,29,037 | 2,950 |
| కుమ్రం భీం ఆసిఫాబాద్ | 2,757 | 880 |
| మహబూబాబాద్ | 7,320 | 1,854 |
| మహబూబ్‌నగర్ | 6,060 | 1,877 |
| మంచిర్యాల | 5,081 | 1,172 |
| మెదక్ | 55,216 | 1,495 |
| మేడ్చల్ మల్కాజిగిరి | 1,480 | 423 |
| ములుగు | 9,710 | 1,056 |
| నాగర్ కర్నూల్ | 36,711 | 1,379 |
| నల్లగొండ | 12,178 | 2,111 |
| నారాయణపేట | 5455 | 1,105 |
| నిర్మల్ | 5,467 | 1,340 |
| నిజామాబాద్ | 10,362 | 717 |
| పెద్దపల్లి | 52,273 | 1,115 |
| రాజన్న సిరిసిల్ల | 80,281 | 1,213 |
| రంగారెడ్డి | 6,857 | 2,316 |
| సంగారెడ్డి | 55,464 | 1,187 |
| సిద్దిపేట | 88,813 | 1,308 |
| సూర్యాపేట | 9,041 | 2,253 |
| వికారాబాద్ | 5,927 | 1,138 |
| వనపర్తి | 27,145 | 1,039 |
| వరంగల్ రూరల్ | 7,502 | 1,955 |
| వరంగల్ అర్బన్ | 22,089 | 742 |
| యాదాద్రి భువనగిరి | 7,210 | 1,438 |
| మొత్తం | 10,14,980 | 42,035 |

## ఫుడ్‌సేఫ్టీ అధికారుల ఖాళీలు భర్తీచేయండి

- టీఎస్‌పీఎస్సీని ఆదేశించిన హైకోర్టు
- అవసరమైన అదనపు పోస్టుల వివరాలు ఇవ్వాలి
- కార్బైడ్ నియంత్రణ చర్యలను వివరించాలని ఆదేశం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 36 ఫుడ్‌సేఫ్టీ అధికారుల ఖాళీలను భర్తీచేయాలని హైకోర్టు టీఎస్‌పీఎస్సీకి ఆదేశాలు జారీచేసింది. వీటితోపాటు ఆరు గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఒక అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ పోస్టులనూ భర్తీచేయాలని స్పష్టం చేసింది. రెండునెలల్లో ఈ ప్రక్రియను పూర్తిచేయాలని తెలిపింది. పండ్లను మాగబెట్టేందుకు ప్రమాదకర రసాయనాలను విచ్చలవిడి వినియోగిస్తున్నట్టు వచ్చిన కథనాలను గతంలో సుమోటోగా స్వీకరించిన కేసుపై హైకోర్టు విచారణ చేపట్టింది. ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రసాయనాల వినియోగంపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని సూచించింది. ఖాళీ పోస్టుల భర్తీతోపాటు అదనంగా ఎన్ని పోస్టులను సృష్టించే అవకాశం ఉన్నదో తెలియజేయాలని వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. ప్రజారోగ్యం, ఆహార కల్తీ నివారణకు తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఎన్ని పోస్టులు, సిబ్బంది ఉన్నారో పరిశీలించాలని సూచించింది. పోస్టులను సృష్టించే విషయంలో రాష్ట్ర జనాభాను ప్రాతిపదికగా తీసుకోవాలని, కొత్త పోస్టులు సృష్టించేందుకు ఎంత సమయం కావాలో కోర్టుకు తెలియజేయాలని ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది.

### కార్బైడ్ నియంత్రణకు తీసుకున్న చర్యలేమిటి?

పండ్లను మాగబెట్టేందుకు ఉపయోగించే కార్బైడ్, ఇతర రసాయనాల ఉత్పత్తి, మార్కెటింగ్‌ను నియంత్రించేందుకు తీసుకున్న చర్యలు వివరించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. మార్కెట్‌లో వాటి లభ్యతను ఎలా అదుపుచేస్తున్నారో తెలుపాలని పేర్కొన్నది. దీంతోపాటు కార్బైడ్‌ను దుర్వినియోగం చేసిన కేసుల్లో 2015 నుంచి ఇప్పటివరకు ఎంతమంది నిందితులను ప్రాసిక్యూట్ చేశారనే వివరాలు సమర్పించాలని ఆదేశిస్తూ.. విచారణను వచ్చేనెల ఆరోతేదీకి వాయిదా వేసింది.

### జీహెచ్‌ఎంసీ విధులపై ఉన్నతస్థాయి కమిటీకి పిల్

జీహెచ్‌ఎంసీ చట్టం ప్రకారం నిరంతరం రోడ్ల నిర్వహణ, తాగునీటి సరఫరా, లీకేజీలు, చెత్త తొలగింపు, పారిశుద్ధ్య చర్యల వంటి విధుల పర్యవేక్షణకు ఉన్నతస్థాయి నియంత్రణ కమిటీని (హైపవర్ మానిటరింగ్ కమిటీ) ఏర్పాటుచేసేలా ఆదేశాలివ్వాలని హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఇండియా అండర్ 2030 అజెండా, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, ఐరాస సర్వసభ్య సమావేశం ఆమోదించిన న్యూఅర్బన్ అజెండా తీర్మానాలకు అనుగుణంగా సరైన నిర్వహణ, నిబంధనలు అమలు చేయాలని పిటిషనర్ కోరారు. నిర్వహణ అంశాలపై సమగ్ర వివరాలు, ఆయా విభాగాలకు చేస్తున్న ఖర్చుల సమాచారం సమర్పించేలా అధికారులకు ఆదేశాలు జారీచేయాలని కోరారు. నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తూ, ప్రజల ఇబ్బందులు తొలిగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్ సోమవారం (ఈ నెల 30న) విచారణకు వచ్చే అవకాశం ఉన్నది.

## ప్రేమ, శ్రమతోనే విస్తరణ

- సంఘ్ లక్ష్యసాధనకు సమర్పణభావంతో పనిచేయాలి
- విజయసంకల్ప శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆరెస్సెస్ అధిపతి మోహన్ భాగవత్ మార్గదర్శనం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ ఆదిబట్ల:** సంఘ్ కార్య విస్తరణకు సమాజం పట్ల ప్రేమ, శ్రమించే తత్వం ప్రధాన సాధనాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) సర్ సంఘ్ చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ అన్నారు. సంఘ్ లక్ష్యమైన దేశ పరమవైభవాన్ని సాధించడానికి ప్రతి కార్యకర్త సమర్పణభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆరెస్సెస్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగళ్‌పల్లిలో నిర్వహించిన 'విజయసంకల్ప శిబిరం' ముగింపు కార్యక్రమంలో గురువారం ఆయన స్వయంసేవకులకు మార్గదర్శనం చేశారు. సమాజంలో స్వయం సేవకుల ప్రవర్తన, భాష, సమాజం మేలుకోరే ఆలోచనలు, వాటిని తెలియజేసే విధానం కార్య విస్తరణలో కీలకమని చెప్పారు. వాటిని స్వయం సేవకులు విస్మరించకూడదన్నారు. విజయ సంకల్ప శిబిరం సార్వజనికోత్సవం ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో స్వయం సేవకులు తమతమ కార్యక్షేత్రాల్లో పనిచేయాలని ఆకాంక్షించారు. మూడురోజులపాటు నిర్వహించిన శిబిరంలో అఖిల భారతీయ సహకార్యవాహ్ ముకుందా, దక్షిణ మధ్య క్షేత్ర సంఘ్‌చాలక్ వీ నాగరాజు, తెలంగాణ ప్రాంత సంఘ్‌చాలక్ బూర్ల దక్షిణామూర్తి, దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ ఆలే శ్యాంకుమార్, దైసి రామకృష్ణ తదితరులు పాల్గొని స్వయం సేవకులకు, కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ ఎమ్మెల్యే డీకే అరుణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శిబిరానికి 7,940 మంది స్వయంసేవకులతోపాటు మరో వెయ్యి మంది ప్రబంధకులుగా హాజరయ్యారు.

# ఏకాకిని చేస్తున్నారు!

- టీపీసీసీ చీఫ్‌ను విమర్శిస్తే పట్టించుకోరా?
- ఒక్కరైనా అధికారపార్టీపై ఎదురుదాడి చేయరా: ఉత్తమ్
- విలువలేదని అలిగి వెళ్లిపోయిన వీహెచ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తనను ఏకాకిని చేస్తున్నారంటూ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంతపార్టీ నేతలపై అసంతృప్తి వెళ్లగక్కారు. సీనియర్లు ఎవరికివారే వ్యవహరిస్తున్నారని, పార్టీలో ఏం జరుగుతుందో తెలియడం లేదంటూ గురువారం గాంధీభవన్‌లో జరిగిన కోర్‌కమిటీ సమావేశంలో అసహనం వ్యక్తంచేశారు. మున్సిపల్ ఎన్నికల అంశంపై మాట్లాడిన తనపై అధికారపార్టీ నేతలు ఎదురుదాడి చేశారని.. కానీ వారి దాడిపై కాంగ్రెస్ నేతల్లో ఒక్కరు కూడా స్పందించలేదని మండిపడ్డారు. 'నన్ను తిడుతుంటే ఒక్కరు కూడా కౌంటర్ ఇవ్వరా?' అని ప్రశ్నించారు. కోర్ కమిటీలో ఉత్తమ్ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో గందరగోళానికి దారితీశాయి.

### ఇదేం కోర్ కమిటీ?

కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశంలో పార్టీ సీనియర్ నేత వీ హనుమంతరావు మరోసారి మండిపడ్డారు. పార్టీలో క్రమశిక్షణ ఎక్కడున్నదని, కోర్ కమిటీ సమావేశానికి ఎవరినిపడితే వారిని పిలుస్తున్నారంటూ ఆరోపణలు చేశారు. సమావేశానికి వస్తూనే తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. కొంతమంది పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారంటూ వ్యాఖ్యానించిన ఆయన కోర్‌కమిటీ వట్టిదేనంటూ సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఒక్కరిద్దరు వారించే ప్రయత్నం చేసినప్పటికీ.. వీహెచ్ ఆగలేదు. తర్వాత జరిగిన సమావేశంలో టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ ఆవేదనతో మాట్లాడారు. పార్టీలో రెండువర్గాలుగా వీడిపోతున్నారని, బీసీ వర్గాలు అసలే తన వైఖరిని జీర్ణించుకోవడం లేదని నేతలతో బహిరంగంగా చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో మాజీమంత్రి షబ్బీర్ అలీ కలుగజేసుకుని.. ఎవరో ఒకరు స్పందించి ఉండాల్సింది అని పేర్కొనగా దానిని కూడా కొంతమంది వ్యతిరేకించారు. ఎవరో ఒకరు స్పందించాలి అనే బదులు.. అలా అంటున్నవారే స్పందిస్తే సరిపోతుంది కదా? అంటూ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు.

### మోదీవి ఓటు బ్యాంకు రాజకీయాలు

మన్మోహన్ ప్రధానిగా ఉన్నప్పుడు బలమైన ఆర్థిక వ్యవస్థ ఉన్న ఐదుదేశాల్లో భారత్ ఉండేదని.. కానీ మోదీ ఓటుబ్యాంకు రాజకీయాలతో ఆ వ్యవస్థను దెబ్బతీస్తున్నారని ఏఐసీసీ అధికార ప్రతినిధి శక్తిసింగ్ గోయల్ ఆరోపించారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా దేశం పతనమవుతుంటే ప్రజల దృష్టి మరల్చేందుకే మోదీ పౌరసత్వ సవరణ చట్టం, ఎన్నార్సీలను తెరపైకి తెచ్చారన్నారు. మోదీ తన డిగ్రీ చూపించడం లేదు కానీ.. దేశ ప్రజలు బర్త్ సర్టిఫికెట్ చూపించాలంట? అని ఎద్దేవాచేశారు.

### ర్యాలీకి అనుమతివ్వండి

28న కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గాంధీభవన్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు ర్యాలీకి అనుమతి ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు భట్టి విక్రమార్క, జగ్గారెడ్డి, పొన్నం ప్రభాకర్, జీవన్‌రెడ్డి, ప్రభాకర్, కుసుమకుమార్ తదితరులు డీజీపీ మహేందర్‌రెడ్డిని కోరారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ర్యాలీకి అనుమతి లేదని, సమావేశం నిర్వహించుకునేందుకు మాత్రమే అవకాశం ఇస్తామని డీజీపీ చెప్పినట్టు కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

## పదవీవిరమణ వయస్సు పెంపుపై హర్షం

- ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ సంఘాల శుభాకాంక్షలు
- సీఎం త్వరలోనే తమకూ శుభవార్త చెప్తారని ఆశాభావం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ ఉద్యోగుల పదవీవిరమణ వయస్సును పెంచుతూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడంపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి. సీఎం కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తున్నారని అభినందనలు తెలిపాయి. ఆర్టీసీ ఉద్యోగులకు సైతం ఉద్యోగ సంఘాలు శుభాకాంక్షలు చెప్పాయి. సీఎం కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని గురువారం ఒక ప్రకటనలో కోరాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ త్వరలోనే మంచి ప్రకటన వస్తుందని టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సు పెంపును స్వాగతిస్తున్నామని, సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులందరికీ కూడా వర్తింపజేస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, అసోసియేట్ అధ్యక్షురాలు బండారు రేచల్, రామినేని శ్రీనివాస్‌రావు, హైదరాబాద్ జిల్లా, సిటీ అధ్యక్షుడు ఎస్‌ఎం ముజీబ్ హుస్సేన్, రాయకంటి ప్రతాప్, కొండల్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని టీజీవో అధ్యక్షురాలు మమత వెల్లడించారు. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన అన్ని అంశాల్లో సీఎం కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారని, ప్రభుత్వ ఉద్యోగులకు కూడా మంచి పరిణామాలు ఉంటాయన్నారు. టీజీవో ప్రధాన కార్యదర్శి ఏనుగుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పీ రవీందర్‌కుమార్, హైదరాబాద్ సిటీ అధ్యక్షుడు గండూరి వెంకటేశ్వర్లు, సహదేవ్, కృష్ణమూర్తి తదితరులు అభినందనలు తెలిపారు. తెలంగాణ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు పద్మాచారి, తెలంగాణ గ్రూప్– 1 అధికారుల సంఘం అధ్యక్షుడు హనుమంత్‌నాయక్, టీజీవో వైద్య విభాగం అధ్యక్షుడు జూపల్లి రాజేందర్, టీసీ టీజీవో అధ్యక్షుడు బీ వెంకటయ్య, టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, దేవాదాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భేతి రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం భిక్షమమ్మ, అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పున్నారెడ్డి, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దేవేందర్ తదితరులు హర్షం వ్యక్తంచేశారు.



సూర్యగ్రహణం ముగిసిన తరువాత వేములవాడలో రాజన్న ఆలయ ద్వారాన్ని తెరుస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

# తెరుచుకున్న ఆలయాలు

### సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు
### ఆ తరువాత భక్తులకు అనుమతి

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** సంపూర్ణ సూర్యగ్రహణం సందర్భంగా మూసివేసిన ఆలయాలు గురువారం మధ్యాహ్నం తర్వాత తిరిగి తెరుచుకున్నాయి. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మధ్యాహ్నం 12.30 గంటలకు తెరిచిన అర్చకులు గ్రహణ సంప్రోక్షణం, ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం చేసి, స్వామివారి నిత్యపూజలు నిర్వహించారు. వేములవాడ రాజన్న ఆలయం ఉదయం 11.20 గంటలకు తెరుచుకున్నది. ఆలయ అధికారులు, అర్చకులు సంప్రోక్షణ అనంతరం స్వామివారికి సుప్రభాతసేవ, ప్రాతఃకాలపూజల తరువాత భక్తులకు దర్శనం కలిగించే ఏర్పాట్లు చేశారు. అర్చకులతోపాటు వేములవాడ అనువంశిక కుటుంబాలకు చెందిన బ్రాహ్మణులు ఆలయ ధర్మగుండంలో



యాదాద్రిలో సంప్రోక్షణ చేస్తున్న ఆలయ అర్చకులు

గ్రహణ పట్టుస్నానాలు, విడుపు స్నానాలతోపాటుగా ధర్మగుండంపై జపాలు నిర్వహించారు. భద్రాద్రిలో మధ్యాహ్నం 12 గంటలకు అర్చ



భద్రాద్రి రామాలయాన్ని శుద్ధిచేస్తున్న సిబ్బంది

కులు ఆలయం తలుపులు తెరిచి సుప్రభాతసేవ, శాంతిహోమం, ఆరాధన నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా తిరుప్పావై సేవాకాలం చేశారు. ఏకాంత నివేదనలు చేపట్టారు. ఉదయం 11.30 గంటలకు ఆలయ శుద్ధి, సంప్రోక్షణ చేసి బాసర సరస్వతి అమ్మవారికి అభిషేకం, అలంకరణ, మహాహారతి ఇచ్చారు.





గురువారం జనగామ ఆర్టీసీ డిపో ఆవరణలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు



వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట డిపోలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

# ఆర్టీసీలో ఆనందహేల

### పదవీ విరమణ వయసు పెంపుపై హర్షం
### పటాకులు కాల్చి.. స్వీట్లు పంచిన ఉద్యోగులు
### సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 నుంచి 60 ఏండ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు గురువారం సంబురాలు జరుపుకొన్నారు. అన్ని డిపోల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. డిపోల ముందు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడిన ఏకైక సీఎం కేసీఆర్ అని, జై తెలంగాణ.. జై కేసీఆర్ అంటూ ఉద్యోగులు నినాదాలు చేశారు.

కరీంనగర్ వన్‌డిపోలో డీఎం అర్పిత, రెండో డిపోలో డీఎం మల్లేశం, హుజూరాబాద్ డిపోలో డీఎం రాజ్యలక్ష్మితోపాటు ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా డీఎంలు మాట్లాడుతూ.. కార్మికులందరిని ఉద్యోగులుగా గుర్తించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మెదక్ డిపో గ్యారేజ్‌లో ఉద్యోగులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. పదవీ విరమణ వయసును 60 ఏండ్లకు పెంచిన సీఎంకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపోలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. సీఎంకు ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలు రుణపడి ఉంటాయని డిపో అసిస్టెంట్ మేనేజర్ సర



కరీంనగర్ రెండో డిపోలో స్వీట్లు తినిపించుకుంటున్న ఆర్టీసీ ఉద్యోగులు

స్వతి అన్నారు. భూపాలపల్లి ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగులు డిపో మేనేజర్ లక్ష్మీధర్మ ఆధ్వర్యంలో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. జనగామ ఆర్టీసీ డిపో గేటు ఎదుట ఉద్యోగులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులకు సీఎం కేసీఆర్ వరాలివ్వడమే కాకుండా వాటిని సత్వరమే అమలు చేయడం హర్షణీయమని జనగామ డిపో మేనేజర్ ధరంసింగ్ పేర్కొన్నారు. డిపోను రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థాయిలో ఉంచేలా పనిచేస్తామని ఉద్యోగులు తెలిపారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, కోరుట్ల ఆర్టీసీ డిపోల్లో డిపో మేనేజర్లు అప్పారావు, విజయ్ రావు ఆధ్వర్యంలో ఉద్యోగులు గురువారం సంబురాలు జరుపుకొన్నారు. ఉద్యోగుల శ్రేయస్సు కోరే సీఎం ఉండటం తమ అదృష్టమని ఉద్యోగులు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, మధిర, వైరా ఆర్టీసీ డిపోల్లో ఉద్యోగులు సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. 'జయహో కేసీఆర్, మన ప్రభుత్వం- మన సంస్థ' అంటూ నినాదాలు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రం తోపాటు మణుగూరులో ఆర్టీసీ ఉద్యోగులు సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నిర్మల్ జిల్లాలోని నిర్మల్, భైంసా డిపోల వద్ద ఉద్యోగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం ఎవరూ ఊహించనంతగా వరాలను ఇస్తూ సీఎం కేసీఆర్ ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని కొనియాడారు.



మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం పొలంపల్లిలో మాట్లాడుతున్న మంత్రి ఈటల. చిత్రంలో ఎంపీ బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు సోలిపేట, పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు

## దేశానికే స్ఫూర్తి తెలంగాణ ఉద్యమం

### మంత్రి ఈటల రాజేందర్

**చేగుంట/చిన్నశంకరంపేట:** తెలంగాణ బిడ్డలు ఆత్మగౌరవం కోసం పోరాడుతారని.. స్వరాష్ట్ర ఉద్యమంతో దేశానికే స్ఫూర్తిగా నిలిచారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కామ్రేడ్ కేవల్ కిషన్ 59వ వర్ధంతి సందర్భంగా మెదక్ జిల్లా చేగుంట మండలం పొలంపల్లి చౌరస్తాలో రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు సోలిపేట రామలింగారెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డితో కలిసి ఆయన సమాధి వద్ద మంత్రి నివాళులర్పించారు. అనంతరం మంత్రి ఈటల మాట్లాడుతూ.. ప్రజల కోసం పరితపించే నాయకులను ప్రజలు ఎల్లవేళలా గుర్తుంచుకుంటారన్నారు. 59 ఏండ్లుగా కేవల్ కిషన్ జాతరను నిర్వహించడం ఆయన త్యాగాలకు నిదర్శనమన్నారు.

## కరీంనగర్ నగరాభివృద్ధికి ప్రత్యేక కృషి

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ :** కరీంనగర్ నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టి పారిశ్రామికంగా, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మెతుకు సత్యం గురువారం మంత్రి గంగుల సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా తమ పార్టీ పని చేస్తున్నదన్నారు. తమ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులు చూసి వ్యాపారులు, కుల సంఘాల నాయకులు టీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో దిశ నిందితుడి తండ్రికి గాయాలు

**నారాయణపేటప్రతినిధి, నమస్తేతెలంగాణ:** దిశ హత్యాచార ఘటనలో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన చెన్నకేశవులు తండ్రి నర్సయ్య గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బైక్‌పై నారాయణపేట జిల్లా జక్లేర్ గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామమైన గుడిగండ్లకు వస్తుండగా మక్తల్ వద్ద కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. నర్సయ్యను మక్తల్ దవాఖానకు.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించారు. మక్తల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

**నవీపేట:** నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం యంచ గ్రామ శివారులో జరిగిన రైలు ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడు దుర్మరణం చెందాడు. మృతుడు ఎర్రటి టీ షర్టు, నీలం కలర్ ప్యాంట్ ధరించి, గడ్డం కలిగి ఉన్నాడు. మృతదేహం వద్ద చిరునామా ఇతరత్రా ఆధారాలేమీ లభించలేదని రైల్వే ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. వీఆర్వో ఫిర్యాదుతో మృతదేహానికి పంచనామా నిర్వహించి నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.



మిషన్ భగీరథ సంప్‌హౌస్‌ను సందర్శించిన గ్రూప్-2 ట్రైనీ అధికారుల బృందం

## తెలంగాణలో అభివృద్ధి భేష్

### ట్రైనీ గ్రూప్-2 అధికారుల ప్రశంస

**గజ్వేల్ రూరల్ :** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు బాగున్నాయని ట్రైనీ గ్రూప్-2 అధికారులు కొనియాడారు. గురువారం వారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోమటిబండ గుట్టపై ఉన్న మిషన్ భగీరథ సంప్‌హౌస్, నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్‌ను సందర్శించారు. మిషన్ భగీరథ డీఈఈ నాగార్జున.. మిషన్ భగీరథ ప్రాజెక్టు గురించి వారికి వివరించారు. గోదావరి నుంచి కోమటిబండ సంప్‌హౌస్‌కు నీటి సేకరణ, శుద్ధీకరణ, సంప్‌హౌస్ నుంచి నీటి సరఫరా చేసే ప్రక్రియ, తక్కువ ఖర్చుతో తాగునీటిని అందిస్తున్న విషయాలను క్షుణ్ణం గా వివరించారు. అలాగే, ఇబ్రహీంపూర్ గ్రామాన్ని ఎంపీడీవో మురళీధర్‌శర్మ నేతృత్వంలో సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఇంకుడు గుంతలు, డంపింగ్‌యార్డు, సామూహిక గొర్రెల షెడ్లు, పందిరిసాగు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం, మోడల్ వైకుంఠ ధామంను సందర్శించారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు, కోమటిబండ అటవీ ప్రాంతాన్ని చూసి రాష్ట్రం చేపట్టిన అభివృద్ధి పథకాలపై పూర్తి అవగాహన కలిగిందని గ్రూప్-2 ట్రైనీ అసిస్టెంట్ సెక్షన్ అధికారులు తెలిపారు.

# ఎస్సారార్ @ 24 టీఎంసీలు

- కొనసాగుతున్న ఎత్తిపోతలు
- సరస్వతి బరాజ్‌లో 7.01 టీఎంసీల నీరు నిల్వ

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:**

కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లోని నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో గోదావరి జలాల ఎత్తిపోతలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఎల్లంపల్లి జలాశయం నుంచి జంట సొరంగాల ద్వారా వస్తున్న నీటిని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నందిపంప్‌హౌస్‌లో 3, 4, 5వ మోటర్లు ఎత్తిపోస్తుండగా, నంది రిజర్వాయర్‌కు జలాలు చేరుతున్నాయి. జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని గాయత్రి పంప్‌హౌస్‌కు చేరుకుంటున్నాయి. ఇక్కడ 1,2,7వ పంపులు నీటిని ఎత్తిపోస్తుండగా గ్రావిటీ, వరద కాల్వల ద్వారా శ్రీరాజరాజేశ్వర జలాశయం వైపు పరుగులు తీస్తున్నాయి. ఈ నెల 5 నుంచి గురువారం సాయంత్రం ఆరు గంటల వరకు 13.910 టీఎంసీల నీటిని ఎస్సారార్‌కు తరలించినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంపుహౌస్ నుంచి గ్రావిటీ కాల్వలో తరలుతున్న జలాలు

✦ ఎస్సారార్ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 25.873 టీఎంసీలు కాగా ప్రస్తుతం 24.167 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. బుధవారం ఉదయం పది గంటల నుంచి దిగువన ఉన్న ఎల్‌ఎండీకి నీటి విడుదలను నిలిపివేశారు. వరద కాల్వ ద్వారా కూడా 10,879 క్యూసెక్కుల నీరు వస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

✦ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మి పంప్‌హౌస్‌లో గురువారం రెండు మోటర్ల ద్వారా సరస్వతి బరాజ్‌కు 4,600 క్యూసెక్కుల నీటిని తరలించారు. సరస్వతి బరాజ్‌లో ప్రస్తుతం 7.01 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఇంజినీర్లు తెలిపారు.

## నాగులపల్లిలో గుడ్డేలుగు కలకలం

**పెద్దేముల్:** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలోని నాగులపల్లి గ్రామ శివారులో గురువారం గుడ్డేలుగు సంచారం కలకలం రేపింది. నాగులపల్లికి చెందిన రైతు హనుమంతుకు తన పొలం సమీపంలో ఎలుగుబంటి కన్పించడంతో స్థానికులకు సమాచారమిచ్చాడు. దీంతో రైతులు, కూలీలు అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులు ఫోన్ ద్వారా అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారుల బృందంతో శుక్రవారం ఎలుగుబంటి సంచరించిన ప్రాంతానికి వెళ్లి ఆనవాళ్లను పరిశీలిస్తామని నాగులపల్లి ఫారెస్టు బీట్ ఆఫీసర్ మల్లయ్య తెలిపారు.



పెద్దేముల్ మండలం నాగులపల్లి శివారు పంట పొలాల్లో సంచరిస్తున్న గుడ్డేలుగు

## ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

### యువకుడు మృతి

**పూడూరు:** ప్రేమజంట ఆత్మహత్యాయత్నం చేసుకున్నది. ఇందులో యువకుడు మరణించగా బాలికకు ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చన్గోముల్‌కు చెందిన మహేశ్(25) డిగ్రీ చదివి ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన బాలిక, మహేశ్ ప్రేమించుకున్నారు. అమ్మాయి కేజీబీవీలో పదోతరగతి చదువుతున్నది. గత రెండు రోజులుగా సెలవులు ఉండటంతో గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో మహేశ్.. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి వచ్చి సదరు అమ్మాయి తన సోదరి అని, తనతో పంపాలని వార్డెన్‌కు ఫోన్ చేశాడు. వార్డెన్ అంగీకరించడంతో మహేశ్ ఆ బాలికను తన వెంట తీసుకెళ్లాడు. పాఠశాల సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో సాయంత్రం వరకు ఉన్నారు. అనంతరం పొలంలోని ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించారు. మహేశ్ మృతి చెందగా, బాలిక స్వల్ప గాయంతో బయటపడింది. ఈ క్రమంలో ఆమె తన అన్నకు ఫోన్‌చేసి విషయం చెప్పింది. అతను ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాడు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు ఎస్సై భీమ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని మహేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా బాలిక వికారాబాద్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నది. మహేశ్ మృతి విషయంలో తమకు అనుమానాలు ఉన్నాయంటూ అతని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈ బాలిక ప్రేమ వ్యవహారంలోనే ఏడాది క్రితం మహేశ్ మూడు నెలలు జైలుకు వెళ్లివచ్చినట్టు ఎస్సై తెలిపారు.

## జువైనల్ హోంలో బాలుడిపై దాడి

**పోచమ్మమైదాన్ (వరంగల్ అర్బన్):** వరంగల్ ఆటోనగర్‌లోని జువైనల్ హోంలో అక్కడి సూపర్‌వైజర్ కనకసేనారెడ్డి పదిహేనేండ్ల బాలుడిని చితకబాదిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఖమ్మం జిల్లా కొత్తగూడెంకు చెందిన ఓ బాలుడిని ఓ కేసులో ఖమ్మం జువైనల్ కోర్టు నుంచి రిమాండ్‌పై వరంగల్ జువైనల్ హోంకు మూడు నెలల క్రితం తీసుకొచ్చారు. రిమాండ్‌లో ఉన్న సదరు బాలుడు ఐదు రోజుల క్రితం ఇక్కడి పిల్లలతో ఘర్షణ పడిన నేపథ్యంలో సూపర్‌వైజర్ కనకసేనారెడ్డి జోక్యం చేసుకుని, అతడిని మందలిస్తూ తీవ్రంగా కొట్టినట్టు సమాచారం. బాలుడు తీవ్రంగా గాయపడటంతో ఎంజీఎం దవాఖానలో చికిత్స చేయించి, మెడికల్ లీగల్ కేసు కూడా నమోదు చేయించినట్టు తెలిసింది. సమాచారం తెలుసుకున్న జువైనల్ జస్టిస్ బోర్డు మెజిస్ట్రేట్ స్వర్ణలత గురువారం సాయంత్రం జువైనల్ హోంను సందర్శించి, విచారణ జరిపారు. వీరివెంట చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ మండల పరశురాములు, సూపరింటెండెంట్ మంజుల ఉన్నారు.



భర్త ఇంటి ఎదుట ఇద్దరు పిల్లలతో బైఠాయించిన భార్య ఆయేషా

## మరో యువతిని పెండ్లి చేసుకున్నాడని..

### భర్త ఇంటి ఎదుట భార్య ధర్నా

**కోదాడ రూరల్:** తన భర్త మరో యువతిని వివాహం చేసుకున్నాడంటూ ఓ వివాహిత తన ఇద్దరు చిన్నారులతో భర్త ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధి తమ్మరలో గురువారం చోటుచేసుకున్నది. స్థానికులు, బాధితురాలి కథనం ప్రకారం.. తమ్మర గ్రామానికి చెందిన ఆయేషాతో అదే గ్రామానికి చెందిన ఎస్‌కే మజీద్‌కు 2016లో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మొదటి నుంచి భర్తతోపాటు అత్తింటి వారు వేధిస్తున్నారంటూ ఆయేషా గతంలో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు కోర్టులో ఉన్నది. ఇదిలావుండగా కరీంనగర్ జిల్లా గోదావరిఖనికి చెందిన మరో యువతిని 15 రోజుల క్రితం వివాహం చేసుకున్నాడంటూ ఆయేషా పురుగుల మందు డబ్బాతో గురువారం అత్తగారింటి ఎదుట బైఠాయించారు. తనకు న్యాయం చేయాలంటూ బంధువులతో కలిసి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మజీద్ పిలిపించి మాట్లాడుతానని టౌన్ సీఐ హామీ ఇవ్వడంతో ఆమె వెనుదిరిగారు.

## రోట్లో నిలబడిన రోకలి !

**దండేపల్లి :** సూర్యగ్రహణం వేళ మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో ఏ ఆధారం లేకుండా నిలబెట్టిన రోకలిని చూసి పలువురు ఆశ్చర్యపోయారు. సూర్య గ్రహణం సందర్భంగా రోట్లో రోకళ్లు ఏ ఆధారం లేకుండా నిలబడతాయని పూర్వీకులు చెప్పడంతో వాటిని ప్రయోగపూర్వకంగా చేసి చూశారు. దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామంలో ఏ సపోర్ట్ లేకుండా రోకలి ఇలా నిటారుగా నిలబడడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేసింది. గ్రహణం వీడిన తర్వాత రోట్లో ఉన్న రోకలి ఒక్కసారిగా కింద పడిపోయింది. గ్రహణం ప్రభావంతో సూర్య భగవానుడి శక్తితో రోకల్లు ఇలా నిలబడుతాయని స్థానికులు చెబుతున్నారు.



రోట్లో నిలబడిన రోకలి

## చలికాలం

| జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| వికారాబాద్ | 15.6 | 33.2 |
| నిర్మల్ | 16.0 | 25.0 |
| వరంగల్ రూరల్ | 16.0 | 26.0 |
| నల్లగొండ | 16.4 | 30.0 |
| యాదాద్రి భువనగిరి | 17.0 | 28.0 |
| వనపర్తి | 17.3 | 33.1 |
| సంగారెడ్డి | 17.4 | 33.3 |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 18.0 | 25.0 |
| జగిత్యాల | 18.0 | 27.0 |
| కామారెడ్డి | 18.0 | 27.0 |
| రంగారెడ్డి | 18.0 | 28.0 |
| మెదక్ | 18.0 | 30.6 |
| సిద్దిపేట | 18.1 | 30.8 |
| ములుగు | 19.0 | 27.0 |
| జనగామ | 19.0 | 27.0 |
| వరంగల్ అర్బన్ | 19.0 | 27.0 |
| మహబూబాబాద్ | 19.0 | 28.0 |
| రాజన్న సిరిసిల్ల | 19.0 | 28.0 |
| సూర్యాపేట | 19.0 | 29.0 |
| నాగర్‌కర్నూల్ | 19.0 | 30.0 |
| కరీంనగర్ | 19.2 | 30.9 |
| పెద్దపల్లి | 20.0 | 27.0 |
| జయశంకర్ భూపాలపల్లి | 20.0 | 29.0 |
| భద్రాద్రి కొత్తగూడెం | 20.0 | 30.0 |
| మంచిర్యాల | 20.2 | 33.1 |
| మహబూబ్‌నగర్ | 20.5 | 30.0 |
| నారాయణపేట | 20.5 | 30.0 |
| హైదరాబాద్ | 20.6 | 28.2 |
| మేడ్చల్ | 20.6 | 28.2 |
| ఆదిలాబాద్ | 20.7 | 29.8 |
| ఖమ్మం | 21.0 | 31.0 |
| జోగులాంబ గద్వాల | 21.3 | 32.1 |
| నిజామాబాద్ | 21.5 | 30.4 |

# విజ్డన్ జాబితాలో విరాట్



**లండన్:** మైదానంలో రికార్డులు తిరగరాయడంలో ముందు వరుసలో నిలిచే టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ.. గ్రౌండ్ బయట అవార్డుల్లోనూ అదే జోరు కొనసాగిస్తున్నాడు. ఇటీవలే క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించిన టెస్టు, జట్టుకు సారథిగా ఎన్నికవడంతో పాటు, విజ్డన్ క్రికెట్ జట్టులోనూ చోటు దక్కించుకున్న కోహ్లీ.. తాజాగా ఈ దశాబ్దపు అత్యుత్తమ ప్రతిభా పాటవాలు కలిగిన క్రికెటర్‌గా విజ్డన్ క్రికెటర్స్ అల్మానిక్‌లో స్థానం పదిలం చేసుకున్నాడు. పదేండ్ల ప్రదర్శనలను పరిశీలించిన అనంతరం విజ్డన్.. ఐదుగురు అత్యుత్తమ ప్లేయర్ల పేర్లను ప్రకటించింది. ఇందులో విరాట్‌తో పాటు దక్షిణాఫ్రికా స్టార్లు ఏబీ డివిలియర్స్, స్టెయిన్, ఆసీస్ మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్, మహిళా క్రికెటర్ ఎలీసా పెర్రీ ఉన్నారు. 'అతడో క్రికెట్ మేధావి. ఇంగ్లండ్ పర్యటన (2014) తర్వాతి నుంచి ఇటీవలి బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ వరకూ సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడు 63 సగటుతో పరుగులు రాబట్టాడు. అందులో 21 సెంచరీలు, 13 అర్ధసెంచరీలు ఉన్నాయి. అరుదైన గణాంకాలను నమోదు చేయడంతో పాటు అన్ని ఫార్మాట్‌లలో 50కి పైగా సగటు కలిగిన ఏకైక బ్యాట్స్‌మన్ అతడే. ఈ అంశంలో స్మిత్ ఒక్కడే కోహ్లీకి కాస్త సమీపంలో ఉన్నాడు. సచిన్ రిటైర్మెంట్ తర్వాత కోహ్లీలా మరే క్రికెటర్ ఇంత ఒత్తిడిని ఎదుర్కోలేదు'అని విజ్డన్ పేర్కొంది. గత పదేండ్లలో విరాట్ టెస్టుల్లో 7,202, వన్డేల్లో 11,125, టీ20ల్లో 2,633 పరుగులు చేశాడు. మూడు ఫార్మాట్‌లలో కలిపి ఇప్పటి వరకు 70 సెంచరీలు బాదిన విరాట్ జాబితాలో రెండో స్థానంలో ఉన్న పాంటింగ్ (71)కు కేవలం అడుగు దూరంలో నిలిచాడు. సచిన్ (100) అగ్రస్థానంలో ఉన్నాడు.

# దాదా, ద్రవిడ్ భేటీ



**ముంబై:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ, జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) హెడ్ రాహుల్ ద్రవిడ్ గురువారం భేటీ అయ్యారు. ఎన్‌సీఏ విధివిధానాల విషయంలో వీరిద్దరి మధ్య సుదీర్ఘ చర్చ సాగినట్లు సమాచారం. టీమ్‌ఇండియా ఏస్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు ఫిట్‌నెస్ టెస్టు నిర్వహించేందుకు ఎన్‌సీఏ నిరాకరించిన నేపథ్యంలో ఈ భేటీ ప్రాముఖ్యం సంతరించుకుంది. బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో దాదాపు ఐదు గంటల చర్చ అనంతరం ద్రవిడ్ మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోగా.. గంగూలీ మాత్రం ఇది సాధారణ సమావేశమే అని అన్నాడు. కొత్త సెలెక్షన్ కమిటీ ఎంపిక విషయంలో ఏర్పాటు చేయనున్న క్రికెట్ సలహాదారుల కమిటీ (సీఏసీ) అంశం కూడా ఇందులో చర్చకు వచ్చినట్లు సమాచారం.

# తిలక్, దివ్యాన్ష్ మెరుపులు

**దక్షిణాఫ్రికాపై భారత అండర్-19 జట్టు విజయం**



తిలక్ (59)

**ఈస్ట్ లండన్ (దక్షిణాఫ్రికా):** ప్రపంచకప్ వేటకు బయలుదేరిన యువ భారత జట్టు.. విజయంతో పర్యటనను ప్రారంభించింది. తెలంగాణ వర్ధమాన ఆటగాడు నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ (59; 9 ఫోర్లు), దివ్యాన్ష్ సక్సేనా (86 నాటౌట్; 11 ఫోర్లు) అర్ధశతకాలతో చెలరేగడంతో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి అనధికారిక వన్డేలో భారత అండర్-19 జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఫలితంగా మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. గురువారం ఇక్కడ జరిగిన తొలి వన్డేలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా 48.3 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌటైంది. బ్యూఫోర్ట్ (64) అర్ధశతకం సాధించాడు. భారత బౌలర్లలో రవి బిష్ణోయ్ 3, కార్తీక్, అంకొలేకర్, శుభాంగ్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనలో ఓపెనర్లు దివ్యాన్ష్, తిలక్ వర్మతో పాటు కుషాగ్ర (43 నాటౌట్; 6 ఫోర్లు) రాణించడంతో యువ భారత్ 42.3 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 190 పరుగులు చేసింది.

# డ్రెస్సింగ్ రూమ్‌లో సెలెక్టర్

**భగ్గుమన్న ఆటగాళ్లు.. బయటకు పంపిన అధికారులు**



దేవాంగ్

**కోల్‌కతా:** జాతీయ సెలెక్షన్ కమిటీ సభ్యుడు దేవాంగ్ గాంధీ అనుమతి లేకుండా రంజీ ఆటగాళ్ల డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లడం సరికొత్త వివాదానికి దారితీసింది. ఈడెన్ గార్డెన్ వేదికగా ఆంధ్ర-బెంగాల్ మధ్య జరుగుతున్న రంజీ మ్యాచ్ రెండో రోజు వెలుతురులేమి కారణంగా మ్యాచ్ నిలిచి ఉన్న సమయంలో దేవాంగ్.. బెంగాల్ క్రికెటర్ల డ్రెస్సింగ్ రూమ్‌లోకి ప్రవేశించాడు. దీనిపై బెంగాల్ మాజీ కెప్టెన్ మనోజ్ తివారీ ఆగ్రహం వ్యక్తంచేశాడు. దీంతో బీసీసీఐ అవినీతి నిరోధక అధికారి సౌమెన్ కర్మాకర్.. గాంధీని బయటకు పంపించాడు. 'నేను నిబంధనలను అతిక్రమించలేదు. వెన్ను నొప్పితో బాధపడుతుండటంతో ఫిజియో సహాయం తీసుకునేందుకు మెడికల్ రూమ్‌కు రావాల్సిందిగా బెంగాల్ కోచ్ అరుణ్ లాల్ ఆహ్వానించారు' అని దేవాంగ్ పేర్కొన్నాడు.

రౌండప్ 2019

# అథ్లెటిక్స్‌లో అదే తీరు!



ద్యుతి



హిమదాస్



దీప్తి

**2019లోనూ భారత అథ్లెటిక్స్ పరిస్థితి ఏ మాత్రం మారలేదు. అంతర్జాతీయ టోర్నీల్లో మన అథ్లెట్ల ప్రదర్శన అంతంత మాత్రంగానే సాగింది. అయితే ద్యుతీ చంద్ ఓ టోర్నీలో స్వర్ణం సాధించడం, హిమదాస్ వరుస పతకాలతో అదరగొట్టడం హైలెట్‌గా నిలిచింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ రెండు బెర్తులను ఖరారు చేసుకోవడం కాస్త ఊరట కలిగించే అంశం. భవిష్యత్తుపై భరోసా కల్పిస్తూ తెలంగాణ నుంచి దీప్తి, మహేశ్వరి, నందిని, తరుణ్, యుగంధర్ లాంటి యువ అథ్లెట్లు దూసుకొస్తున్నారు. బరిలోకి దిగిన దాదాపు ప్రతి ఈవెంటులో పతకాలతో సత్తాచాటుతూ రాష్ట్ర ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేస్తున్నారు. ఇలాంటి కొన్ని విజయాలు కాస్త ఆనందాన్ని కలిగించినా.. డోపింగ్ కలకలం, అథ్లెట్ల వయసుకు సంబంధించి అవకతవకలు అంతకుమించిన ఆందోళనను రేకెత్తించాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది భారత అథ్లెట్ల ప్రదర్శన, వివాదాలపై ప్రత్యేక కథనం...**

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

భారత అథ్లెటిక్స్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే విజయాలు లేకుండానే మరో ఏడాది ముగిసిపోయింది. ప్రపంచ యూనివర్సిటీ గేమ్స్‌లో మహిళా స్ప్రింటర్ ద్యుతీ చంద్ స్వర్ణం, ఓ మోస్తరు టోర్నీల్లో యువ కెరటం హిమదాస్ అద్భుత ప్రదర్శన మినహాయిస్తే ఎలాంటి అద్భుతాలు జరుగలేదు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఎప్పటిలాగే రిక్తహస్తాలతో మన అథ్లెట్లు స్వదేశానికి తిరిగిరాగా.. రెండు టోక్యో ఒలింపిక్స్ బెర్తులు ఖరారు కావడం కాస్త సంతోషించాల్సిన విషయం. మరోవైపు వివాదాలు సైతం అథ్లెటిక్స్‌ను ఈ ఏడాది చుట్టుముట్టాయి. డోపింగ్ టెస్టుల్లో విఫలమైన అథ్లెట్ల సంఖ్య పెరుగడం, జాతీయ టోర్నీల్లో అథ్లెట్ల వయసుకు సంబంధించిన అవకతవకలు కలకలం రేపాయి. ఇక పరిపాలనపరంగా ప్రపంచ అథెటిక్స్ కౌన్సిల్ సభ్యుడిగా భారత అథ్లెటిక్స్ సమాఖ్య అధ్యక్షుడు అదిల్ సుమరివల్లా రెండోసారి ఎంపిక కాగా, ఏఎఫ్‌ఐ టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా తెలంగాణకు చెందిన బీఈ స్టాన్లీ జోన్స్‌కు అవకాశం దక్కింది.

### ద్యుతి.. ఓ స్వర్ణం.. ఓ వివాదం

భారత అగ్రశ్రేణి మహిళా స్ప్రింటర్ ద్యుతి చంద్ ఈ ఏడాది చరిత్ర సృష్టించింది. జూలైలో జరిగిన ప్రపంచ యూనివర్సిటీ గేమ్స్ 100 మీటర్ల పరుగులో స్వర్ణపతకం కైవసం చేసుకొని, ఈ ఘనత సాధించిన తొలి భారత అథ్లెట్‌గా నిలిచింది. అయితే ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో కాంస్యంతోనే సరిపెట్టుకొని నిరాశపరిచింది. ఇక ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫైనల్ చేరకుండా నిరాశపరిచింది. ఇదంతా ఓ ఎత్తయితే.. తాను మరో మహిళతో సహజీవనం చేస్తున్నానని ఆమె ప్రకటించడం తీవ్ర వివాదాస్పదమైంది.

### హిమదాస్ స్వర్ణ మెరుపులు

ప్రపంచ జూనియర్ చాంపియన్, భారత యువ స్టార్ స్ప్రింటర్ హిమదాస్ ఈ ఏడాది అదరగొట్టే ప్రదర్శనలు చేసింది. జూలై - ఆగస్టు మధ్య చెక్ రిపబ్లిక్, పోలండ్‌లో జరిగిన స్థానిక టోర్నీల్లో ఆరు స్వర్ణ పతకాలు సాధించి సత్తాచాటింది. 200, 300, 400 మీటర్ల పరుగు పోటీలకు బరిలోకి దిగిన 'ధింగ్ ఎక్స్‌ప్రెస్' హిమ తన రికార్డులను సైతం మెరుగుపరుచుకుంది. ప్రపంచ చాంపియన్‌షిప్ 400 మీటర్ల పోటీకి ఎంపికైనా గాయం కారణంగా హిమను భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్‌ఐ) చివరి నిమిషంలో తప్పించింది.

### మళ్లీ రిక్తహస్తాలే..

ఈ ఏడాది సెప్టెంబర్ - అక్టోబర్ మధ్య దోహాలో జరిగిన అథ్లెటిక్స్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లకు ఒక్క పతకం కూడా దక్కలేదు. 27 మంది అథ్లెట్లు పోటీలోకి దిగినా ఆశించిన ఫలితాలు రాలేదు. అయితే, మిక్స్‌డ్ 4x400 రిలే విభాగంలో మన జట్టు, పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో అవినాశ్ సేబల్, మహిళల జావెలిన్‌త్రో అన్నూ రాణి ఫైనల్ చేరగలిగారు. పతకం సాధించలేకున్నా సేబల్, మిక్స్‌డ్ 4x400 మీటర్ల రిలేలో మహమ్మద్ అనస్, విస్మయ, జిస్నా మాథ్యూ, నిర్మల్ టామ్‌తో కూడిన జట్టు 2020 టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం కాస్త సంతోషించాల్సిన విషయం.



పద్మశ్రీ

### అయ్యో.. నీరజ్

2018 కామన్వెల్త్ గేమ్స్, ఆసియా గేమ్స్‌లో స్వర్ణ పతకాలతో వెలుగొందిన స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు ఈ ఏడాదిలో గాయం శరాఘాతంగా మారింది. పటియాలాలో ప్రాక్టీస్ చేస్తూ ఈ ఏడాది మొదట్లోనే గాయపడిన అతడు.. ఆ తర్వాత కుడి మోచేతికి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. దీంతో ఈ ఏడాది ఆసియా సహా ప్రపంచ చాంపియన్‌షిప్ టోర్నీలకు దూరమయ్యాడు.

### ఆసియాలో 17పతకాలు

ఏప్రిల్‌లో దోహాలో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు ఫర్వాలేదనిపించారు. మొత్తంగా 17 పతకాలు సాధించారు. పురుషుల షాట్‌పుట్‌లో తేజిందర్‌పాల్‌సింగ్ తూర్, మహిళల 800 మీటర్ల పోటీలో గోమతి మరిముత్తు, మహిళల 1500 మీటర్ల రేస్‌లో పీయూ చిత్ర స్వర్ణ పతకాలతో మెరిశారు.

### డోపింగ్ దుమారం

భారత అథ్లెటిక్స్‌లో డోపింగ్ కలకలం మునుపెన్నడూ లేని విధంగా తీవ్రమైంది. ఈ ఏడాది అథెట్లపై దాదాపు 20 డోపింగ్ కేసులు నమోదయ్యాయి. ఆసియన్ చాంపియన్‌షిప్ 800 మీటర్ల మహిళల పరుగు పందెంలో స్వర్ణం సాధించిన భారత స్ప్రింటర్ గోమతి మరిముత్తు డోపింగ్ పరీక్షల్లో విఫలమైంది. నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్నట్టు తేలడంపై ఆమెపై నిషేధం వేటు పడింది. అదే టోర్నీలో కాంస్యం సాధించిన సంజీవనీ జాదవ్ కూడా డోపింగ్ పరీక్షల్లో విఫలమై ప్రాథమిక నిషేధంలో కొనసాగుతున్నది. నాలుగుసార్లు డోపింగ్ పరీక్షల్లో ఫెయిలైన షాట్‌పుటర్ మన్‌ప్రీత్ కౌర్ ఏకంగా నాలుగేండ్ల నిషేధానికి గురైంది. ఈ ఏడాది జరిగిన జాతీయ అంతర్ రాష్ట్ర జూనియర్ మీట్, జాతీయ జూనియర్ చాంపియన్‌షిప్‌లో మొత్తం 100 మందికి పైగా అథ్లెట్లు వయసుకు సంబంధించిన తప్పుడు వివరాలను అందించినట్టు తేలడం కలకలం రేపింది.



తెలంగాణ అథ్లెట్లలో అద్భుత ప్రతిభ దాగున్నది. వెన్నుతట్టి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టించగల సత్తా వారి సొంతం. పేదరికాన్ని లెక్కచేయకుండా పరుగును ప్రాణంగా ప్రేమిస్తూ వీరంతా పతకాలు కొల్లగొడుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి లో పోటీకి దిగిన ప్రతి టోర్నీలో తెలంగాణ ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారు. ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు సాధించేందుకు సిద్ధంగా ఉన్నారు.

\- నాగపురి రమేశ్

## మనోళ్లు దూసుకొస్తున్నారు

అంతర్జాతీయ యవనికపై సత్తాచాటేందుకు తెలంగాణ అథ్లెట్లు దూసుకొస్తున్నారు. గతానికి భిన్నంగా అథ్లెటిక్స్‌ను కెరీర్‌గా మలుచుకుంటూ టోర్నీ టోర్నీకి మరింత మెరుగవుతున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుంటూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్నారు. 'ద్రోణాచార్య' నాగపురి రమేశ్ శిక్షణలో రోజురోజుకు రాటుదేలుతున్నారు. జీవాంజి దీప్తి, నందిని, పద్మశ్రీ, మహేశ్వరి, తరుణ్, యుగంధర్ లాంటి అథ్లెట్లు రాష్ట్రం తరుపున పతకాల పంట పండిస్తున్నారు. పేదరికాన్ని లెక్కచేయకుండా అద్భుత ప్రతిభతో ఆకట్టుకుంటున్నారు. వరంగల్ జిల్లా కల్లెడకు చెందిన దీప్తి చిరుతను తలపిస్తున్నది. కొన్నేండ్ల క్రితం ఒక రాష్ట్ర స్థాయి టోర్నీలో దీప్తి ప్రదర్శనను గుర్తించిన కోచ్ రమేశ్ ఆమె ఆటకు మరిన్ని మెరుగులు అద్దాడు. దీంతో 2017 నుంచి బరిలోకి దిగిన ప్రతి జూనియర్ కేటగిరీ టోర్నీలో ఈ టీనేజ్ స్ప్రింట్ సంచలనం తనదైన హవా కొనసాగిస్తున్నది. ఇటీవల పటియాల (పంజాబ్)లో జరిగిన 65వ జాతీయస్థాయి పాఠశాల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 100 మీటర్ల స్ప్రింట్‌లో స్వర్ణ పతకంతో మెరిసింది. ఈయేడాది హాంకాంగ్‌లో జరిగిన ఆసియా యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ వ్యక్తిగత 200 మీటర్ల విభాగంలో కాంస్యం సాధించిన దీప్తి.. మెడ్లె రిలేలో రజతాన్ని సొంతం చేసుకుంది. వచ్చే ఏడాది జనవరిలో గువాహటిలో జరిగే ఖేలోఇండియా గేమ్స్‌లో రాష్ట్రం తరపున పోటీపడి పతకం సాధిస్తానని ఈ 16 ఏండ్లయువ అథ్లెట్ ఆత్మవిశ్వాసంతో చెబుతున్నది. మిగతా అథ్లెట్ల విషయానికొస్తే.. పాలమూరుకు చెందిన మహేశ్వరి.. ఇటీవల తమిళనాడులో జరిగిన టోర్నీలో 3000 మీటర్ల స్టీపుల్ చేజ్‌లో పసిడి పతకంతో సరికొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది. పేద కుటుంబం నుంచి వచ్చిన మహేశ్వరి భవిష్యత్తులోనూ పతకాలు సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నది. మంగళూరులో జరిగిన సౌత్‌జోన్ జూనియర్ ఫెడరేషన్ కప్ అండర్-18 విభాగంలో నందిని స్వర్ణంతో జాతీయ రికార్డు నెలకొల్పింది. జాతీయ స్కూల్ గేమ్స్ 400మీటర్ల హార్డిల్స్‌లో పద్మశ్రీకి స్వర్ణం దక్కగా, జాతీయ జూనియర్ అంతర్ జిల్లాల టోర్నీలో కరీంనగర్‌కు చెందిన తరుణ్ పసిడి పతకంతో మెరిశాడు. వనపర్తి కుర్రాడు యుగంధర్.. సౌత్‌జోన్ పెంటాథ్లాన్‌లో రజతం, జూనియర్ నేషనల్స్‌లో కాంస్యం సాధించాడు. సాయ్ గోపీచంద్ మైత్రీ అథ్లెటిక్స్ ప్రాజెక్టులో భాగంగా వీరంతా అత్యుత్తమ శిక్షణ పొందుతూ అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.



మహేశ్వరి

# సుమిత్‌పై సస్పెన్షన్

**న్యూఢిల్లీ:** భారత బాక్సర్ సుమిత్ సాంగ్వాన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఆసియా క్రీడల్లో రజతం నెగ్గిన సాంగ్వాన్ (91 కేజీలు) జాతీయ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా) నిర్వహించిన టెస్టులో విఫలమవడంతో అతడిపై ఏడాది నిషేధం విధించారు. ఈ ఏడాది అక్టోబర్ 10న సుమిత్ నుంచి సేకరించిన నమూనాల్లో నిషేధిత ఉత్ప్రేరకాలు లభ్యం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాడా డీజీ నవీన్ అగర్వాల్ తెలిపారు. 'సుమిత్ సాంగ్వాన్‌పై ఏడాది నిషేధం విధించాం. సస్పెన్షన్ తక్షణమే అమల్లోకి వస్తుంది' అని నవీన్ పేర్కొన్నారు.



# భారీ షాట్లాడటం నేరమేం కాదు

**యువ ఆటగాళ్లకు రోహిత్ సూచన**

**ముంబై:** భారీ షాట్లు ఆడటం నేరమేమీ కాదని టీమ్‌ఇండియా ఓపెనర్ రోహిత్ శర్మ పేర్కొన్నాడు. ఎదుగుతున్న క్రమంలో షాట్ల ఎంపికలో పరిణతి ప్రదర్శించడం కంటే.. అంతిమ ఫలితమే ముఖ్యమని గురువారం సొంత అకాడమీలో యువ ఆటగాళ్లతో ముచ్చటించిన హిట్‌మ్యాన్ అభిప్రాయపడ్డాడు. 'భారీ షాట్లు ఆడటం ప్రమాదమేమీ కాదు. ఆటగాడిగా ఎదుగుతున్న క్రమంలో బంతిని గాల్లోకి లేపడం నేరం కానే కాదు. కాకపోతే నెట్స్‌లో అలాంటి షాట్లపై నియంత్రణ సాధించాలి. మీరు ఆడే భారీ షాట్ల కారణంగా మ్యాచ్ మీ వైపు మొగ్గు చూపితే సంతోషమే కదా. కానీ ఆ షాట్లకు ప్రయత్నిస్తూ పదే పదే మూల్యం చెల్లించుకోవడం మూర్ఖత్వం అవుతుంది. సెంచరీ చేసేందుకు 50 బంతులు తీసుకున్నారా.. రెండొందల బంతులు తీసుకున్నారా అనేది ముఖ్యం కాదు. ఎలా చేసినా శతకం శతకమే. దాని విలువ మారదు'అని రోహిత్ వివరించాడు. అండర్-19 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలో దిగనున్న భారత యువ జట్టు మరోసారి విజేతగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు.

# దక్షిణాఫ్రికా 277/9

**సెంచూరియన్:** వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ క్వింటన్ డికాక్ (95; 14 ఫోర్లు) ఆదుకోవడంతో ఇంగ్లండ్‌తో జరుగుతున్న మొదటి టెస్టులో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (20), జుబేర్ (39), డుప్లెసిస్ (29), ప్రిటోరియస్ (33)కు మంచి ఆరంభాలు లభించిన వాటిని భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. బాక్సింగ్ డే టెస్టులో టాస్ నెగ్గి ఫీల్డింగ్ ఎంచుకున్న కెప్టెన్ జో రూట్ నిర్ణయం సరైందేనని ఇంగ్లండ్ పేసర్లు నిరూపించారు. స్యామ్ కరన్ (4/57), స్టువర్ట్ బ్రాడ్ (3/52) ధాటికి సఫారీ జట్టు ఒక దశలో 97 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడినా.. డికాక్ ఎదురు నిలువడంతో ఈ మాత్రం స్కోరైనా చేయగలిగింది. ప్రస్తుతం ఫిలాండర్ (28), నోర్జ్ క్రీజులో ఉన్నారు.



డికాక్ (95)

# ఆస్ట్రేలియా 257/4

**న్యూజిలాండ్‌తో రెండో టెస్టు**

**మెల్‌బోర్న్:** ప్రతిష్ఠాత్మక బాక్సింగ్ డే టెస్టులో మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ (77 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్), లబుషేన్ (63) అర్ధశతకాలతో ఆకట్టుకోవడంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 257 పరుగులు చేసింది. మూడు దశాబ్దాల తర్వాత ఆసీస్‌తో బాక్సింగ్ డే టెస్టులో తలపడుతున్న న్యూజిలాండ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఆట ఆరంభంలో బర్న్స్ (0) వికెట్ పడగొట్టినా.. ఆ తర్వాత కివీస్ బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. డేవిడ్ వార్నర్ (41), మాథ్యూ వెడ్ (38) ఫర్వాలేదనిపించగా.. వరుస సెంచరీలతో జోరుమీదున్న స్మిత్ అజేయ అర్ధశతకంతో మరోసారి మెరిశాడు. ప్రస్తుతం స్మిత్‌తో పాటు హెడ్ (25) క్రీజులో ఉన్నాడు. కివీస్ బౌలర్లలో గ్రాండ్‌హోమ్‌కు 2 వికెట్లు దక్కాయి.

### కిక్కిరిసిన ఎంసీజీ

సంప్రదాయ క్రికెట్ ప్రభ తగ్గుతున్న తరుణాన ఈ మ్యాచ్‌కు భారీగా ప్రేక్షకులు తరలిరావడం నిర్వాహకులను ఆనందంలో ముంచెత్తింది. చాన్నాళ్ల తర్వాత ఈ రెండు జట్ల మధ్య బాక్సింగ్ డే టెస్టు జరుగుతుండటంతో గురువారం ఆట చూసేందుకు 80 వేల మందికి పైగా అభిమానులు ఎంసీజీకి పోటెత్తారు. ఈ రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కు ఇంత భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలిరావడం ఇదే తొలిసారి. నాన్ యాషెస్ బాక్సింగ్ డే టెస్టులో ఇది రెండో అత్యధికం కూడా. 1975లో ఆస్ట్రేలియా-వెస్టిండీస్ మధ్య జరిగిన మ్యాచ్‌ను 85,661 మంది ప్రత్యక్షంగా వీక్షించగా.. తాజా మ్యాచ్‌లో ఆ సంఖ్య 80,473గా నమోదైంది.



స్మిత్ (77*)

# గోవా గెలుపు

**చెన్నై:** గోల్స్ మోత మోగిన మ్యాచ్‌లో చెన్నైయిన్ ఎఫ్‌సీపై గోవా విజయం సాధించింది. ఐఎస్‌ఎల్ ఆరో సీజన్‌లో భాగంగా గురువారం ఇరుజట్ల మధ్య ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో గోవా ఎఫ్‌సీ 4-3తేడాతో గెలిచింది. గోవా తరపున అహ్మద్ (26వ ని.లో), బ్రాండెన్ (41వ ని.), హుగో (45+1వ ని.) కోరోమినాస్ (63వ ని.) గోల్స్ చేయగా.. చెన్నై తరపున అంద్రే చెంబ్రీ (57వ ని.), రఫెల్ క్రివెల్లారో (59వ, 90+1వ ని.) గోల్స్ చేశారు.

# హైదరాబాద్ 69 ఆలౌట్

**ఫాలోఆన్‌లోనూ 20/2**

**ఢిల్లీతో రంజీ మ్యాచ్**

**న్యూఢిల్లీ:** దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతున్నది. బ్యాట్స్‌మెన్ వైఫల్యం కారణంగా ఇప్పటికే ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓడిన మన జట్టు.. మరో పరాజయానికి చేరువైంది. ఎలైట్ గ్రూప్-ఏలో భాగంగా ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 69 పరుగులకే ఆలౌటైంది. వెటరన్ పేసర్ ఇషాంత్ శర్మ (4/19), సిమర్‌జీత్ (4/23) ధాటికి.. హిమాలయ్ అగర్వాల్ (14), సందీప్ (16), మిలింద్ (14) మినహా మిగిలినవాళ్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అనంతరం ఫాలోఆన్ ప్రారంభించిన హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లోనూ ఇదే తడబాటు కొనసాగించడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి 20/2తో నిలిచింది. చేతిలో మరో 8 వికెట్లు ఉన్న హైదరాబాద్ ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే ఇంకా 195 పరుగులు చేయాల్సి ఉంది. కెప్టెన్ తన్మయ్ (11), హిమాలయ్ (7) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోర్ 269/6తో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఢిల్లీ.. మరో 15 పరుగులకే మిగిలిన 4 వికెట్లు కోల్పోయి 284కు ఆలౌటైంది. ధవన్ (140; 19 ఫోర్లు, 2 సిక్సర్లు) క్రితం రోజు స్కోరుకు మూడు పరుగులే జోడించాడు. హైదరాబాద్ బౌలర్లలో రవి కిరణ్ 4, మెహదీ 3, సిరాజ్ 2 వికెట్లు పడగొట్టారు.

సెన్సెక్స్ 41,164 ↓297

నిఫ్టీ 12,126 ↓88

ముడి చమురు (బ్రెంట్) ↑ 67.83 డాలర్లు

## అలహాబాద్ బ్యాంక్‌కు రూ.2,153 కోట్లు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 26:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి అలహాబాద్ బ్యాంక్‌కు మరో రూ.2,153 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూలధన నిధి కింద ఇప్పటికే భారీ స్థాయిలో నిధులను కేటాయిస్తున్న కేంద్రం..తాజాగా మరో మూడు నెలల్లో రూ.2 వేల కోట్లకు పైగా నిధులను కేటాయించదానిపై ఆర్థిక మంత్రిత్వ శాఖ లేఖ రాసినట్లు బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది. మొండి బకాయిలు, నిధులు లేక సతమతమవుతున్న బ్యాంకులను ఆర్థికంగా ఆదుకోవడానికి కేంద్రం భారీ స్థాయిలో నిధులను కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ఆగస్టు 30న ఏడు ప్రభుత్వ బ్యాంకులకు రూ.55,250 కోట్ల నిధులను కేటాయిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నది. వీటిలో పీఎన్‌బీకి రూ.16 వేల కోట్లు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.11,700 కోట్లు, కెనరా బ్యాంక్‌కు రూ.6,500 కోట్లు, ఇండియన్ బ్యాంక్‌కు రూ.2,500 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడాకు రూ.7 వేల కోట్లు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌కు రూ.3,800 కోట్లు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.3,300 కోట్లు కేటాయిస్తున్నది.




ఢిల్లీలో డీఆర్ఐ పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. చిత్రంలో ఆ శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్, రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్

## రేపు బ్యాంక్ చీఫ్‌లతో ఆర్థిక మంత్రి భేటీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 26:** ప్రభుత్వరంగ బ్యాంకుల ఆర్థిక స్థితిగతులు, పనితీరు, వ్యాపారంలో వృద్ధి తదితర వివరాలను తెలుసుకోవడానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ శనివారం ఆయా బ్యాంకుల అధిపతులతో సమావేశంకాబోతున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. డిమాండ్, వినిమయంలో బ్యాంకింగ్ రంగ పాత్ర చాలా కీలకంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో ఈ సమావేశం మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నది. అలాగే 2020-21 ఆర్థిక సంవత్సరానికిగాను ఫిబ్రవరి 1న కేంద్రం ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్ కంటే ముందు ఈ సమావేశం జరుగుతుండటం విశేషం. ఈ సమావేశానికి ప్రభుత్వ రంగ బ్యాంకుల ఎండీ, సీఈవోలు హాజరుకాబోతున్నారు. ఈ సమావేశంలో మొండి బకాయిల వసూళ్లకు సంబంధించి బ్యాంకులు తీసుకుంటున్న చర్యలు, అలాగే దివాలా చట్టం కింద ఎన్ని కేసులు పరిష్కరించిన దానిపై కూడా ప్రధానంగా చర్చించనున్నట్లు తెలుస్తున్నది. గడిచిన నాలుగేండ్లలో పీఎస్‌బీలు రూ.4,01,393 కోట్ల మొండి బకాయిలను వసూలు చేయగలిగాయి. వీటిలో 2018-19 లోనే రూ.1,56,702 కోట్లు రికవరి చేశాయి. రిజర్వు బ్యాంకు పలుమార్లు వడ్డీరేట్లను తగ్గించినప్పటికీ ఈ ప్రయోజనాన్ని బ్యాంకులు ఖాతాదారులకు చేరవేయడం లేదన్న ఆరోపణలపై కూడా ఈ సమీక్ష సమావేశంలో చర్చించనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. 2019లో ఇప్పటి వరకు సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్లను 110 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో రెపో రేటు తొమ్మిదేండ్ల కనిష్ఠ స్థాయి 5.40 శాతానికి తగ్గింది. సెప్టెంబర్ 30తో ముగిసిన రెండో త్రైమాసికంలో భారత వృద్ధిరేటు ఆరేండ్ల కనిష్ఠ స్థాయి 4.5 శాతానికి పడిపోగా, భవిష్యత్తులోనూ మరింత పడిపోయే సూచనలు కనిపిస్తున్నాయి.

# రూ.2.4 లక్షల కోట్లు

## రిలయన్స్ రిటైల్ విలువ

### వాటాదారుల కోసం షేర్ల మార్పిడి పథకం

### ప్రతీ నాలుగు షేర్లకు ఒక ఆర్ఐఎల్ షేర్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 26:**

రిలయన్స్ రిటైల్ విలువను రూ.2.4 లక్షల కోట్లు (34 బిలియన్ డాలర్లు)గా తేల్చారు. నూతన షేర్ల మార్పిడి పథకంలో భాగంగా లెక్కగట్టారు. భారతీయ అపర కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందినదే ఈ రిలయన్స్ రిటైల్. ఇది రిలయన్స్ రిటైల్ వెంచర్స్ అనుబంధ సంస్థగాక, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) పరోక్ష అనుబంధ సంస్థ కూడా. రిలయన్స్ రిటైల్ స్టాక్ మార్కెట్లలో లేదన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ సంస్థ వాటాదారుల కోసం షేర్ల మార్పిడి పథకాన్ని ప్రతిపాదించారు. ఇందులో భాగంగా ప్రతీ నాలుగు రిలయన్స్ రిటైల్ షేర్లకు మార్కెట్ లీడర్‌గా ఉన్న ఒక్క ఆర్ఐఎల్ షేర్ లభించనున్నది. ఫలితంగా రిలయన్స్ రిటైల్ విలువ రూ.2.4 లక్షల కోట్లుగా తేలింది. అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ (డీమార్ట్) విలువ కంటే ఇది రెండింతలు ఎక్కువ. బ్రిటన్ బహుళజాతి సంస్థ టెస్కో విలువ సైతం 32 బిలియన్ డాలర్లుగానే ఉన్నది. రిలయన్స్ రిటైల్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సూపర్ మార్కెట్ స్టోర్లు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఔట్‌లెట్లు నడుస్తున్న సంగతి విదితమే. గురువారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ట్రేడింగ్‌లో ఆర్ఐఎల్ షేర్ రూ.1,515.95 వద్ద ముగిసింది. సంస్థ మార్కెట్ సంపద రూ.9.6 లక్షల కోట్లుగా నమోదైంది.

**వేగంగా విస్తరణ**

రిలయన్స్ రిటైల్ వేగంగా విస్తరిస్తున్నది. హైపర్ మార్కెట్లు, డిపార్ట్‌మెంటల్ స్టోర్లు, సూపర్ మార్కెట్లు, షాపింగ్ మాల్స్, స్పెషాల్టీ స్టోర్లు, షాపింగ్ ఔట్‌లెట్లు, కన్వీనియెన్స్ స్టోర్లు, హోల్‌సేల్, క్యాష్ అండ్ క్యారీ లావాదేవీలు, గిడ్డంగులు, పంపిణీ కేంద్రాలు, కలెక్షన్ సెంటర్లు, డిపోలు, షోరూంల ఏర్పాటులో రిలయన్స్ రిటైల్ దూసుకుపోతున్నది. వాణిజ్య, పారిశ్రామిక, శాస్త్రీయ, గృహ, ఆహారోత్పత్తి, కన్స్యూమర్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్‌తోపాటు ఇతర నిత్యవసరాలను మార్కెటింగ్ చేస్తున్నది. మరింతగా అటు మార్కెట్‌పరంగా, ఇటు వ్యాపారపరంగా విస్తరించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నది.




**స్టాక్ మార్కెట్‌లోకి రిలయన్స్ రిటైల్**

రిలయన్స్ రిటైల్‌ను దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ప్రవేశపెట్టాలని ముకేశ్ అంబానీ ప్రయత్నిస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టులోనే ఈ మేరకు సంకేతాలివ్వగా, వచ్చే ఐదేండ్లలో స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లోకి రిలయన్స్ రిటైల్ రావచ్చన్నారు. ఈ సంస్థ నికర అమ్మకాలు నిరుడు రూ.1.3 లక్షల కోట్లుగా నమోదైయ్యాయి. మొత్తం 10,901 స్టోర్లున్నాయి. కాగా, 2006, 2007ల్లోనే రిలయన్స్ తమ ఉద్యోగులకు స్టాక్ ఆప్షన్స్ ఇచ్చింది. ఈ క్రమంలోనే రిలయన్స్ రిటైల్‌లో రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్‌కు 99.95 శాతం వాటా ఉండగా, మిగతా 0.05 శాతం వాటా ఉద్యోగుల చేతుల్లో ఉన్నది. ఇదిలావుంటే నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ముంబై ధర్మాసనం ఈ నెల 17న ఇచ్చిన ఆదేశానికి అనుగుణంగా ఈ షేర్ల మార్పిడి పథకం ఆమోదం కోసం వచ్చే నెల 23న రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ ఈక్విటీ వాటాదారుల సమావేశం జరుగుతుందని సంస్థ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో రిలయన్స్ రిటైల్ ఆదాయం 27 శాతం పుంజుకుని రూ.41,202 కోట్లుగా ఉన్నది. నిర్వహణ లాభం 66.8 శాతం పెరిగి రూ.2,322 కోట్లుగా ఉంది. ప్రస్తుతం 24.5 మిలియన్ చదరపు అడుగుల రిటైల్ స్టోర్ ఏరియా దీని ఆధ్వర్యంలో ఉన్నది.

## రేటింగ్ ఏజెన్సీలకు సెబీ ఝలక్

### ఇక్రా, కేర్ రేటింగ్ ఏజెన్సీలపై రూ.25 లక్షల జరిమానా

**న్యూఢిల్లీ, డిసెంబర్ 26:** ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ కేసులో స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ..ప్రముఖ రేటింగ్ ఏజెన్సీలకు ఝలక్ ఇచ్చింది. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ జారీ చేసిన నాన్-కన్వర్టబుల్ డిబెంచర్లపై ఇక్రా, కేర్ రేటింగ్, ఇండియా రేటింగ్ ఏజెన్సీలు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో చెరో సంస్థపై రూ.25 లక్షల చొప్పున జరిమానా విధించింది సెబీ. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్‌లు రుణాల తిరిగి చెల్లింపులు జరుపడంలో విఫలంకావడంలో ఈ రేటింగ్ ఏజెన్సీల పాత్ర కూడా పరోక్షంగా ఉన్నట్లు సెబీ గుర్తించింది. ఐఎల్ అండ్‌ఎఫ్‌ఎస్‌తోపాటు తన అనుబంధ సంస్థయైన ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ ఫైనాన్షియల్ సర్వీస్ సంస్థలు ఎన్‌సీడీల జారీ చేయడం ద్వారా సేకరించిన రుణాలపై వడ్డీలను కూడా చెల్లించకపోయాయి. ఈ ఎన్‌సీడీలకు కేర్ రేటింగ్, క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలు ఏఏఏ రేటింగ్‌లు ఇవ్వడంపై సెబీ అభ్యంతరాలు వ్యక్తంచేసింది. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్, గ్రూపు కంపెనీల ఆర్థిక స్థితిగతులు, స్వల్పకాలంలో నిధుల సేకరణ, డెబిట్ ఈక్విటీ రేషియో, దీర్ఘకాలికంగా అప్పులు, ఆపరేటింగ్ ప్రాఫిట్, మానటైజేషన్, ఇతర స్థితిగతులపై అధ్యయనం చేయడంలో రేటింగ్ ఏజెన్సీలు విఫలమయ్యాయని సెబీ పేర్కొంది.

# మీకు టిక్కెట్లు ఇవ్వం..

## పలు ప్రభుత్వ సంస్థలకు ఎయిర్ ఇండియా షాక్

**ముంబై, డిసెంబర్ 26:** నిధులు లేక సతమతమవుతున్న ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా..ఇతర ప్రభుత్వ సంస్థలకు గట్టి షాకిచ్చింది. పాత బకాయిలు తడిసిమోపెడు కావడంతో వీటిని ముందుగా చెల్లించండి..ఆ తర్వాతనే కొత్తగా విమాన టిక్కెట్లను జారీ చేస్తామని హుకుం జారీ చేసింది. ఆఫీస్ పని నిమిత్తం పలు ప్రభుత్వ ఉన్నతాధికారులు ఒకచోటి నుంచి ఇంకో చోటికి ఎయిర్ ఇండియా విమానాల్లోనే ప్రయాణిస్తున్నారు. ఇలా ప్రయాణించిన వారు చెల్లించాల్సిన టిక్కెట్ల విలువ అక్షరాల రూ.10 లక్షలు. రోజువారి విమాన సర్వీసులు నడుపలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఎయిర్ ఇండియా.. ఏకంగా పాత బకాయిలను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించింది. మొత్తంగా ప్రభుత్వం నుంచి ఎయిర్ ఇండియాకు టిక్కెట్ల రూపంలో రావాల్సింది రూ.268 కోట్లని కంపెనీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

**పదేండ్లలో తొలిసారి..**

మొండి బకాయిలపై ఎయిర్ ఇండియా ప్రత్యేక దృష్టి సారించింది. ఇతర ప్రభుత్వ రంగ ఉద్యోగులకు టిక్కెట్లను తిరస్కరించడం గడిచిన పదేండ్లలో ఇదే తొలిసారి. తిరస్కరించిన సంస్థల్లో సీబీఐ, ఐబీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, కస్టమ్స్ కమిషనర్స్, సెంట్రల్ లేబర్ ఇనిస్టిట్యూట్, ఇండియన్ ఆడిట్ బోర్డ్, కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్, భద్రత దళాలు ఉన్నాయి. ప్రభుత్వ, ఏజెన్సీలకు సంబంధించిన ఉన్నతాధికారులు తమ ప్రయాణానికి తొలుత ఎయిర్ ఇండియా విమాన సర్వీసులనే వినియోగించుకోవాలని, సంస్థ నడుపని రూట్లలో మాత్రమే ఇతర విమాన సర్వీసులను ఎంచుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. గడిచిన నెల రోజులుగా ప్రభుత్వానికి చెందిన పలు శాఖల బకాయిలపై ఆరా తీసిన యాజమాన్యం..కీలక రంగాల బకాయిలు ఏకంగా రూ.10 లక్షలకు పైగా ఉన్నాయని గుర్తించింది. దీంతో వెంటనే ఆయా రంగాలకు చెందిన ఉన్నతాధికారులకు ముందుగా బకాయిలు చెల్లించండి..ఆ తర్వాతనే మా విమాన సర్వీసులను వినియోగించుకోండని హుకుం జారీ చేసినట్లు తెలుస్తున్నది. కానీ, ఎయిర్‌పోర్ట్ అథార్టీ ఆఫ్ ఇండియా, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, లోక్‌సభ ఉన్నతాధికారులకు మాత్రం ఇందుకు మినహాయింపునిచ్చింది. బకాయిల వసూళ్లపై ఎయిర్ ఇండియా ప్రతినిధి మాట్లాడుతూ..గడిచిన కొన్ని వారాల్లో రూ.50 కోట్లను వసూల్ చేసినట్లు, దీర్ఘకాలికంగా ఉన్న బకాయిలు ఇవి కొన్ని అని ఆయన పేర్కొన్నారు. కంపెనీ చరిత్రలో ప్రభుత్వరంగ సంస్థలను మొండి బకాయిలుగా ప్రకటించడం ఇదే తొలిసారని వ్యాఖ్యానించారు. సంస్థ మొత్తం బకాయిల్లో పశ్చిమ భారతం నుంచి అధికంగా ఉన్నాయని, వీటి విలువ రూ.22.8 కోట్లకు పైగా అని తెలిపారు. ముంబైకి చెందిన కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ ఏకంగా రూ.5.4 కోట్లు చెల్లించాల్సి ఉన్నదని చెప్పారు.అలాగే బోర్డ్ ఆఫ్ రేడియేషన్ అండ్ ఐసోటోప్ టెక్ సైంటిఫిక్ ఆఫీసర్-డీ రూ.2.4 కోట్లు, లోక్‌సభ ఎగ్జిక్యూటివ్ అధికారులు ఎంఎస్‌ఏ రూ.2.2 కోట్లు, సీబీఐ రూ.95 లక్షలు, ఈడీ వర్గాలు రూ.12.8 లక్షలు చెల్లించాల్సి ఉన్నదని తెలిపింది. అలాగే రైల్వే మంత్రిత్వ శాఖ రూ.36 లక్షలు బకాయి ఉండగా, పశ్చిమ రైల్వే రూ.4.8 లక్షలు బాకీ పడింది.



## మూడోరోజూ వెనక్కి

### 297 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్



**ముంబై, డిసెంబర్ 26:** స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజు నష్టాల్లోనే ముగిశాయి. బ్లూచిప్ సంస్థలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల షేర్లు కుదుపునకు లోనుకావడంతోపాటు డిసెంబర్ నెలకుగాను డెరివేటివ్ కాంట్రాక్టు గడువు ముగియడంతో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. ఫలితంగా లాభాలతో ప్రారంభమైన సూచీలు సమయం గడుస్తున్న కొద్దీ నష్టాల్లోకి జారుకున్నది. ఒక దశలో 328 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 297.50 పాయింట్ల నష్టంతో 41,163.76 వద్ద ముగియగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 88 పాయింట్లు పతనం చెంది 12,126.55కి జారుకున్నది. మార్కెట్లో అత్యధికంగా భారతీ ఎయిర్‌టెల్ 2.23 శాతం పడిపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. వీటితోపాటు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ అండ్ టీ, సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతి, టైటాన్, కొటక్ బ్యాంక్‌ల షేర్లు మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి. కానీ, ఓఎన్‌జీసీ, ఎన్టీపీసీ, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రాలు మాత్రం రెండు శాతం వరకు లాభపడ్డాయి. డెరివేటివ్ కాంట్రాక్టు గడువు ముగియడంతో మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయని, అంతర్జాతీయ సంస్థాగత పెట్టుబడిదారులు హాలీడే మూడ్‌లోకి వెళ్లిపోవడం ఈ పతనానికి ఆజ్యం పోసిందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా బుధవారం మార్కెట్లకు సెలవుకావడంతో ట్రేడింగ్ నాలుగు రోజులకు పరిమితమైంది. రంగాల వారీగా చూస్తే టెలికం, ఇంధనం, క్యాపిటల్ గూడ్స్, బ్యాంకెక్స్, చమురు అండ్ గ్యాస్, టెక్, హెల్త్‌కేర్ రంగాల షేర్లు రెండు శాతం వరకు నష్టపోగా..మెటల్, బేసిక్ మెటీరియల్ స్వల్ప లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ షేర్లు స్వల్పంగా నష్టపోగా, స్మాల్‌క్యాప్ షేర్లు లాభాల్లో ముగిశాయి. ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.504 కోట్ల పెట్టుబడులను విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఉపసంహరించుకున్నారు. వరుసగా నాలుగు నెలలుగా భారీగా పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌పీఐలు ఈసారి వెనక్కితీసుకుంటున్నారు.

**మూడు వారాల కనిష్ఠానికి రూపాయి**

రూపాయికి మరిన్ని చిల్లులు పడ్డాయి. డాలర్‌ను కొనుగోలు చేయడానికి ఎగుమతిదారులు, బ్యాంకర్లు ఎగబడటంతో దేశీయ కరెన్సీ విలువ మూడు వారాల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోవడం, అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు నిలకడగా పెరుగుతుండటంతో వరుసగా ఐదోరోజు డాలర్ బలపడింది. గురువారం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 4 పైసలు కోల్పోయి 71.31 వద్దకు జారుకున్నది. 71.26 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు 71.22 నుంచి 71.35 మధ్యలో కదలాడింది. చివరకు నిన్నటి ముగింపుతో పోలిస్తే నాలుగు పైసలు జారుకొని 71.31 వద్ద స్థిరపడింది. గడిచిన వారం రోజుల్లో మారకం విలువ 34 పైసలు పతనం చెందింది. క్రూడాయిల్ ధరలు క్రమం తప్పకుండా పెరుగుతుండటం, దేశీయ ఈక్విటీలు అమ్మకాలకు గురికావడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను ఉపసంహరించుకోవడం వంటి అంశాలు రూపాయిపై ప్రతికూల ప్రభావం చూపాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. బ్రెంట్ క్రూడాయిల్ ప్యూచర్ మార్కెట్లో స్వల్పంగా పెరిగి 67.48 డాలర్లు పలికింది.

## జోరు తగ్గిన ఐపీవో

- ఈ ఏడాది పడిపోయిన 60 శాతం నిధుల సమీకరణ
- రూ.12 వేల కోట్లకు పరిమితం

రివ్యూ 2019

**దేశ** ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మందగమన పరిస్థితులు.. ఐపీవో మార్కెట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ప్రతికూల పరిస్థితుల మధ్య స్టాక్ మార్కెట్లలోకి ప్రవేశించడం మంచిది కాదనుకున్న సంస్థలు.. పబ్లిక్ ఇష్యూలకు దూరంగా ఉన్నాయి. దీంతో ఈ ఏడాది ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లు (ఐపీవో) గతేడాదితో పోల్చితే ఏకంగా 60 శాతం పడిపోయాయి. నిరుడు ఐపీవోల ద్వారా వివిధ సంస్థలు సమీకరించిన నిధుల విలువ రూ.30,959 కోట్లుగా ఉంటే, ఈ ఏడాది రూ.12,362 కోట్లకు పరిమితమైయ్యాయి. 2019లో 16 సంస్థలు మాత్రమే ఐపీవోకి వచ్చాయి. 2018లో ఇవి 24గా ఉన్నట్లు క్యాపిటల్ మార్కెట్ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది వచ్చిన అతిపెద్ద ఐపీవో స్టెర్లింగ్ అండ్ విల్సన్ సోలార్. రూ.2,850 కోట్ల నిధులను సమీకరించింది. 2019లో సగటు ఐపీవో విలువ రూ.773 కోట్లుగా నమోదైంది. మొత్తం 16 ఐపీవోల్లో ఏడింటికి 10 రెట్లకు పైగా ఆదరణ కనిపించింది. ఐఆర్‌సీటీసీ ఐపీవో 109 రెట్లు స్పందనను అందుకున్నది. ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 100 రెట్లు ఆదరణను సొంతం చేసుకున్నది.

**చుట్టుముట్టిన భయాలు**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో దేశ జీడీపీ 5 శాతానికి దిగజారగా, రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో దాదాపు ఏడేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ 4.5 శాతానికి పతనమైంది. ఈ ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు అంచనాల్నీ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు కోత పెడుతున్నాయి. దీంతో స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుండటం.. వివిధ రంగాల్లోని సంస్థలను భయాలకు గురిచేసింది. ఫలితంగా నిధుల సమీకరణను వాయిదా వేసుకున్న సంస్థలు.. పరిస్థితులు చక్కబడ్డాక తిరిగి ప్రయత్నాలు మొదలు పెడుదామన్న భావనకు వచ్చేశాయి. నిజానికి ఈ ఏడాది గరిష్ఠంగా 47 సంస్థలు ఐపీవోకు సిద్ధమైయ్యాయి. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ సైతం ఆమోదం తెలుపగా, రూ.51 వేల కోట్లకుపైగా నిధుల సమీకరణకు లైన్ క్లియరైంది. అయితే ఆర్థిక మందగమనం అడ్డుపడింది.

**పెరిగిన క్యూఐపీ, ఓఎఫ్‌ఎస్‌లు**

ఈ ఏడాది ఐపీవోలు నిరాశపరిచినా.. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్స్ (క్యూఐపీ), ఆఫర్-ఫర్-సేల్ (ఓఎఫ్‌ఎస్) జోరుగా సాగాయి. గతంతో పోల్చితే 28 శాతం వృద్ధి కనిపించింది. 2019లో క్యూఐపీ, ఓఎఫ్‌ఎస్‌ల ద్వారా సమీకరించిన నిధులు రూ.81,174 కోట్లుగా ఉన్నాయి. 2018లో ఇది రూ.63,651 కోట్లుగా ఉన్నది. అయినప్పటికీ 2017లో ఆల్‌టైమ్ హై స్థాయిలో నమోదైన రూ.1,60,032 కోట్లతో పోల్చితే మాత్రం 49 శాతం తక్కువే. 2017లో 36 ఐపీవోల ద్వారా రూ.67,147 కోట్లను అందుకున్న సంస్థలు.. 2016లో 26 ఇష్యూలతో రూ.26,494 కోట్లను, 2015లో 15 ఐపీవోలతో రూ.13,614 కోట్లను, 2014లో అత్యల్పంగా 5 ఐపీవోలతో రూ.1,201 కోట్లను పొందాయి.

## కొత్త 5జీపై కన్ను

- అదనపు స్పెక్ట్రం అమ్మకానికి టెలికం శాఖ ప్రయత్నాలు
- జనవరిలో ట్రాయ్ అభిప్రాయ సేకరణ




**న్యూఢిల్లీ, డిసెంబర్ 26:** కొత్త 5జీ స్పెక్ట్రంపై టెలికం రెగ్యులేటర్ ట్రాయ్ అభిప్రాయాలను త్వరలో టెలికం శాఖ సేకరించనున్నది. ధరల విధానం, ఇతరత్రా అంశాలపై ట్రాయ్ సిఫార్సులను కోరనున్నది. 5జీ శ్రేణిలోని 24.75-27.25 గిగాహెట్జ్ తరంగాలను వచ్చే ఏడాది వేలం వేయాలనుకుంటున్నది. దీంతో వచ్చే నెల ట్రాయ్ అభిప్రాయం కోసం టెలికం శాఖ వెళ్లాలని చూస్తున్నది. ఈ తరంగాలు.. ఇటీవల డిజిటల్ కమ్యూనికేషన్స్ కమిషన్ (డీసీసీ) ఆమోదించిన స్పెక్ట్రం విక్రయ ప్రణాళికలో లేవు. ఈ నెల 20న రూ.5.22 లక్షల కోట్ల స్పెక్ట్రం అమ్మకపు ప్లాన్‌కు డీసీసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా ఉన్న 22 టెలికం సర్కిళ్ల పరిధిలోగల 8,300 మెగాహెట్జ్ తరంగాలను వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్‌లో విక్రయించేందుకు డీసీసీ అనుమతినిచ్చింది. ఈ క్రమంలో 24.75-27.25 గిగాహెట్జ్ తరంగాలనూ వేలం వేయాలని టెలికం శాఖ భావిస్తున్నది. దీంతో ఈ తరంగాల ధర, ఇతరత్రా అంశాలపై సిఫార్సుల కోసం ట్రాయ్ వద్దకు జనవరిలో వెళ్లనున్నదని సంబంధిత వర్గాల సమాచారం. 2020 మార్చి-ఏప్రిల్‌లో జరుగనున్న 8,300 మెగాహెట్జ్ స్పెక్ట్రం వేలంలో 35 శాతం మాత్రమే 5జీ సేవలకు అనువైనది. దీంతో అదనపు 5జీ స్పెక్ట్రంపై టెలికం శాఖ దృష్టి సారించింది. దేశవ్యాప్తంగా 5జీ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు ఇది ఎంతమాత్రం చాలదన్న భావన టెలికం శాఖలో వ్యక్తమవుతున్నది. అందుకే 5జీ శ్రేణిలోని కొత్త స్పెక్ట్రం వినియోగాన్ని తెరపైకి తెస్తున్నది. నిజానికి గతేడాది ఆగస్టు 1న 700, 800, 900, 1800, 2100, 2300, 2500, 3300-3400, 3400-3600 మెగాహెట్జ్ శ్రేణిలో స్పెక్ట్రం వేలానికి ట్రాయ్ సిఫార్సులు చేసిన సంగతి విదితమే. అయితే ఇప్పటిదాకా 5జీ శ్రేణిలోని 24.75-27.25 గిగాహెట్జ్ తరంగాల జోలికి టెలికం శాఖ వెళ్లలేదు. ఈ క్రమంలో వీటి వేలానికీ సమయం ఆసన్నమైందని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

**ధరల్ని తగ్గించాలి: పరిశ్రమ**

దేశీయ టెలికం రంగం నష్టాల్లో ఉందని, స్పెక్ట్రం ధరను తగ్గిస్తేనే 5జీ కొనుగోళ్లకు కంపెనీలు ఆసక్తి చూపించే వీలుందని సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీవోఏఐ) అంటున్నది. కాబట్టి స్పెక్ట్రం ధరలను ఆమోదయోగ్యంగా ఉంచాలని కేంద్రాన్ని కోరుతున్నది. ఇటీవల సర్దుబాటు స్థూల వార్షిక ఆదాయం (ఏజీఆర్)పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో టెలికం సంస్థలపై రూ.1.47 లక్షల కోట్ల భారం పడినది తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో వొడాఫోన్ ఐడియా మునుపెన్నడూ లేని నష్టాలను ప్రకటించినదీ విదితమే. ఏకంగా రూ.51 వేల కోట్ల నష్టాలను చూపింది. భారతీ ఎయిర్‌టెల్ సైతం రూ.23 వేల కోట్ల నష్టాలను ప్రకటించింది. దీంతో స్పెక్ట్రం ధరలు తక్కువగా ఉంటేనే పరిశ్రమ మనుగడకు శ్రేయస్కరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## రూ.1,500 కోట్లు సేకరించిన పీఎన్‌బీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 26:** ప్రభుత్వరంగ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ).. బాసెల్-3 బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.1,500 కోట్ల వరకు నిధులను సేకరించింది. భవిష్యత్తు వ్యాపార విస్తరణకోసం ఈ నిధులను వినియోగించనున్నట్లు బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. ఈ బాండ్లపై వార్షిక వడ్డీని 8.15 శాతంగా చెల్లించనున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. రూ.10 లక్షల విలువైన 15 వేల బాసెల్-3 బాండ్లను జారీ చేసింది. ఏప్రిల్ 1, 2013 నుంచి దేశీయ బ్యాంకింగ్ రంగ సంస్థలు బాసెల్-3 ప్రమాణాలను అమలు చేస్తున్నాయి. వీటికి అనుగుణంగా నిధుల సేకరణ, రుణ వితరణ, ఆస్తుల నాణ్యత ప్రమాణాలను మెరుగుపరుచుకుంటున్నాయి.

## యువ కస్టమర్లే మా లక్ష్యం: రెడ్ చీఫ్

**హైదరాబాద్, డిసెంబర్ 26:** ప్యాషన్‌కు, స్టైల్‌కు అసలు సిసలైన చిరునామాగా రెడ్ చీఫ్ పాదరక్షలు మార్కెట్‌లో లభిస్తున్నాయని ఆ బ్రాండ్ మాతృ సంస్థ లీయాన్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ మనోజ్ జ్ఞాన్‌చందాని అన్నారు. యువతను ఆకట్టుకోవడంలో తమ బ్రాండ్ ఎప్పుడూ ముందుంటుందన్న ఆయన దేశవ్యాప్తంగా యువ కస్టమర్లను లక్ష్యంగా చేసుకునే విస్తరణ బాట పట్టినట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలో 3 వేలకు పైగా మల్టీ బ్రాండ్ ఔట్‌లెట్లు, 170కి పైగా ప్రత్యేక స్టోర్లను రెడ్ చీఫ్ కలిగి ఉందని వివరించారు. ఇటీవలే బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్‌ను రెడ్ చీఫ్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఎప్పటికప్పుడు సరికొత్త రకాల్లో చెప్పులు, షూస్‌ను తమ కొనుగోలుదారులకు అందించడంలో రెడ్ చీఫ్ ఏమాత్రం ఆలస్యం చేయబోదన్నారు.

## 4న సీఎం కేసీఆర్‌కు ఆత్మీయ సన్మానసభ



గురువారం హైదరాబాద్‌లో ఆత్మీయ సన్మానసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అబ్కారీశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ గౌడ సంఘం ప్రతినిధులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్‌లో సీఎం కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్‌కు వచ్చేనెల నాలుగున నిర్వహించే ఆత్మీయ సన్మానసభను విజయవంతంచేయాలని తెలంగాణ గౌడ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. గౌడకులస్థులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను వారు కలిశారు. ఈ సందర్భంగా ఆత్మీయసభ వాల్‌పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌడ హాస్టల్ అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, కూన వెంకటేశ్‌గౌడ్, రవీందర్‌గౌడ్, కృష్ణమూర్తిగౌడ్, చక్రవర్తిగౌడ్, రాజేశ్వర్‌గౌడ్, గోపాల్‌గౌడ్, శ్రీరామ్‌గౌడ్, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

## సీసీఎంబీలో 'యంగ్ ఇన్నోవేటర్స్'

### విద్యార్థులకు పరిశోధనాంశాలపై ప్రత్యేక శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ)లో గురువారం 7వ 'యంగ్ ఇన్నోవేటర్స్' కార్యక్రమం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 20-25 మంది విద్యార్థులను ప్రతిభ ఆధారంగా ఎంపికచేసి సీసీఎంబీలో రెండువారాలపాటు పరిశోధనాంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి, పరిశోధనల వైపు వారిని మళ్లించడంతోపాటు, నైపుణ్యాలను వెలికితీయనున్నారు. నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్జీఆర్ఐ) డైరెక్టర్ వీఎం తివారి.. నీటి సంరక్షణకు కార్యక్రమాలపై వివరించారు. సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా మాట్లాడుతూ.. దేశంలో అధికశాతం యువత ఉన్నదని, సరైన శిక్షణ ఇచ్చి పరిశోధనలవైపు మళ్లించాలని, అప్పుడే దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు.



యంగ్ ఇన్నోవేటర్స్ కార్యక్రమంలో చిన్నారులతో ఎన్జీఆర్ఐ, సీసీఎంబీ డైరెక్టర్లు తివారి, రాకేశ్‌మిశ్రా



అసోంలో నిర్మాణంలో ఉన్న ఓ నిర్బంధ కేంద్రం

# చట్ట ప్రకారమే నిర్బంధ కేంద్రాలు

- సుప్రీంకోర్టు సూచనలతోనే పలు రాష్ట్రాల్లో ఏర్పాటు
- పాస్‌పోర్ట్ గడువు ముగిసిన విదేశీయుల కోసమే వీటి నిర్మాణం
- సీఏఏ, ఎన్నార్సీపై నిరసనల నేపథ్యంలో ప్రభుత్వ వర్గాల వివరణ

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ), జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)కి వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో 'నిర్బంధ కేంద్రాలు/ శిబిరాల' అంశంపై దేశవ్యాప్త చర్చ జరుగుతున్నది. పౌరులుగా గుర్తించని వారిని ఈ కేంద్రాల్లో నిర్బంధిస్తారనే ఆందోళనలు మిన్నంటుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్బంధ కేంద్రాలపై ప్రభుత్వ వర్గాలు వివరణ ఇచ్చాయి. చట్టాలకు అనుగుణంగా, సుప్రీంకోర్టు సూచనల మేరకు దేశంలోని పలు చోట్ల ఇవి ఏర్పాటవుతున్నట్లు గురువారం పేర్కొన్నాయి. 1920 నాటి పాస్‌పోర్ట్ (భారత్‌లోకి ప్రవేశం) చట్టం, 1946 నాటి విదేశీ చట్టం ప్రకారం చెల్లుబాటుకాని పాస్‌పోర్ట్‌తో/ గడువు ముగిసినా దేశంలో అనధికారికంగా ఉన్న, జైలు శిక్ష ముగిసిన విదేశీయుల కదలికలపై ఆంక్షలు విధించి, వారిని తిరిగి వారి దేశాలకు పంపేందుకు అవసరమైన పత్రాలు రూపొందే వరకు ఈ కేంద్రాల్లో ఉంచుతారు. ఈ నేపథ్యంలో గత పదేండ్లుగా పలు రాష్ట్రాల్లో ఇలాంటి నిర్బంధ కేంద్రాలున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కేంద్ర హోంశాఖ 1998 జూలైలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు పలు సూచనలిచ్చిందన్నారు. 2009 నవంబర్ 23న, 2012 మార్చి 7న (ఫిబ్రవరి 28 నాటి సుప్రీంకోర్టు సూచనల మేరకు), 2014 ఏప్రిల్ 29న, 2014 సెప్టెంబర్ 10న, 2018 సెప్టెంబర్ 7న ఈ మార్గదర్శకాలను కేంద్రం పునరుద్ధరించిందన్నారు. 2014 సెప్టెంబర్ 10న హోంశాఖ సూచనల మేరకు అన్ని రాష్ట్రాల్లో నిర్బంధ కేంద్రాలను విధిగా ఏర్పాటు చేయాలని 2018 సెప్టెంబర్ 12న సుప్రీంకోర్టు పేర్కొందన్నారు. తర్వాత జరిగిన విచారణల్లో వీటిని ఏర్పాటు చేయని రాష్ట్రం గురించి కోర్టు దృష్టికి వచ్చిందని, అసోంలోని మాటియా, గోల్‌పారాలో కేంద్రం ఆమోదించిన నిర్బంధ కేంద్రాల నిర్మాణ పురోగతిని కోర్టు ఎప్పటికప్పుడు తెలుసుకున్నదని ఆ వర్గాలు చెప్పాయి. దీంతో దేశవ్యాప్తంగా నిర్బం ధ కేంద్రాలపై నమూనా పుస్తకాన్ని హోంశాఖ, 2019 జనవరి 9న అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు పంపిందని కేంద్ర వర్గాలు తెలిపాయి.

**జైళ్లలో తాత్కాలిక నిర్బంధ కేంద్రాలు**

దేశంలో అక్రమంగా ఉంటున్న విదేశీయుల కోసం పలు జైళ్లలో కొన్ని నిర్బంధ కేంద్రాలను గతంలోనే ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అసోంలోని గోల్‌పారా, కోక్రాఝర్, తేజ్‌పూర్, జోర్హాట్, దిబ్రూగఢ్, సిల్చార్ జిల్లా జైళ్లు, ఢిల్లీలోని దేశ రాజధాని ప్రాంత పరిధి (ఎన్సీఆర్)లోని లాంపూర్‌లోని సేవాసదన్, మహిళలకు మహిళా సదన్, షాజాదా బాగ్ (బంగ్లాదేశీయుల కోసం), పంజాబ్‌లో అమృతసర్ కేంద్ర జైలు, రాజస్థాన్‌లో అల్వార్ జైలు, పశ్చిమ బెంగాల్, గుజరాత్ (భుజ్), తమిళనాడులో ఇవి ఉన్నాయన్నాయి. 1948 విదేశీయుల ఆర్డర్, 1992 విదేశీయుల రిజిస్ట్రేషన్ నిబంధనల మేరకు ఆయా జిల్లాల ఎస్పీలు విదేశీ రిజిస్ట్రేషన్ అధికారులు(ఎఫ్ఆర్వో)గా వ్యవహరిస్తారు. ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, అమృత్‌సర్, బెంగళూరు, హైదరాబాద్, కొచి, తిరువనంతపురం, కోజికోడ్, లక్నో, అహ్మదాబాద్‌లో విదేశీయుల అంశాలను చూసేందుకు విదేశీ ప్రాంతీయ రిజిస్ట్రేషన్ అధికారులను నియమించారు. దేశంలో ఎలాంటి నిర్బంధ కేంద్రాలు లేవని ఇటీవల ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలకు ఈ ప్రభుత్వ వివరణ విరుద్ధంగా ఉన్నది.

# నీళ్లూ.. నిబంధనలూ ముఖ్యమే!

- మిషన్‌భగీరథ పనులపై ముందుజాగ్రత్తలు
- అన్నీ పక్కాగా ఉంటేనే పూర్తి బిల్లులు
- 10 ప్రమాణాలను నిర్ణయించిన అధికారులు



**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** మిషన్‌భగీరథ పథకంలో ఇంటింటికీ తాగునీరు ఇవ్వడానికే ఎంత ప్రాధాన్యమిచ్చారో.. నిబంధనల మేరకు పనులన్నీ పక్కాగా పూర్తిచేయించడానికీ అధికారులు అంతే ప్రాధాన్యమిస్తున్నారు. కాంట్రాక్టర్లు అరకొరగా పనులు చేయించి.. అయిందనిపించి బిల్లులు తీసుకోవడం కుదరదని హెచ్చరిస్తున్నారు. శుద్ధిచేసిన ట్యాంకునుంచి ఆవాసానికి తాగునీరు చేరేవరకు పది అంశాల్లో పనులు సరిగా ఉంటేనే బిల్లు చెల్లించేలా ఏర్పాట్లుచేశారు. 'మిషన్ భగీరథ నీటినే తాగండి' అంటూ 100రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామస్థులకు అవగాహన కల్పించే పది ప్రమాణాల్లో ఎక్కడైనా లోటుపాట్లు ఉన్నాయా? ఏమైనా సరిచేయాలా? అనే విషయాలపై స్థానిక అధికారులు, గుత్తేదారులకు సూచనలు ఇస్తున్నారు. అన్నీ సరిగ్గా ఉన్నాకే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, బిల్లులు మంజూరు చేసేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాస్తవంగా పనులు పక్కాగా చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు వెంటనే రిలీజ్ చేస్తున్నారు. ఇంట్రా పనుల్లో మెటీరియల్ బిల్లులు ఈ ఏడాది మార్చి వరకు, సివిల్ పనుల బిల్లులు జూలై నెలాఖరు వరకు చెల్లించారు. తర్వాత అయిన పనుల్లో 30 శాతం చెల్లించగా, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో 100 శాతం కట్టారు. నాబార్డు ద్వారా చెల్లించాల్సినవి సెప్టెంబర్ వరకు పూర్తయ్యాయి. మొత్తం రూ. 44 వేల కోట్ల ప్రాజెక్టు వ్యయంలో ఇప్పటికే రూ.31వేల కోట్లు చెల్లించారు. పన్నులు, అనుమతుల కోసం కేటాయించిన బడ్జెట్‌లో కొన్ని నిధులు మిగులుతాయని, రూ.44 వేల కోట్ల కంటే తక్కువలోనే పనులన్నీ అయిపోతాయని అధికారులు అంచనావేస్తున్నారు. పోయిన ఏడాది మార్చిలో 18 వేల కొత్త ట్యాంకులకు గాను నాలుగువేలు మాత్రమే నిర్మించారు. ప్రస్తుతం 17,200 ట్యాంకులు పూర్తయ్యాయి. మిగిలిన 800 వివిధ దశల్లో ఉన్నాయి. గతేడాది వేసవిలోనే అన్ని ఆవాసాలకు ట్యాంకులు, అవి లేనిచోట ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీరు అందించామని, ఇప్పుడు పనులన్నీ పక్కాగా పూర్తి చేస్తున్నామని మిషన్‌భగీరథ ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

**సబ్‌కాంట్రాక్టులతో సంబంధం లేదు**

కొన్ని గ్రామాల్లో భగీరథ పైప్‌లైన్ పనులను సబ్‌కాంట్రాక్టర్లు చేశారు. రూ.10 లక్షల మేరకు పనులు చేయగా.. చాలామందికి సగం బిల్లులే వచ్చాయి. అయితే ఇంట్రా పనులను అసలు సబ్‌కాంట్రాక్ట్ తీసుకోవద్దని ముందునుంచే చెపుతున్నామని, చేసిన పనిమేరకు ప్రధాన కాంట్రాక్టర్లకు డబ్బులు ఇచ్చామని అధికారులు స్పష్టంచేస్తున్నారు. సబ్‌కాంట్రాక్టర్లు చాలామంది రూ.10 లక్షల పనిని రూ.5 లక్షల్లో పూర్తిచేసి రూ.10 లక్షలు వస్తాయనుకోవడం సరికాదని పేర్కొంటున్నారు. ఒక వేళ నిజంగానే రూ.10 లక్షల పనిచేసి ఉంటే ఎదురుచూపులే తప్ప పైసలు వస్తాయని చెప్పలేమని అంటున్నారు.

**జనవరితో ముగింపు**

భగీరథ నీటినే తాగాలని ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు చేపట్టిన కార్యక్రమం జనవరి నెలాఖరుతో ముగియనున్నది. అన్ని జిల్లాల్లో కార్యక్రమం చురుగ్గా సాగుతున్నది. మిషన్‌భగీరథ ఇంజినీరింగ్ ఇన్‌చీఫ్ కృపాకర్‌రెడ్డి ఇతర ఉన్నతాధికారులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. అవగాహనతోపాటు పనుల పరిశీలన, పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న పనులు గడువులోగా పూర్తిచేయనున్నారు. జిల్లాలో పనులు పూర్తయిన ఐదు, నిబంధనల మేరకు పూర్తిచేసే దశలో ఉన్న మరోఐదు గ్రామాలను ఈఎన్సీ స్వయంగా వెళ్లి పరిశీలిస్తున్నారు. జనవరి నాటికి పనులన్నీ అవుతాయని.. అయితే ఆన్‌లైన్‌లో వివరాల అప్‌లోడ్ మాత్రం కొంత ఆలస్యం కావచ్చని ఆయన తెలిపారు. ఒక్కో ఏఈకి తొలివిడుత మూడు గ్రామాలు అప్పగించామని.. నిబంధనల ప్రకారం పది ప్రమాణాల ఆధారంగా పనులన్నీ పూర్తయ్యాకే మరో మూడు గ్రామాలకు వెళ్లాలని ఆదేశించినట్టు చెప్పారు. ఈఈ, డీఈ,ఏఈ స్థాయిలో 100 శాతం పనులయ్యాక, విజిలెన్స్ అధికారులు వెళ్లి పరిశీలించి, సంతృప్తి చెందితేనే బిల్లులు చెల్లిస్తామని ఈఎన్సీ స్పష్టంచేశారు.

### అధికారులు సూచిస్తున్న పది ప్రమాణాలు

- ఇప్పటికే ఉన్న ఓహెచ్‌ఆర్‌ఎస్ (ఓవర్ హెడ్ సర్వీసు రిజర్వాయర్)ల రిపేరు, పునరుద్ధరణ100 శాతం పూర్తికావాలి.
- కొత్తగా ఏర్పాటుచేసిన ఓహెచ్‌ఆర్‌ఎస్‌లు వినియోగంలోకి రావాలి.
- పరిశుభ్రమైన పరిస్థితుల్లో ఓహెచ్‌ఆర్‌ఎస్‌ల నిర్వహణ ఉండాలి.
- హెచ్‌డీపీఈ/ఎండీపీఈ పైపులు బయటకు కనిపించకూడదు.
- ట్యాప్‌లు కదలకుండా ఏర్పాటుచేయాలి. గోడపక్కన పెడితే అటూ, ఇటూ వంగకుండా క్లాంప్‌లు బిగించాలి. బహిరంగ ప్రదేశం అయితే ట్యాప్ కిందిభాగం కదలకుండా సిమెంట్ బ్లాక్ ఏర్పాటుచేయాలి.
- పైపులైన్ వేసేందుకు తవ్విన సీసీ రోడ్లను పునరుద్ధరించాలి.
- భగీరథ ట్యాప్‌ల ద్వారా నివాసాలకు ప్రతిరోజూ నీటిని ఇవ్వాలి.
- గ్రామ పంచాయతీల తీర్మానం, లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలి.
- గ్రామంలో ఉంటే వాటర్‌మెన్‌కు విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కల్పించాలి.
- పైవన్నీ అయ్యాక సర్పంచ్, వార్డు మెంబర్లు, విద్యావంతుల ఆధ్వర్యంలో మిషన్‌భగీరథ నీటితో చేకూరే ప్రయోజనాలు, ఆర్వో (డబ్బా) నీటిని తాగితే వచ్చే సమస్యలపై అవగాహన కల్పించాలి.

## దిశ చట్టం అమలుకు చర్యలు తీసుకోవాలి

- ఏపీ సీఎం వైఎస్ జగన్ ఆదేశం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీ ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన దిశ చట్టం అమలుపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టిపెట్టారు. గురువారం అమరావతిలోని తన కార్యాలయంలో హోంమంత్రి సుచరిత, సీఎస్ నీలంసహాని, డీజీపీ గౌతమ్ సవాంగ్ తదితరులతో సమీక్ష నిర్వహించారు. దిశ చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయడానికి తీసుకోవాల్సిన చర్యలు, న్యాయపరంగా, పోలీస్‌పరంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. దిశ చట్టం అమలుకు తక్షణం చర్యలు తీసుకోవాలని, రా ష్ట్రంలో 13 కోర్టుల ఏర్పాటుకు అవసరమైన బడ్జెట్‌ను కేటాయించాలని అధికారులకు సూచించారు. కోర్టుల ఏర్పాటుకు నిధులను వారంరోజుల్లో కేటాయించాలని ఆదేశించారు. పోలీస్‌శాఖలోని ఫోరెన్సిక్ ల్యాబ్ సామర్థ్యాన్ని పెంచేలా 176 పోస్టుల భర్తీకి జనవరి ఒకటిన నోటిఫికేషన్ జారీచేయాలని సీఎం జగన్ సూచించారు.

## ఏపీ భద్రతా కమిషన్ సభ్యుల నియామకం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భద్రతా కమిషన్ సభ్యులను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర హోంమంత్రి అధ్యక్షతన ఏర్పాటుచేసిన కమిషన్‌లో ముగ్గురు స్వతంత్ర్య సభ్యులను నియమించింది. రిటైర్డ్ ఐపీఎస్‌లు డాక్టర్ డీటీ నాయక్, సీఎన్ గోపినాథ్‌రెడ్డితోపాటు రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ మన్మోహన్‌సింగ్‌ను సభ్యులుగా నియమించింది.

## విశాఖలో అభివృద్ధి పనులకు 400 కోట్లు

- పరిపాలనా అనుమతులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీ ప్రభుత్వం విశాఖపట్నంలో రూ.400.40 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు పరిపాలన అనుమతులు జారీచేసింది. ఈ మేరకు గురువారం పురపాలక పట్టణాభివృద్ధిశాఖ 10 జీవోలు విడుదల చేసింది. సిరిపురం జంక్షన్‌లో మల్టి లెవల్ కార్ పార్కింగ్, వాణిజ్య సముదాయ నిర్మాణానికి రూ.80 కోట్లు, నేచురల్ హిస్టరీ పార్క్ అండ్ మ్యూజియం రిసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు రూ.88 కోట్లు (కేంద్రం వాటా రూ.38 కోట్లు, రాష్ట్ర వాటా రూ.50 కోట్లు), కైలాసగిరిలో రూ.37 కోట్లతో ప్లానెటోరియం, రూ. 40 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మ్యూజియం అండ్ టూరిజం కాంప్లెక్స్ నిర్మాణం, కావులుప్పాడ సమీపంలో రూ.22.50 కోట్లతో బయో మైనింగ్ ప్రాసెస్ ప్లాంట్ నిర్మాణం, రూ.7.50 కోట్లతో ఐటీ సెజ్ నుంచి బీచ్ రోడ్డు నిర్మాణం, చుక్కవానిపాలెంలో రూ.7.50 కోట్లతో రహదారి నిర్మాణం, విశాఖలో మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగునకు రూ.39 కోట్లు, నారవ వద్ద ఉన్న నీటి సంప్ శుభ్రం, ఆగనంపూడి వద్ద 2,200 కిలోలీటర్ల జీఎల్‌బీఆర్ నిర్మాణానికి రూ.45 కోట్లు, ఆగనంపూడి వద్ద 85 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి అనకాపల్లివరకు శుభ్రంచేసిన నీటిని సరఫరా చేసేందుకు రూ.32.40 కోట్లను ప్రభుత్వం విడుదలచేసింది.

## అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

- వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే పార్థసారథి
- రాజధాని అంటే కొత్త పట్టణాలు కాదు: అంబటి రాంబాబు

**అమరావతి:** అన్ని ప్రాంతాలను అభివృద్ధిచేసే ఆలోచనలో ఏపీ సీఎం వైఎస్ జగన్ ఉన్నారని వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. రాజధానికి రూ.1.10 లక్షల కోట్లు కావాలని చెప్పారు. గురువారం సాయంత్రం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ ఆఫీస్‌లో ముఖ్యమంత్రి జగన్ రాజధాని ప్రాంత వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. అనంతరం పార్థసారథి మీడియాతో మాట్లాడారు. అమరావతిలో చంద్రబాబు చెప్పినట్టు గ్రాఫిక్స్ అభివృద్ధి కాకుండా.. రైతులు, కూలీలు సంతృప్తి చెందేలా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. రాజధానిపై పెట్టుబడి తగ్గించి ఐటీ, ఎడ్యుకేషన్, ఇండస్ట్రియల్ హబ్‌గా చేయాలని సీఎం చూస్తున్నారని వెల్లడించారు. ఎమ్మెల్యే అంబటి రాంబాబు మాట్లాడుతూ.. రాజధాని అంటే లక్ష కోట్లు ఖర్చుపెట్టి నిర్మించే కొత్త పట్టణాలు కాదన్నారు. నిర్మాణాలన్నీ అమరావతిలోనే చేయాలంటే బడ్జెట్ సరిపోదని, తాత్కాలిక రాజధానికి ఇప్పటికే రూ.5 వేల కోట్లు ఖర్చుచేశారని చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## దేశ సేవే సైన్యం విధి.. రాజకీయ సేవ కాదు

### నేవీ మాజీ చీఫ్ రాందాస్ స్పందన

**న్యూఢిల్లీ:** ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ రాజకీయ వ్యాఖ్యలను నౌకాదళ మాజీ అధిపతి అడ్మిరల్ ఎల్ రాందాస్ తప్పుబట్టారు. సైనిక బ లగాలలో పని చేస్తున్న వారు దశాబ్దాల తరబడి దేశానికి సేవ చేస్తున్నామన్న సూత్రం తప్పనిసరిగా పాటించాలే తప్ప, రాజకీయ బలగాలకు సేవ చేస్తున్నట్లు భావించొద్దన్నా రు. త్రివిధ దళాలు తటస్థంగా ఉండాలని, పక్షపాతంతో వ్యవహరించొద్దన్న అంతర్గత కోడ్ అమలులో ఉన్నదని రాందాస్ పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ చెప్పారు.

## బాలికపై యువకుడి లైంగికదాడి

- పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధిలో ఘటన
- నిందితుడిపై పోక్సో కింద కేసు నమోదు

**పేట్‌బషీరాబాద్:** మాయమాటలు చెప్పి బాలికపై లైంగికదాడిచేసిన యువకుడిపై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పేట్‌బషీరాబాద్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. కాప్రాకు చెందిన ప్రణయ్ (20) ఇటీవలే డిప్లొమా పూర్తిచేశాడు. ఈ ఏడాది మే నెలలో కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చాడు. అదేరోజు జోగిపేటకు చెందిన ఓ బాలిక (16) ప్రణయ్ బంధువుల ఎదురింట్లో ఉండే అమ్మమ్మ ఇంటికి వేసవి సెలవులకు వచ్చింది. మాయమాటలతో ప్రేమిస్తున్నానని నమ్మించిన ప్రణయ్.. కొన్నిరోజుల తర్వాత జోగిపేటలోని బాలిక ఇంటికి వెళ్లి రెండుసార్లు లైంగికదాడి చేశాడు. తమ కుమార్తెపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలి కుటుంబసభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోక్సో చట్టంలోని 5, 6 సెక్షన్ల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, తన కొడుకు మానసిక పరిస్థితి బాగాలేదని, కావాలనే ఏదోచేశారని ప్రణయ్ తండ్రి పోలీస్‌స్టేషన్ వద్ద విలపించాడు.



గురువారం ఢిల్లీలోని ఈశా యోగా సెంటర్ వద్ద సుమారు 10 అడుగుల భారీ నాగుపాము (కింగ్ కోబ్రా) అందరినీ బెంబేలెత్తించింది. యోగా సెంటర్ వలంటీర్ ఒకరు ఆ పామును ఒడుపుగా పట్టుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనను స్థానికులు ఆసక్తిగా వీక్షించారు.






## శిరోజాల సంరక్షణకోసం..

- కోడిగుడ్డు తెల్లసొనలో రెండు టీ స్పూన్‌ల బోరిక్ పౌడర్ కలుపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు పట్టించి అరగంట తరువాత తలను శుభ్రపరుచుకోవాలి.
- వారానికి ఒకసారి ఇలా చేస్తూ ఉంటే జుట్టు కుదుళ్లకు మంచి పోషణ లభించి, శిరోజాలు నిగనిగలాడుతాయి.
- కొన్ని 'టీ' ఆకులు వేసి నీళ్లను మరిగించాలి. చల్లారిన తర్వాత తలకు పట్టించాలి.
- ఇలా చేస్తే జుట్టు రాలడం తగ్గుతుంది.
- తగినన్ని తులసి ఆకులను శుభ్రపరిచి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పేస్ట్‌ని జుట్టు కుదుళ్లకు పట్టించి ఆరిన తర్వాత కడిగేస్తే చర్మసమస్యలకు పరిష్కారం లభిస్తుంది.
- దీనివల్ల తలలో పేలు కూడా అరికట్టవచ్చు.
- నాలుగు 'టీ' స్పూన్ల నిమ్మరసంలో రెండు 'టీ' స్పూన్‌ల కొబ్బరి పాలు కలుపాలి.
- ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకంతటికీ పట్టించి అరగంట తరువాత తలస్నానం చేయాలి.
- పదిహేను రోజులకోసారి ఇలా చేస్తూ ఉంటే శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి.

నమస్తే తెలంగాణ WWW.NTNEWS.COM
/nt.zindagi
జిందగీ
శుక్రవారం 27 డిసెంబర్ 2019



# పార్టీకి వేళాయె!

ఏడాదిలో ఎన్ని పార్టీలు జరుపుకొన్నా.. అందులో న్యూఇయర్ పార్టీ ప్రత్యేకం. రోజూ పదిగంటలకే నిద్రపోయేవారు ఆ రోజు మాత్రం 12 గంటలు ఎప్పుడవుతుందా అని ఎదురుచూస్తుంటారు. లొకేషన్ మాత్రం ముందుగానే ప్లాన్ చేస్తారు. కానీ, ఆ రోజు ఏం ధరించాలా.. అని ఆలోచనలో పడతారు. ప్రత్యేకంగా జరుపుకొనే పార్టీకి మీరూ ప్రత్యేకంగా నిలువాలనుకుంటున్నారా? అయితే ఈ గౌన్‌లు ట్రై చేయండి.

అర్చితా నారాయణం
బంజారాహిల్స్, హైదరాబాద్
archithanarayanam@gmail.com

స్టైలిష్‌గా కనిపించేందుకు ఈ డ్రెస్ సరైనది. రఫుల్ స్లీవ్ జాకెట్‌కు జర్దోసి, ఎంబ్రాయిడరీ వర్క్ చేశాం. దీనికి జాకెట్‌కు జోడించి రాసిల్స్ నెట్, ఆర్గంజా ఫ్యాబ్రిక్‌తో ట్రాన్స్‌పరెంట్‌గా కుట్టాం. క్రేప్‌సిల్క్‌పై అద్దాలతో ఎంబ్రాయిడరీ వర్క్ చేశాం. ప్యాంట్‌కు మోకాళ్ల నుంచి ఫ్రిల్స్ కుట్టాం. దీంతో లుక్ అదిరిపోయింది.

మోడల్‌గా మెరిసేందుకు ఈ సారీగౌన్‌ను ఎంచుకోండి. టీల్ బ్లూ కలర్ కలిగున్న క్రేప్‌సిల్క్ ఫ్యాబ్రిక్‌తో గౌన్‌లా చుట్టేశాం. నెక్, భుజాలకు నెట్ ఫ్యాబ్రిక్‌ను ఎంచుకున్నాం. భుజం దగ్గర పూసలు, జర్దోసీలతో ఎంబ్రాయిడరీ వర్క్ చేశాం. గౌనంతా ప్లెయిన్‌గా ఉండి కాంట్రాస్ట్ కలర్‌తో వర్క్ చేసేసరికి మరింత అందం చేకూరింది.

ఎవరినైనా చిన్నపిల్లల్లా చూపించే డ్రెస్ గౌన్. నేలకు అనుకునే గౌన్‌లో ఎవరైనా అందంగా కనిపిస్తారు. నెట్, సాటిన్‌తో కుట్టిన గౌన్‌కు స్టోన్స్‌తో ఎంబ్రాయిడరీ వర్క్ చేశాం. హాఫ్ హ్యాండ్స్ ఇచ్చాం. నెక్ భిన్నంగా ఉండడంతో ఆకట్టుకుంటుంది.

మగువలు మెచ్చే కలర్ ఆలివ్ గ్రీన్‌తో పుట్టబొమ్మలా మెరిసిపోండి. నెట్, క్రేప్‌సిల్క్‌తో లేయర్లు లేయర్లుగా గౌన్ కుట్టాం. పై భాగాన హెవీగా ఎంబ్రాయిడరీ వర్క్ చేశాం. ఈ గౌన్‌లో హంసలా ఒదిగిపోవచ్చు.

పార్టీవేర్‌కు సరైన డ్రెస్. ఇంగ్లిష్ బ్లూ ధోతి. సాటిన్ ఫ్యాబ్రిక్‌తో ధోతి మోడల్‌లో కుట్టాం. దీనిపైకి షిఫాన్ ఓవర్‌కోట్ ఇచ్చాం. యాంకిల్స్ నుంచి భుజాల వరకూ వస్తుంది. ధోతీతో రెట్టింపు అందం వచ్చింది. స్టైలిష్ లుక్ వచ్చేందుకు ఓవర్‌కోట్‌పై పువ్వులుగా ఎంబ్రాయిడరీ వర్క్ చేశాం.

## సంప్రదాయ రుచులతో సంపాదన




**పల్లెటూరి రుచులకు దూరమవుతున్న నగరవాసులకు వాటిని అందించేందుకు శ్రీకారం చుట్టింది ఓ యువతి. కనుమరుగైన సంప్రదాయ ఆహార పదార్థాలను తయారు చేస్తూ నేటి తరానికి అలనాటి రుచులను పరిచయం చేస్తున్నది.**

కాస్త ఖరీదు ఎక్కువైనా పట్టణవాసులు మాత్రం ఇంటి రుచులనే కోరుకుంటున్నారు. స్టార్ హోటళ్లు, రెస్టారెంట్లలో దొరికే ఆహార పదార్థాలు పూర్తిగా రసాయనాలతో తయారు చేస్తున్నారు. వీటిని తిని పలు రోగాల బారిన పడుతున్నారు జనం. ఈ విషయాన్ని బెంగళూరుకు చెందిన పూజితా ప్రసాద్ అనే యువతి గమనించింది. అటువంటి వారి కోసం సహజసిద్ధంగా లభించే పదార్థాలతో పసందైన వంటకాలను అందించాలనుకున్నది. పూజితా ప్రసాద్ వారి అవసరాలను తీరుస్తూ సంప్రదాయ వంటకాలతో వ్యాపారం మొదలు పెట్టింది. దక్షిణ భారతదేశంలోని వంటకాలకు దేశ, విదేశాల్లో కూడా ఎంతో ఆదరణ ఉన్నది. అటువంటి సంప్రదాయ రుచులతోపాటు పలురకాల మసాలాలు అందరికీ అందించాలనే లక్ష్యంతో పూజితా ప్రసాద్ 'డెక్కన్ డైరీస్' పేరుతో వ్యాపారాన్ని ప్రారంభించింది. పూజితా తన వ్యాపార భాగస్వామితో కలిసి రూ.5లక్షల వ్యయంతో పలురకాల పొడులు, మసాలాలు తయారు చేసి అమ్మడం మొదలు పెట్టింది. ఆమె ఉత్పత్తులకు వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. కేవలం వేల రూపాయలతో మొదలు పెట్టిన వ్యాపారం ఏడాది కాలంలో రూ.లక్షల టర్నోవర్‌కు ఎదిగింది. ప్రముఖ ఈ-కామర్స్ వెబ్‌సైట్ అమెజాన్‌లో 'డెక్కన్ డైరీస్' ఉత్పత్తులను అమ్మడం మొదలు పెట్టింది. దీంతో మరింతగా ఆర్డర్లు పెరగడంతో మహిళలకు తన సంస్థలో ఉపాధి కల్పించింది. ఏడాదిలోనే పూజితా ఎన్నో వ్యాపార పాఠాలు నేర్చుకున్నది. పెట్టుబడి, కార్మికులు, డిమాండ్ వంటి అంశాలపై పట్టు సాధించింది. వీటి వల్ల తన వ్యాపారానికి ఎటువంటి నష్టం వాటిల్ల కుండా అప్రమత్తమైంది. 'భారతదేశంలో ప్రతి ఏటా సుగంధద్రవ్యాల వ్యాపారం రూ.40వేల కోట్ల మేర జరుగుతుంది, 2020నాటికి 18బిలియన్ డాలర్ల వరకూ పెరిగే అవకాశం ఉంటుందని పూజితా ప్రసాద్' చెబుతున్నది. 'నాణ్యమైన ఉత్పత్తులను విక్రయిస్తాం కాబట్టి తమ వ్యాపారం భవిష్యత్‌లోనూ మరింతగా పెరుగుతుందని' అంటున్నది పూజితా ప్రసాద్.

## పద్మాసనం ఎలా వేయాలి?



**ఈ ఆసనం** ఎలా వేయాలంటే.. రెండు కాళ్లను ముందుకు చాచి దండాసనంలో కూర్చోవాలి. కుడికాలును మోకాలు వద్ద ఉంచి రెండు చేతులతో పాదము తీసుకొని ఎడమ తొడ మొదలులో కుడి మడమ బొడ్డు దగ్గర ఉండేటట్లు చూసుకోవాలి. ఎడమ కాలిని మోకాలు వద్ద ఉంచి రెండు చేతులతో పాదములు తీసుకొని కుడి తొడ మొదలులో ఎడమ మడమ బొడ్డు దగ్గర ఉండేటట్లు చూసుకోవాలి. వెన్నెముక నిటారుగా ఉంచాలి. రెండు చేతులను చాచి ఎడమ చేయి ఎడమ మోకాలి వద్ద, కుడిచేయి కుడి మోకాలి వద్ద ఉంచాలి. బొటనవేళ్లను కలిపి మిగిలిన మూడు వేళ్లను చాచి ఉంచాలి. లేకుంటే అరచేతులను ఒకదాని మీద ఒకటి వచ్చేలా రెండు పాదాల దగ్గర ఉంచాలి. కాళ్లస్థితిని మార్చి అంటే.. ఎడమ పాదానికి కుడితొడ మీద, కుడిపాదాన్ని ఎడమతొడ మీద వచ్చేలా చేయాలి. రెండు కాళ్లు సమానంగా పెట్టాలి. కింద కూర్చోవడం అలవాటు లేనివారికి ఈ ఆసనం వేసేటప్పుడు విపరీతమైన నొప్పి మోకాళ్ల వద్ద కలుగుతుందని యోగా గురువులు చెబుతున్నారు. కానీ నొప్పిని తట్టుకొని శ్రద్ధగా సాధన చేస్తే నొప్పి క్రమంగా తగ్గిపోయి హాయిగా ఉంటుంది. ఇలా చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు. మొదట మోకాళ్ళనొప్పులు తగ్గిపోతాయట. మనస్సు ప్రశాంతంగా ఉండడమే కాకుండా ఉత్సాహం వస్తుంది. జీర్ణవ్యవస్థ, ఉదర భాగంలోని అవయవాలన్నీ బాగా పని చేస్తాయంటున్నారు యోగా గురువులు.

సిరిముగ్గు



19 చుక్కలు
మధ్యచుక్క
10 వచ్చేవరకు



**ఆర్. విజయలక్ష్మి,**
4వ ఎన్‌జీవోస్ కాలనీ,
నిజామాబాద్.

**ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:**
సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9, కృష్ణాపురం,
బంజారాహిల్స్,
రోడ్ నం-10, హైదరాబాద్ -500034.
zindagi.nt@gmail.com

## అనాథకు అండగా నిలిచి..



**ఎటువంటి బంధం లేక పోయినా ఆ యువకునికి ఆమె సాయం అందించేందుకు ముందుకు వచ్చింది. మానవత్వమే తన మతమంటూ ఓ అనాథకు కిడ్నీ దానం చేసి ఔదార్యాన్ని చాటుకున్నదీమె.**

కేరళకు చెందిన 47 ఏండ్ల సీతా దిలీప్ ఏ బంధం లేక పోయినా ఓ అనాథ యువకునికి కిడ్నీ దానం చేసి బతికించింది. ఈ కాలంలో అయిన వాళ్లే ఆపదలో ఆదుకోలేకపోతున్నారు. అటువంటి సమాజంలో మానవత్వం పూర్తిగా నశించలేదని చెప్పడానికి సీత ఉదాహరణగా నిలుస్తున్నది. తాను సాయం చేసి ఎంతోమందికి ఆదర్శమయింది. సీత ముంబైలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేసేది. ఆమె భర్త అబుదాబిలో పని చేసేవాడు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. 11 ఏండ్ల పాటు భార్యా, భర్తలిద్దరూ చెరొక చోట ఉద్యోగం చేశారు. తమ పిల్లల్ని బాగా చదివించుకునేందుకు ఎంతో కష్ట పడ్డారు. ఆ తర్వాత కేరళలోని సొంత గ్రామంలో స్థిరపడ్డారు. కొన్నాళ్లకు సీత దయచారిటబుల్ ట్రస్ట్‌లో ఉద్యోగిగా చేరింది. అప్పటికే అనాథ అయిన జయకృష్ణన్ అనే 19 ఏండ్ల యువకుడు మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. గత ఐదేండ్ల నుంచి అతను డయాలసిస్ చేయించుకుని తన ప్రాణాలను నిలబెట్టుకుంటున్నాడు. జయకృష్ణన్ బతకాలంటే తప్పనిసరిగా మూత్రపిండాల మార్పిడి చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. అందుకోసం ఎవరో ఒకరు కిడ్నీ దాతలు అవసరం. కిడ్నీ దాతల కోసం దయచారిటబుల్ ట్రస్ట్‌ను ఆశ్రయించాడు జయకృష్ణన్. ఈ ట్రస్టులో ఉద్యోగిగా పని చేస్తున్న సీత అతని పరిస్థితిని గమనించింది. అతనికి తన కిడ్నీ ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. ఆపరేషన్ చేయాలంటే దాదాపు రూ.15లక్షలు అవసరం. అంత డబ్బు సమకూర్చుకునే స్థోమత జయకృష్ణన్‌కు లేదు. దీంతో సీత కుటుంబ సభ్యులందరూ కలిసి జయకృష్ణన్ ఆపరేషన్‌కు అవసరమైన ఆర్థిక సాయాన్ని సమకూర్చేందుకు ముందుకువచ్చారు. వారి బంధువులు, స్నేహితుల వద్ద నుంచి సేకరించి చికిత్సకు అవసరమైన మొత్తాన్ని అందించారు. అనాథ యువకునికి తన కిడ్నీ దానం చేయడమేకాకుండా చికిత్సకు అవసరమైన డబ్బునూ సమకూర్చిన సీతను అందరూ ప్రశంసిస్తున్నారు. 'అతనికి చిన్న వయసులో ఇటువంటి జబ్బు రావడం నాకు ఎంతో బాధ కలిగించింది. మానవత్వంతో జయకృష్ణన్‌ను ఆదుకోవాలనుకున్నానని' ఆమె చెబుతున్నది.

నమస్తే తెలంగాణ
శాస్త్ర
[ కరీంనగర్ ]
శుక్రవారం 27 డిసెంబర్ 2019

విశ్వవిచిత్రాలు

## భారీసైజు ధూళి బుడగలు



**మన పాలపుంత** కేంద్రంలోని కాల బిలం నుంచి వెలువడుతున్నట్టుగా భావిస్తున్న భారీ సైజు ధూళి బుడగలను శాస్త్రవేత్తలు ఇటీవల గుర్తించారు. 2010లో 'ఫెర్మీ స్పేస్ టెలిస్కోపు' అందించిన చిత్రాల సహాయంతో పసిగట్టిన ఈ బుడగల నిర్మాణాలే ప్రస్తుతానికి మన పాలపుంతకు సంబంధించినంత వరకు 'అతిపెద్దవి'గా వారు నిర్ధారించారు. ఒక ప్రత్యేక తరంగ దైర్ఘ్య కాంతిలోనే చూడగల వీటిలో ఒక్కోదాని పొడవు అంతరిక్షంలో కనీసం 25,000 కాంతి సంవత్సరాల దూరాన్ని ఆక్రమించినట్లు వారు తెలిపారు. ఇది మన మొత్తం పాలపుంత వెడల్పులోనే నాలుగో వంతు కావడం విశేషం.

## 50,000 ఏండ్లనాటి సముద్ర బిలాలు

సముద్రవిజ్ఞానశాస్త్రం

**సముద్రగర్భ నేలలో వేలసంఖ్యలో బయట పడిన బిలాలు శాస్త్రవేత్తలకు పెద్ద మిస్టరీగా మారాయి. చెత్తా చెదారాలు, సాగరజీవులకు ఆశ్రయమిస్తున్న ఈ రంధ్రాలు ఇటీవలే వెలుగులోకి వచ్చాయి.**



**క్యాలిఫోర్నియాలోని** బిగ్ సర్ (Big Sur) తీరప్రాంతానికి చెందిన పసిఫిక్ మహాసముద్ర గర్భనేలంలో సుమారు 15,000 సంఖ్యలో బిలాలు (రంధ్రాలు) తాజాగా బయటపడ్డాయి. అక్కడి మోంటెరే బే ఎక్వేరియమ్ రీసర్చి ఇన్‌స్టిట్యూట్ (Monterey Bay Aquarium Research Institute: MBARI) పరిశోధకులు వీటిని కనుగొన్నారు. నిజానికి ఇవి 1999లోనే వెలుగుచూసినట్లు వారు భావిస్తున్నారు. సగటున 11 మీటర్ల (36 అడుగులు) చుట్టుకొలత, 1 మీటరు (3 అడుగులు) లోతు బిలాలు ఎక్కువ సంఖ్యలో ఉండగా, 175 వరకు రంధ్రాలు ఎంతో పెద్దవని (574 అడుగుల చుట్టుకొలత, 16 అడుగుల లోతు) వారంటున్నారు. నౌకలమీది సోనార్ పరికరాలు వీటిని గుర్తించి చాలా కాలమే (1999) అవుతున్నా ఇటీవలె వార్తల్లోకి వచ్చాయి. వీటిలో సుమారు 5,200 బిలాలైతే సుమారు 1,300 చ.కి.మీ. (500 చ.మైళ్లు) మేర స్థలంలో విస్తరించినట్లు చెబుతున్నారు. సాగరగర్భంలోంచి మిథేన్ వాయువు బుడగల వల్ల ఇవి ఏర్పడి ఉంటాయని తొలుత భావించినా పై పరిశోధకులకు ఆ ఆధారాలేమీ లభించలేదు. కొన్ని పెద్ద బిలాలైతే సుమారు 50,000 సంవత్సరాలుగా మనుగడలో ఉంటున్నట్టుందని, వీటిపై మరింత లోతైన పరిశోధనలు అవసమని వారంటున్నారు. '2019 ఫాల్ మీటింగ్ ఆఫ్ ది అమెరికన్ జియోఫిజికల్ యూనియన్' సమావేశాల్లో ఈ పరిశోధనను ప్రవేశపెట్టారు.

**మానవ'స్పృహ' చిక్కుముడిని విప్పాలన్న శాస్త్రవేత్తల ప్రయత్నాలు ఇటీవలి కాలంలో గాడిన పడుతున్నాయి. మనిషిలోని 'చైతన్యం' కంటికి కనిపించదు. కారణం, ఇది పదార్థ రహితమైంది (Non metarial) కాబట్టి. మరి, ఇదెలా ఆవిర్భవిస్తున్నది? ఇదే ఇక్కడ మిస్టరీ. 'దీపం ప్రభావమే దాని చుట్టూ వెలుగులా పరచుకొంటున్నట్లు' ప్రతీ పదార్థానికీ దానిదైన ఏదో ఒక ప్రభావం తప్పక ఉంటుంది. మరి, 'మనం తెలివిలో ఉండడానికి దోహదపడుతున్న జీవపదార్థమేది? అదెక్కడున్నది?' అన్నది లోతైన పరిశోధనల్లోనే తేలాలి. దీనిని నెరవేర్చే దిశగానే ఇటీవల కొన్ని అధ్యయనాలు, శాస్త్రీయాంశాలు వెలుగుచూశాయి. ఆ విశేషాలే ఇక్కడ చదువండి.**

నాడీశాస్త్రం

# స్పృహోదయం!

స్కానింగ్‌లలో లభ్యమైన స్థిర సంకేతాలు | చిక్కుముడిని విప్పే దిశగా పలు పరిశోధనలు | భావోద్వేగాల పాత్ర తక్కువదేమీ కాదు!

**నరుల** నరాల నదులలో ప్రవహించే చైతన్యానికి కేంద్ర స్థానం మెదడు. ఇదే జీవశక్తికి మూలాధారం. ఇక్కడ్నించి శరీర అంతరిక్షం నిండా ఆవరించిన నాడీకణాల గుణాల ద్వారానే 'స్పృహోదయం' జరుగుతుందన్నది శాస్త్రవేత్తలకు చూచాయగా తెలిసిపోయింది. అదెలా అన్నదే ఇక్కడ 'అభిజ్ఞాన (జ్ఞాపకశక్తి) రహస్య'మైంది. మనిషిని ఈ అజ్ఞానంలోంచి బయటపడేలా చేయాలన్న వారి చిరకాల స్వప్నం నిజమయ్యే దిశగా ఇప్పుడిప్పుడే 'అడుగులు' పడుతున్నాయి. ఈ మేరకు ఆశావహ ఫలితాలూ వస్తున్నాయి. నిజానికి 'పదార్థానికి అతీతమైన' (అభౌతికం/ మెటాఫిజిక్స్) మానసిక సాధకులకు ఇది అనుభవ జ్ఞానమేనని అనేక మంది తాత్వికుల నమ్మకం. భౌతికాధారభూతమైన ప్రస్తుత శాస్త్రలోకం 'పదార్థ ప్రభావిత శక్తుల్ని' విశ్వసించగలిగే పరిస్థితులు నెమ్మదిగా వస్తున్నాయి కూడా. ఇందులో భాగమే తాజా పరిశోధనా స్రవంతి.

జీవ చేతనత్వం, ప్రత్యేకించి మనిషిలోని జాగరూకత (consciousness) కు మూలం ఏది, ఎక్కడుంది? మనిషితో పాటు సమస్త జీవకోటిలోనూ పుట్టుకతోనే నాడీకణాలలోకి ఈ 'స్పృహ' (ప్రాణశక్తి) ఎలా ప్రవేశిస్తుంది? అదెలా స్థిరపడుతుంది? ఒక్కసారి తట్టి లేపగానే (ఉదా॥కు నిద్రపోయే వారిని) ఠక్కున 'మేల్కొనేంత' అప్రమత్త (చురుకుదనం) స్థాయిలో అది మనుషులలో (ఇంకా అనేక జీవజాతులలోనూ) జీవిత పర్యంతం ఏ రకంగా కొనసాగగలుగుతున్నది? మనలోని ఈ 'చైతన్యానికి' వాహకం మనసు (mind) అయితే, ఈ మదిజ్ఞానం దేనివల్ల అనుభవంలోకి వస్తున్నది? నిజానికి ఇదంతా అభౌతికమే అయినా, ఈ 'మానసిక విజ్ఞానాన్ని' కూడా ఒక సైన్సుగానే ప్రధాన స్రవంతిలోని శాస్త్రవేత్తలు పరిగణిస్తున్నారు. 'మనసు అంటే, హృదయమా (గుండె)? మస్తిష్కమా?' అనే సందేహమూ కొందరికి లేకపోలేదు. కానీ, గుండెలో ఏ విధమైన నాడీకణ సంకేతాలూ, ఆదేశాలూ, నియంత్రణలూ ఉత్పన్నం కావు కనుక, మెదడులోనే ఈ మిస్టరీ అంతా దాగున్నట్టు పలువురు శాస్త్రవేత్తలు గత కొన్నేండ్లుగా ఒక స్థిర నిర్ధారణకు వచ్చారు.

ప్రత్యేకించి మానవుని మెదడులో ఈ 'స్పృహ' ఎక్కడ, ఎలా ఉద్భవిస్తుందన్నది వేల సంవత్సరాలుగా అంతుబట్టని పరమ రహస్యంగానే ఉంటున్నది. మొత్తం 'సృష్టి రహస్యాని'కి ఈ 'స్పృహ రహస్యమే' మూలాధారం కావచ్చు కూడా. స్పృహ నుంచి సృష్టివరకు ఒకే ఒక 'చైతన్యశక్తి' కాలాన్ని నడిపిస్తున్నదన్న




భావనను భారతీయ తాత్వికులూ, ఆధ్యాత్మిక వేత్తలూ చాలాకాలంగా నమ్ముతున్నారు. అండపిండ బ్రహ్మాండాలనిండా వ్యాపించి, అదే పనిగా విస్తరిస్తున్న జగత్తుకంతటికీ మూలం ఈ 'బ్రహ్మరహస్యమే' (విశ్వశక్తి)నని కూడా వారంటారు. అనూహ్య రీతిలో మన బుర్రకు 'బుద్ధి'నిస్తున్న ఈ 'మాయ' (శక్తి)ను బోధపరచుకోగలిగితే యావత్ 'విశ్వ చేతనాశక్తి' సిద్ధాంతరూపానికి వస్తుందన్నది కొందరి ఆలోచన. మన స్పృహకు, విశ్వసృష్టికి మధ్య ఉన్న ఈ అద్భుతమైన అవినాభావ సంబంధమేమిటో అప్పుడు తప్పక అర్థమవుతుంది.

సుమారు గత వెయ్యేళ్లుగా ఆధునిక శాస్త్రవేత్తలకు అందని ఇందులోని భౌతిక ఆధారాలనే కొందరు శాస్త్రవేత్తలు గత కొన్నాళ్లుగా వెలుగులోకి తెస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో వారి అంచనాను వెల్లడించే, బలపరిచే శాస్త్రీయాధారాలే తాజాగా వెలుగులోకి వచ్చాయి. ప్రాణశక్తికి ప్రత్యక్ష ప్రతీక వంటి ఈ 'ఎరుక' మెదడులోని బిలియన్ల కొద్దీ నాడీకణాలు, దేహానికి చెందిన వేలాది నరాల సమూహాల నడుమ నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుందన్న సత్యాన్ని అవి ఆవిష్కరించాయి. మనిషిలో మిగిలిన అవయవాలన్నీ పనిచేస్తున్నా ఒక్క 'మెదడు చైతన్యమే' కనుక లేకపోతే, ఆ అపస్మారక స్థితి (Unconsciousness) జీవచ్ఛవం వంటిదే అవుతుంది. అలా కాని ఈ 'స్మారక స్థితి'ని సజీవంగా నిలిపివుంచడంలో మనసులో ఉత్పన్నమయ్యే భావోద్వేగాలూ కొంత వరకు కీలకభూమికనే పోషిస్తున్నట్టు ఈ సందర్భంగా వెల్లడైంది.

మెదడు స్కానింగ్‌లద్వారా 'స్పృహ'కు మూలమైన అంతుచిక్కని సంకేతాలను శాస్త్రవేత్తలు సరికొత్తగా చిత్రీకరించగలిగారు. 'సైన్స్ అడ్వాన్సెస్' గత (2019) ఫిబ్రవరి ఆన్‌లైన్ సంచికలో ప్రచురితమైన ఈ అరుదైన, ప్రతిష్ఠాత్మకమైన పరిశోధనలో ఆసక్తికరమైన ఫలితమే వెలుగుచూసింది. 'స్మారకంలో ఉన్నవారికి, లేనివారికి నడుమ మెదడులో సంభవించిన ప్రధాన తేడాలను ఆ స్కానింగ్ చిత్రాలు చాలా స్పష్టంగా, గతంలో ఎన్నడూ లేనంత విశ్వసనీయంగా నిరూపించినట్లు పరిశోధకులు ప్రకటించారు. ఒక అంతర్జాతీయ బృందం నాయకత్వంలో జరిగిన ఈ కీలకాధ్యయనంలో 'స్పృహతో కూడిన మస్తిష్క కార్యకలాపాలు నమోదైన తీరు పలువురు నిపుణులనే ఆశ్చర్యపరుస్తున్నది. అత్యంత క్లిష్టమైన నమూనాగా చేతనాత్మక స్థితి సంకేత సంతకాలను వారు ఇలా శాస్త్రీయం (ఇంతటి నాణ్యతతో)గా సాధించగలగడం విశేషం. ఫలితంగా స్పృహలో లేని పేషెంట్ల దయనీయ స్థితిని వైద్యులు అర్థం చేసుకోగలుగుతారని వారంటున్నారు. ఎరుకలో వున్న మెదళ్లలోని ఈ సంకేతాలు చాలా విస్తృతస్థాయిలో ఉండగా, స్పృహలో లేనవారి మస్తిష్క సంకేతాలు మాత్రం ఎంతో తేలికస్థాయిలో ఉన్నాయి.

'పదార్థేతరమైన అభిజ్ఞాన శక్తి' (Cognitive Power) ఇలా ఎంఆర్‌ఐ స్కానింగ్‌లకు అందడం నిజంగా విశేషమే. ఇదివరకు కొందరు శాస్త్రవేత్తలు మెదడులోని 'స్పృహ'తీరును ఇతర శాస్త్రీయ విధానాలతో కొలిచే పరిశోధనాత్మక ప్రయత్నాలు జరిపినప్పటికీ, ప్రస్తుత ఈ అధ్యయనమంత ఖచ్చితత్వం వాటిలో సాధ్యం కాలేదన్న అభిప్రాయం పై శాస్త్రవేత్తల్లో వ్యక్తమవుతున్నది. ''ఈ కొత్త ఫలితం అత్యంత స్పష్టంగా, నమ్మదగిందిగా ఉంది. నేరుగా వైద్య ప్రక్రియలోని నాడీ విజ్ఞానశాస్త్రంతోనే ఇది ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉన్నది'' అని పోర్ట్‌ల్యాండ్ (ఆరెగాన్)లోని రీడ్ కాలేజ్ (Reed College) అభిజ్ఞాన నాడీశాస్త్రవేత్త (కాగ్నిటివ్ న్యూరో సైంటిస్ట్) మైఖేల్ పిట్స్ అన్నారు. ''మెదడులో స్పృహ జనిస్తున్న విధానం అత్యంత మృదుభావన (Squishy concept) తో ఉన్నది. సాధారణంగా మనం నిద్రపోయేటప్పుడు దానిని (స్పృహను) కొద్దిగా కోల్పోతాం. ప్రమాదాలలో లేదా మత్తుమందు ప్రయోగాలలో అయితే, అది తాత్కాలికం (అపస్మారకంలోకి వెళ్లడం)గా తప్పుకుంటుంది'' అని ఆయనంటారు.

ప్యారిస్, న్యూయార్క్, లీజ్ (బెల్జియం)లలోని వివిధ రీసర్చి ఇన్‌స్టిట్యూట్స్‌లలో జరిగిన ఈ పరిశోధనలో 125 మంది ప్రజలు పాల్గొన్నారు. ఎంఆర్‌ఐ స్కానింగ్ మెషీన్లలో వారు నిర్దిష్ట సమయం పాటు విశ్రాంతిగా గడిపిన తర్వాత సేకరించిన డేటాను శాస్త్రవేత్తలు లోతుగా విశ్లేషించారు. వారిలో 47 మంది ఆరోగ్యవంతులు. మిగిలిన వారికి స్పృహ పూర్తిగా లేకపోవడం లేదా పాక్షికంగా లోపించడం (ఉదా॥కు కళ్లు తెరిచి చూస్తూ కూడా కొందరు అసలు ధ్యాసలో ఉండకపోవడం, మరికొందరు ఆదేశించాకే తమ కండ్లను మూసుకోవడం) వంటి అపస్మారక స్థితి (కోమా)లో ఉన్నారు. దీని ఫలితంగా రెండు విభిన్నమైన స్కానింగ్ నమూనాలు వచ్చాయని, (మరో రెండు రకాల స్కానింగ్ ఫలితాలు వచ్చినా అవి స్పృహతో సంబంధం లేనివి) స్పృహలో వున్న (ఆరోగ్యవంతులు) ఒక వర్గం వాటిలో నాడీభాగాలు చురుగ్గా స్పందిస్తుండడం, అపస్మారకంలోని మరొక వర్గం వాటిలో బలహీనంగా, దాదాపు స్పందన లేకపోవడం స్పష్టంగా నమోదైంది.

ఇదే సమయంలో స్పృహకు సంబంధించి మరి కొందరు ప్రసిద్ధ సైన్సు రచయితలు మన మనసును కట్టి పడేసే శాస్త్రీయాంశాలను తమ రచనల ద్వారా తెలియపరిచారు. మస్తిష్కపు అసాధారణ పనితనాలను, స్పృహ ఆవిర్భవించే తీరుతెన్నులను వారు వివరించారు. 'మెదడు-దేహ సంబంధాని'కి గతంలోకంటే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వక తప్పని పరిస్థితి ఇప్పుడు ఏర్పడుతున్నట్టు వారు ఈ సందర్భంగా వెల్లడించారు. శాస్త్రవేత్తలకు మానవ శరీరంలో అత్యంత సంక్లిష్టమైన, అర్థం కాని మిస్టరీ అవయవం ఏదైనా ఉందా అంటే అది మెదడు మాత్రమే. మెదడులో మొత్తం సుమారు 100 బిలియన్ (10,000 కోట్లు) నాడీకణాలు ఉండగా, ప్రతీ ఒక్కటీ దేహంలోని సుమారు 10,000 ఇతర నాడీ సమూహాలతో అంత:సంబంధాలను నెరిపే (సంకేతాల మార్పిడి) సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని వారు తెలిపారు.

మెదడు, దాని పనితనం, స్పృహ నెలకొనే తీరుపై పలు విజ్ఞాన శాస్త్ర పుస్తకాలు రాసిన పై సైన్సు రచయితలు 'ఇందులోనూ ఇంకా పూర్తి స్పష్టతను సాధించవలసి ఉందని' అంటున్నారు. 'ఈ నాడీ సంబంధ కార్యకలాపాలే మన 'మనసు'ను ఉత్థాన పరుస్తాయి. ఫలితంగానే మనకు సంతోషాలు, బాధలు, జ్ఞాపకాలు, కోర్కెలు, ఆకాంక్షలు, వ్యక్తిగత ఉనికి, స్వేచ్ఛా సంకల్పం వంటివన్నీ సిద్ధిస్తాయి. ఇవన్నీ మనలో ఒక ప్రవర్తనా రూపంలో వ్యక్తమవుతాయి' అని వారంటున్నారు.

**దోర్బల బాలశేఖరశర్మ**

### మెదడుకు, మనసుకు మధ్య..



*ప్రపంచవ్యాప్తంగా సుప్రసిద్ధమైన సైన్సు రచయితలు కొందరు ఇటీవలి కాలంలో స్పృహపై చాలా లోతైన, నాణ్యమైన పరిశోధనాత్మక పుస్తకాలను వెలువరిస్తున్నారు. వాటిలో ఫ్రాన్సిస్ క్రిక్ (అస్టానిషింగ్ హైపాథెసిస్), క్రిస్టోఫ్ కోచ్ (ది ఫీలింగ్ ఆఫ్ లైఫ్ ఇట్‌సెల్ఫ్), డోనాల్డ్ డి.హోఫ్‌మ్యాన్ (ది కేస్ అగెనెస్ట్ రియాలిటీ) వంటివి ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే 'మెదడును హార్డ్‌వేర్‌గా, మనసును సాఫ్ట్‌వేర్'గా క్రిస్టోఫ్ కోచ్ అభివర్ణించారు. ఈ రెండింటి మధ్యగల జీవాణువుల ప్రభావాన్ని తెలుసుకోగలగడం ద్వారానే 'స్పృహ రహస్యం' వెల్లడవుతుందని ఆయనంటున్నారు. అమెరికా రాష్ట్రం విస్కాన్సిన్ రాజధాని మ్యాడిసన్‌లోని 'యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్'కు చెందిన నాడీ శాస్త్రవేత్త (న్యూరోసైంటిస్ట్) జ్యూలియో టొనోని (Giulio Tononi) స్పృహ కొలమాని (consciousness meter: పరికరం)ని పరిశోధనల కోసం రూపొందించినట్టు తెలుస్తున్నది. దీని ఆధారంగా మెదడులో ఉత్పన్నమయ్యే స్మృతి (స్పృహ) స్థాయిని కొలువవచ్చునని శాస్త్రవేత్తలు అంటున్నారు.*

జీవశాస్త్రం

## చెట్టు పురుగు గుట్టురట్టు!

**విచిత్రమైన చెట్టు పురుగు 'ట్రీహాపర్' వీపుపై పెరిగే 'హెల్మెట్లు' (మోపురాల వంటివి) 'నిజానికి రెక్కలు కావు' అన్న సంగతిని శాస్త్రవేత్తలు బలపరిచారు. అయితే, 'ఇవి రెక్కల జన్యువుల ఆధారంగానే పెరుగుతున్నట్టు' వారు తేల్చారు.**



**ఉష్ణమండల** ప్రాంతాల చెట్లపై ఎక్కువగా కనిపించే ట్రీహాపర్ (Treehoppers) కీటక జాతులు సుమారు 3,300 ఉంటాయని అంచనా. పెద్ద కీటకాలు, జంతువుల దాడుల నుండి తమను తాము రక్షించుకోవడానికి ఇవి తమ వీపుమీది 'హెల్మెట్ల' (వీపుపై పెరిగే భాగాలు) నిర్మాణాలను చిత్రవిచిత్ర ఆకారాలలోకి మార్చేసుకొంటాయి. వాటిలో ముండ్లు, ఆకులు, విసర్జితాలు, నల్లులు, చీమలు, కందిరీగల వంటి రూపాలుంటాయి. సమయాన్నిబట్టి అవి ఏ విచిత్ర, వికారాకారంలోకి మారుతాయో ఎవరికీ తెలియదు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ క్యాలికట్‌కు చెందిన జీవ పరిశోధకులు ఈ 'హెల్మెట్ల' జన్యువులపైనే తాజాగా విశ్లేషణ జరిపి, అత్యంత కీలకమైన ఫలితాన్ని వెల్లడించారు.

ఈ చెట్టు పురుగుల వీపుపై మొలిచే 'హెల్మెట్లు' రెక్కలు కావచ్చునని తొలుత శాస్త్రవేత్తలు అనుకొన్నారు. కానీ, అవి విచ్చుకోవు. దీనితో అవి రెక్కలా, కావా అన్న సంగతి సుదీర్ఘకాలంగా మిస్టరీగా ఉండింది. 2011లో 'ఇవి ఆధునీకరణకు గురైన రెక్కలు అయి ఉంటాయన్న' ఒక సూత్రీకరణను ఫ్రాన్స్‌కు చెందిన బెంజమిన్ ప్రూడ్'హోమ్ (Benjamin Prud'homme) రీసర్చి లాబొరేటరీ పరిశోధకులు ప్రకటించారు. ఒకవేళ అదే నిజమైతే, వాటి పరిణామక్రమం మరిన్ని లోతైన సూత్రాలతో ముడిపడి ఉండేదని శాస్త్రవేత్తలు భావించారు. ఈ పురుగు రొమ్ముభాగం పైన లేదా శరీరం మధ్యభాగంలో మూడోశ్రేణికి చెందిన రెక్కలుగా ఇవి (హెల్మెట్లు) మొలిచి వుంటాయని మరి కొందరు పరిశోధకులు ఊహించారు. ఒక దశలో ఈ కారణంగా గడచిన సుమారు 250 మిలియన్ సంవత్సరాల కాలంలో ఇలాంటి రెక్కలుగల 'తొలి కీటకాలు' ఇవే అయి ఉంటాయని కూడా వారు తెలిపారు. ఈ నేపథ్యంలోనే క్యాలికట్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ట్రీహాపర్ 'హెల్మెట్ల' జన్యు సమాచారాన్ని విశ్లేషించి, 'ఈ మేరకు అవి రెక్కలు కావని, రెక్కల జన్యువులతోనే ఏర్పడుతున్న నిర్మాణాలు అని' తేల్చారు. దీంతో ఈ మిస్టరీ ఇక వీడినట్టుగా కూడా పలువురు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.'నేచర్ ఎకాలొజీ అండ్ ఎవొల్యూషన్' ఆన్‌లైన్ పత్రికలో ఇటీవల ఈ పరిశోధన ప్రచురితమైంది.

పురాజీవ శాస్త్రం

## ప్రాచీన లంగ్‌ఫిష్ శిలాజాలు

**నలభై ఒక్క కోట్ల సంవత్సరాల కిందటి లంగ్‌ఫిష్ శిలాజాలను శాస్త్రవేత్తలు దక్షిణాఫ్రికాలో కనుగొన్నారు. ఇది వందల కోట్ల ఏండ్ల క్రితం నాటి గోండ్వానా మహాఖండం కాలానికి చెందిన అత్యంత అరుదైన జాతికి చెందినదిగా వారు చెబుతున్నారు.**



**గోండ్వానా** (ఆస్ట్రేలియా) మహాఖండం నాటి అఖాత జలాలలో సుమారు 410 మిలియన్ (41 కోట్లు) సంవత్సరాల కిందటి డెవోనియన్ (Devonian) కాలంలో జీవించినట్లుగా భావిస్తున్న డిప్నోయ్ (Dipnoi) ఉపతరగతికి చెందిన లంగ్‌ఫిష్‌లు సుమారు 25కు మించిన జాతులు ఆనాడు ఉండేవని శాస్త్రవేత్తలు అంటున్నారు. వీటిలోని ఇంకా కొన్ని జాతులు ఉష్ణమండల, ఉపోష్ణమండల ప్రాంతాలైన చైనా, మొరొకో జలాలలో నివసించినట్లుకూడా వారు భావిస్తున్నారు. కొత్తగా కనుగొన్న శిలాజాలుగా భావిస్తున్న లంగ్‌ఫిష్‌ల జాతులు మాత్రం పశ్చిమాది గోండ్వానా (దక్షిణ అమెరికా, దక్షణాఫ్రికా)కు చెందినవిగా వారు చెబుతున్నారు. అప్పట్లో డిప్నోయ్ ఉపతరగతికి చెందిన చేపల జాతులు సుమారు 100 వరకు ఉన్నట్టు కూడా చరిత్ర చెబుతున్నది. ప్రస్తుత కొత్త 'ఊపిరితిత్తుల చేప' (లంగ్‌ఫిష్: ఒకటి లేదా రెండు శ్వాసకోశాలను కలిగివున్నవి)ను ఇస్యూంజీ మ్లొమొమ్డే (Isityumzi mlomomde) గా శాస్త్రవేత్తలు పిలుస్తున్నారు. మొరొకో (ఉత్తర అమెరికా) నుంచి సుమారు 10,000 కి.మీ.దూరంలో దక్షిణాఫ్రికాలో కొత్త చేప శిలాజాల్ని వారు కనుగొన్నారు. 1997-2007 మధ్య కాలంలోనే కనుగొన్న వీటి పరిశోధనా ఫలితాలు ఇటీవల వెలువడ్డాయి. అప్పట్లో దక్షిణాఫ్రికా ప్రాంతమంతా భూమి దక్షిణ ధ్రువానికి సమీపంలో ఉండేదని చెబుతున్నారు. ఈ పరిశోధన పీర్‌జే (PeerJ) పత్రికలో ప్రచురితమైంది.

శాస్త్రీయం

## పరిశోధనా స్ఫూర్తి ఎక్కడ?

**'27వ జాతీయ బాలల విజ్ఞానశాస్త్ర సదస్సు' (National Children's Science Congress: NCSC) కేరళ రాజధాని తిరువనంతపురంలో నేటి (ఈ నెల 27వ తేది) నుంచి మొదలవుతున్నది. ఈ నెలాఖరు (31వ తేది) వరకు అయిదు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలు దేశంలోని బాలల ప్రతిభను చాటే అరుదైన అవకాశంగా చెప్పాలి. ఈ సందర్భంగా పిల్లలలో శాస్త్రీయ స్పృహను, పరిశోధనా స్ఫూర్తిని గుర్తుచేసే చిన్న ప్రస్తావన.**

**ఎన్‌సీఎస్‌టీసీ** (నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ), కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ (డీఎస్‌టీ) ఆధ్వర్యంలో ఈ 'సైన్స్ కాంగ్రెస్' 2014 నుంచీ జరుగుతున్నది. జిల్లా, రాష్ట్రాల స్థాయిలో 10-17 సంవత్సరాల మధ్య వయస్కులైన విద్యార్థులు తమ సృజనాత్మక, వినూత్న, ప్రత్యేక విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలతో ఇందులో పాల్గొంటారు. వారు రూపొందించే శాస్త్రీయాంశాలు స్థానిక ప్రజల అవసరాలు, సమాజ సమస్యల పరిష్కారాల నేపథ్యంలోనే ఉండాలన్నది నియమం. ఈ సమావేశాలలో పాల్గొనే విద్యార్థులను ఆయా రాష్ట్రాల నుంచి ఎంపిక చేస్తారు. దీనిని ఈనెల మొదటివారంలో పూర్తి చేసినట్లు తెలుస్తున్నది. ఉదా॥కు నాగ్‌పూర్‌లో మొత్తం 70 ప్రాజెక్టులు పిల్లల నుంచి ప్రతిపాదనలు రాగా, వారిలో ఏడుగురిని ఎంపిక చేశారని తెలిసింది. ఇందులో పాల్గొనే విద్యార్థులను 'బాల శాస్త్రవేత్తలు'గా గుర్తిస్తారు.

ప్రతీ ఏడాది జరుగబోయే కాంగ్రెస్ కోసం ప్రాజెక్ట్ అంశాన్ని, ఉపాంశాన్ని ముందుగానే ప్రకటిస్తారు. నిజానికి 'చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్'ను జాతీయస్థాయిలో 1993లోనే స్థాపించారు. అప్పట్నుంచీ విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్ర రంగంపట్ల అవగాహనను పెంపొందించడమే లక్ష్యంగా వివిధ రకాల కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. సదస్సులో పాల్గొనాలనుకొనే పిల్లలు కచ్చితంగా స్కూలు విద్యార్థులే అయి వుండాలన్న నిబంధన కూడా ఏమీ లేదు. రెండు రకాల వయోపరిమితి (1-14 సం॥ల లోపు, 14 సం॥ల పైన 17 సం॥ల లోపు) బృందాలుగా వారిని విభజించి, ఈ మేరకు అర్హతలను నిర్ణయించారు. ప్రతీ సంవత్సరం డిసెంబర్ నెలను ప్రాతిపదికగా తీసుకొంటారు.



మన దేశంలో జాతీయ స్థాయిలో పదిహేడేండ్ల లోపు పిల్లలలో (విద్యార్థులతోపాటు సాధారణ బాలలందరిలోనూ) వైజ్ఞానిక పరిశోధనలు, ప్రయోగాల పట్ల ఉత్సాహాన్ని, సృజనాత్మకతను పెంపొందింపజేసే ప్రయత్నాలు సంతృప్తికరంగా లేవన్న అసంతృప్తి చాలా మందిలో ఉన్నది. ఆ మాటకొస్తే, అసలు యువతరంలోనూ ఈ లోటు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. ఇవాళ ఎందరు సైన్స్‌ను తమ కెరీర్‌కు లక్ష్యంగా ఎన్నుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్న ప్రశ్నకు సమాధానం చెప్పుకొంటే కఠోర వాస్తవం మన ముందుకు వస్తుంది. ప్రతీ సంవత్సరం ఏడాది చివరి (డిసెంబర్)లో జరిగే 'జాతీయ బాలల విజ్ఞానశాస్త్ర సదస్సు' వంటి సందర్భం వచ్చినప్పుడైనా ఎన్ని స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో వాటికోసం విద్యార్థులను సమాయత్తం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి? అసలు, పిల్లల్లో శాస్త్రీయ, పరిశోధనాత్మక స్పృహను పెంపొందించే ప్రయత్నాలు స్కూలు, తల్లిదండ్రుల స్థాయిలోనే జరుగాలి. సైన్సు పాఠాలు బోర్, డ్రై సబ్జెక్టు, అర్థం కావు వంటి ఆలోచనల్లోంచి ప్రతి ఒక్కరూ ఎంత త్వరగా బయటపడితే అంత మంచిది.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## ఎస్‌పీఎంసీఐఎల్‌లో

**ముంబైలోని సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌పీఎంసీఐఎల్)లో వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 30
- **పోస్టులు:** సూపర్‌వైజర్, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్, సెక్రటేరియల్ అసిస్టెంట్, జూనియర్ బులియన్ అసిస్టెంట్, జూనియర్ టెక్నీషియన్.
- **అర్హతలు:** సంబంధిత ట్రేడ్/ సబ్జెక్టుల్లో ఐటీఐ, ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2020, జనవరి 3
- **వెబ్‌సైట్:** http://igmmumbai.spmcil.com

**తెలంగాణ అండ్ ఆంధ్రా సబ్ ఏరియా ఎక్స్‌సర్వీస్ మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ (ఈసీహెచ్) కింద ఖాళీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

## ఈసీహెచ్‌లో 114 ఖాళీలు

- **మొత్తం ఖాళీలు:** 114
- **పోస్టులు:** ఆఫీసర్ ఇన్‌చార్జీ పాలీక్లినిక్, మెడికల్ స్పెషలిస్ట్, మెడికల్ ఆఫీసర్, రేడియాలజిస్ట్, డెంటల్ ఆఫీసర్, నర్సింగ్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్, డ్రైవర్, క్లర్క్,ల్యాబొరేటరీ అసిస్టెంట్, ఫార్మసిస్ట్, ఫిమేల్ అటెండెంట్, ప్యూన్, సఫాయివాలా, చౌకీదార్, డాటా ఎంట్రీ ఆపరేటర్, రిసెప్షనిస్ట్, ఐటీ నెట్ టెక్ ఉన్నాయి.
- **అర్హతలు:** పోస్టుని బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, బీఎస్సీ, బీడీఎస్, బీఫార్మసీ, ఎంబీబీఎస్, ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీ ఉత్తీర్ణత, అనుభవం.



- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీలు:** 2020 జనవరి 28 నుంచి ఫిబ్రవరి 5 వరకు
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2020, జనవరి 8
- **వెబ్‌సైట్:** https://tasaechs.telangana.gov.in

## బీఈసీఐఎల్‌లో

**ఎయిమ్స్‌లో కింది పోస్టుల భర్తీకి బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) ప్రకటన విడుదల చేసింది.**

- **పోస్టు:** రిసెర్చ్ అసిస్టెంట్-6
- **అర్హతలు:** ఎమ్మెస్సీ బయలాజికల్ సైన్సెస్/ లైఫ్ సైన్సెస్
- **పోస్టు:** ఫార్మసిస్ట్-4
- **అర్హతలు:** డిప్లొమా ఇన్ ఫార్మసీతోపాటు ఫార్మసిస్ట్‌గా రిజిస్టరై ఉండాలి.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2020, జనవరి 15
- **వెబ్‌సైట్:** https://www.becil.com

## నాబార్డ్‌లో 73 పోస్టులు

**నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చరల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్)లో గ్రూప్ సీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టు:** ఆఫీస్ అటెండెంట్ (గ్రూప్ సీ)
- **పేస్కేల్:** 10,490-23,700/-
- **మొత్తం ఖాళీలు:** 73
- **అర్హతలు:** పదోతరగతి లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.

**నోట్:** ఉన్నత విద్యార్హతలు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు కారు.

- **వయస్సు:** 2019, డిసెంబర్ 1నాటికి 18- 30 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రెండు దశల్లో నిర్వహించే పరీక్ష ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2020, జనవరి 12
- **వెబ్‌సైట్:** www.nabard.org

# ఫిలిప్పీన్స్‌లో తుఫాన్ ధాటికి 20 మంది మృతి

- నిరాశ్రయులైన వేల మంది
- క్రమంగా బలహీనపడిన ఫాన్‌ఫాన్

**మనీలా, డిసెంబర్ 26:**

ఫిలిప్పీన్స్‌లో ఫాన్‌ఫాన్ తుఫాన్ ధాటికి 20 మంది మృత్యువాత పడ్డారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. క్యాథలిక్ దేశమైన ఫిలిప్పీన్స్‌లో క్రిస్మస్ వేడుకలను ఈ తుఫాన్ హరించివేసింది. గురువారంనాటికి తుఫాన్ కొద్దిగా బలహీనపడింది. తుఫాన్ కారణంగా అన్ని రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ స్తంభాలు, చెట్లు కూలిపోయాయి. ఇండ్లు ధ్వంసమయ్యాయి. లోతట్టు గ్రామాలను వరదలు ముంచెత్తాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. విమానాశ్రయం మూతపడింది. క్రిస్మస్‌నాడు ఇలోయిలో రాష్ట్రంలోని తీరప్రాంత పట్టణమైన బటాడ్ దెయ్యం పట్టణాన్ని (గోస్ట్‌టౌన్) తలపించిందని విపత్తు ప్రతిస్పందన అధికారి ఒకరు తెలిపారు. 'మొత్తం చిమ్మచీకటి. ఎవరూ కనిపించని, ఏదీ వినిపించని పరిస్థితి. పట్టణం గోస్ట్ టౌన్ అనిపించింది' అని ఆయన పేర్కొన్నారు. గురువారంనాటికి తుఫాన్ కొద్దిగా బలహీనపడింది. దక్షిణ చైనా సముద్రంలో గంటకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. భయంకరమైన ఈదురుగాలులతో బుధవారంనాడు ద్వీపం అల్లకల్లోలంగా మారగా.. ఇప్పుడు కొద్దిగా శాంతించింది. నీళ్లలో మునిగిపోవడం, చెట్లు మీదపడటం, విద్యుదాఘాతం కారణంగా 20 మంది చనిపోయారని అధికారులు తెలిపారు. ఇలోయిలో రాష్ట్రంలో నది పొంగిపొర్లడంతో ఒక వ్యక్తి, ఆయన ముగ్గురు పిల్లలు, వారి బంధువు ఒకరు గల్లంతయ్యారని పేర్కొన్నారు. ద్వీపసమూహం అంతటా క్రిస్మస్ ఆనందాన్ని తుఫాన్ ఆవిరిచేసింది. పాఠశాలలు, వ్యాయామశాలలు అత్యవసర సహాయ కేంద్రాలుగా మారాయి. ఆర్మీ బలగాలు, పోలీసులు, వలంటీర్లు క్రిస్మస్ వేడుకలకు, ఇంటికి దూరంగా ఉండి నిర్వాసితుల సేవలో గడిపారు. మధ్యప్రాంతంలోని ఓడరేవుల్లో 25 వేల మందికి పైగా చిక్కుకుపోయారు.

## సీసీ కెమెరా నిఘాలో మార్క్స్ సమాధి!

**లండన్, డిసెంబర్ 26:** లండన్‌లోని హైగేట్ శ్మశానవాటికలోని కారల్‌మార్క్స్ సమాధి వద్ద సీసీ కెమెరాలను అమర్చారు. మార్క్స్ సమాధిపై ఈ ఏడాది రెండుసార్లు దాడులు జరిగిన నేపథ్యంలో ఈ స్మారకచిహ్నాన్ని పరిరక్షిస్తున్న మార్క్స్ గ్రేవ్ ట్రస్ట్ ఈ నిర్ణయం తీసుకున్నది. బ్రిటన్ వారసత్వ సంపద పరిరక్షణకు ఉద్దేశించిన హిస్టారిక్ ఇంగ్లండ్ సంస్థతోపాటు భద్రతా నిపుణుల అభిప్రాయాల మేరకు నిఘా కెమెరాలను తొలిసారి అమర్చారు. మార్క్స్ పాలరాతి విగ్రహం దిమ్మెపై ఉన్న 'మార్క్స్' అనే అక్షరాలను ఈ ఏడాది జవరిలో దుండగులు ధ్వంసంచేశారు. ఫిబ్రవరిలో దిమ్మెపై 'ద్వేష సిద్ధాంతం', 'మారణహోమం శిల్పి'అని రాశారు. దీనిపై విచారణ కొనసాగుతున్నప్పటికీ, దుండగుల వివరాలు తెలియలేదు.



లండన్‌లో కారల్ మార్క్స్ సమాధి వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరా (వృత్తంలో)





గురువారం హైదరాబాద్‌లో సీపీఐ 95వ ఆవిర్భావ వేడుకల్లో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి

# హింసవైపు నడిపేవారు నాయకులు కాదు

- సరైన మార్గంలో నడిపేవారే నిజమైన నేతలు
- సీఏఏ ఆందోళనకారులపై సైన్యాధిపతి రావత్ విమర్శలు
- రాజకీయ అంశాల్లో ఆర్మీ చీఫ్ జోక్యంపై ప్రతిపక్షాల ధ్వజం
- పరిధులను రావత్ అతిక్రమించారని విమర్శ
- ఆయనను మందలించాలని కేంద్రానికి సూచన

**న్యూఢిల్లీ, డిసెంబర్ 26:** పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏకి) వ్యతిరేకంగా హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్న వారిపై సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ విమర్శలు గుప్పించారు. ప్రజలను తప్పుడు మార్గంలో నడిపించేవారు నిజమైన నాయకులు కాదని ఆయన వ్యాఖ్యానించారు. అయితే రాజకీయ అంశాలపై ఆయన వ్యాఖ్యలు చేయడం పట్ల విపక్షాలు విరుచుకుపడ్డాయి. గురువారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో రావత్ మాట్లాడుతూ.. 'ప్రజలను తప్పుడు మార్గంలో నడిపించేవారు నాయకులు కాదు. చాలా విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో విద్యార్థుల్ని హింస, దహనకాండకు పాల్పడేలా చేస్తుండడం మనం చూస్తున్నాం. ఇది నాయకత్వం కాదు. నిజమైన నాయకుడు మిమ్మల్ని సరైన దారిలో నడిపిస్తాడు. సరైన సలహాలు ఇస్తాడు' అని పేర్కొన్నారు. ఈ నెల 31న రావత్ పదవీ విరమణ చేయనున్నారు. దేశ తొలి రక్షణ దళాధిపతి(సీడీసీ)గా ఆయనను నియమిస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆర్మీ అధిపతిగా తన మూడేండ్ల పదవీ కాలంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించలేదనే విమర్శలు రావత్‌పై ఇప్పటికే ఉన్నాయి. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. కాంగ్రెస్‌తో సహా వివిధ ప్రతిపక్షాలు ఆయనపై తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. హక్కుల కార్యకర్త యోగేంద్ర యాదవ్ స్పందిస్తూ.. 'నేను ఆయనతో ఏకీభవిస్తున్నాను. అవును. నాయకులు సరైన దారిలో నడిపిస్తారు. ప్రధాని మోదీని దృష్టిలో ఉంచుకునే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని నేను కచ్చితంగా చెప్పగలను' అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి బ్రిజేశ్ కలప్ప స్పందిస్తూ.. 'పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లో ఈ విధంగా (రాజకీయ అంశాలపై సైన్యాధిపతి మాట్లాడడం) జరుగుతుంటుంది. సీఏఏ నిరసనలపై ఆర్మీ చీఫ్ రావత్ వ్యాఖ్యానించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. రాజకీయ అంశాలపై మాట్లాడేందుకు నేడు ఆయనకు అనుమతినిస్తే, రేపొద్దున దేశంలో సైనిక పాలన ప్రయత్నానికి ఆయనకు అనుమతినిచ్చినట్లే!!' అని ట్వీట్‌చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ స్పందిస్తూ.. 'మీ వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నా జనరల్ సాహెబ్. అయితే మత ఘర్షణల్లో ఊచకోతకు పాల్పడేలా అనుచరులను ప్రేరేపించేవారు కూడా నాయకులు కాదు. నాతో ఏకీభవిస్తారా జనరల్ సాహెబ్' అని ప్రశ్నించారు.



బిపిన్ రావత్

**పరిధులు అతిక్రమించారు: సీపీఎం**

రావత్ వ్యాఖ్యలపై సీపీఎం తీవ్రస్థాయిలో మండిపడింది. యూనిఫాంలో ఉన్న అత్యున్నత అధికారి తన పరిధులను అతిక్రమించారని ఆరోపించింది. సీఏఏకు వ్యతిరేకంగా విద్యార్థులు చేస్తున్న ఆందోళనలను ఖండిస్తూ ఆర్మీ చీఫ్ ప్రత్యక్ష్యంగా జోక్యం చేసుకున్నారు. 'ప్రధాని మోదీ హయాంలో పరిస్థితులు ఏ విధంగా దిగజారాయో సైన్యాధిపతి వ్యాఖ్యలు రుజువు చేస్తున్నాయి. పదవిలో ఉన్న అత్యున్నత అధికారి నిస్సిగ్గుగా తన సంస్థ పరిధులను అతిక్రమించారు. పాకిస్థాన్ తరహాలో మిలిటరీని రాజకీయం చేసే విధానంవైపు మనం వెళ్తున్నామా అన్న ప్రశ్న తలెత్తుతున్నది. ప్రజాస్వామిక నిరసన అంశాల్లో మిలిటరీ ఉన్నతాధికారి ఈ విధంగా జోక్యం చేసుకోవడం స్వతంత్ర భారతావనిలో ఇప్పటివరకూ చూడలేదు' అని సీపీఎం పొలిట్‌బ్యూరో అభిప్రాయపడింది. తన వ్యాఖ్యలపై జాతికి క్షమాపణ చెప్పాలని రావత్‌ను డిమాండ్‌చేసింది. ఇలాంటి అతిక్రమణలపై ప్రభుత్వం దృష్టిసారించాలని, జనరల్‌ను మందలించాలని సూచించింది.

## పౌర అంశాల్లో సైన్యం జోక్యం రాజ్యాంగ విరుద్ధం: ఒవైసీ

సీఏఏ ఆందోళనలపై రావత్ వ్యాఖ్యలు చేయడం దేశంలోని ప్రజా ప్రభుత్వాన్ని బలహీనపరచడమేనని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. ప్రజస్వామ్యంలో నిరసన తెలుపడం ప్రాథమిక హక్కు అని స్పష్టంచేశారు. 'పౌర అంశాల్లో సైన్యం జోక్యం చేసుకోకూడదని రాజ్యాంగం నిర్దేశిస్తున్నది. భారతదేశానికి ఇతర దక్షిణాసియా ప్రజాస్వామ్య దేశాలకు ఉన్న తేడా ఇదే. పౌర అంశాల్లో (సైన్యాధిపతి) దయచేసి జోక్యం చేసుకోవద్దు. నిరసన తెలుపడం ప్రజాస్వామ్య హక్కు. రావత్ వ్యాఖ్యలను ప్రభుత్వం పరిశీలించాలి. ఆయన వ్యాఖ్యలు మోదీ ప్రభుత్వాన్ని బలహీనపరచడమే. ఆర్మీ అధిపతి చేసిన వ్యాఖ్యలు నిజమైతే.. ప్రభుత్వాన్ని నేను ఒక ప్రశ్న అడుగుతున్నా. ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో విద్యార్థిగా తాను పాల్గొన్నట్లు ప్రధాని మోదీ తన వెబ్‌సైట్‌లో రాసుకున్నారు. రావత్ వ్యాఖ్యల ప్రకారం.. మరి ఇది కూడా తప్పే కదా' అని అసద్ ప్రశ్నించారు. 1975లో ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంలో విద్యార్థులు సహా అందరూ పాల్గొనాలని లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ పిలుపునిచ్చారని, దీనిపైనా ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. కాగా, దేశంలోని 130 కోట్ల మంది ప్రజలు హిందువులేనని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలపై ఒవైసీ స్పందిస్తూ.. రాజ్యాంగం ప్రకారం భారత్‌కు మతం లేదని చెప్పారు. 'మోహన్ భాగవత్ వద్ద భారత రాజ్యాంగం లేకపోవచ్చు. రాజ్యాంగంలో సమానత్వ హక్కు, జీవించే హక్కు ఉన్నాయి. దేశంలో భిన్నత్వానికి, వైవిధ్యానికి ఇవే కారణం. ఆర్టికల్ 26,29,30 ఎందుకు పొందుపరిచారు? ఎందుకంటే దేశానికి మతమంటూ లేదు' అని వ్యాఖ్యానించారు. 'దేశంలో ఒకే మతం ఉండాలని ఆరెస్సెస్ భావిస్తున్నది. రాజ్యాంగం ఉన్నంతవరకు అది జరుగదు' అని ఆయన స్పష్టంచేశారు. తెలంగాణలో ఆరెస్సెస్ విస్తరిస్తుండడంపై ఆయన స్పందిస్తూ.. రాష్ట్రం ప్రశాంతంగా ఉన్నదని, దానికి ఎవరైనా విఘాతం కలిస్తే ప్రజలు ఊరుకోరని చెప్పారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు లౌకికవాది అని, ఆయన ఉన్నంతవరకూ ఆరెస్సెస్, బీజేపీకి కష్టమేనని పేర్కొన్నారు.



## ఎన్నార్సీ, ఎన్పీఆర్, సీఏఏ అందరి సమస్య

- సీపీఐ 95వ ఆవిర్భావ వేడుకల్లో సురవరం వ్యాఖ్య

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎన్నార్సీ, ఎన్పీఆర్, సీఏఏలు ముస్లిం, హిందువుల సమస్య మాత్రమే కాదని, సెక్యులర్‌గా ఉండే ప్రతి ఒక్కరి సమస్య అని సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ మతం పేరుతో సామాన్యులను రెచ్చగొడుతున్నదని విమర్శించారు. తమ పార్టీకి అధికారం కన్నా ప్రజా పోరాటాలే ముఖ్యమని స్పష్టంచేశారు. గురువారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయం మగ్దూంభవన్‌లో నిర్వహించిన సీపీఐ 95వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్‌లో మాదిరిగా దేశంలో ఒక్కటే మతం ఉండాలన్న ఉద్దేశంతో బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు. నరేంద్రమోదీ పాలనలో కార్పొరేట్ల ఆదాయం వందరెట్లు పెరిగితే, సామాన్యులకు వైద్య, విద్య ఖర్చులు విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజలు నిరుద్యోగం, ప్రజాసమస్యలపై ఆలోచించకూడదనే మతాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. కమ్యూనిస్టులు ప్రజా సమస్యలపై ఐక్యపోరాటాలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర మరువలేదని గుర్తుచేశారు. అంతరాలులేని వర్గరహిత సమాజం కోసం కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. మతోన్మాద పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత లౌకిక వ్యవస్థ దెబ్బతింటున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. పార్లమెంట్, అసెంబ్లీలలో సీపీఐ సంఖ్య తగ్గినంత మాత్రాన తమ పోరాటం ఆగదని చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారానికి మిలిటెంట్ ప్రజా ఉద్యమాలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ అజీజ్‌పాషా, రైతు సంఘం నాయకురాలు పశ్యపద్మ, హైదరాబాద్ నగర కార్యదర్శి డీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

**బెంగళూరు సీపీఐ ఆఫీసుపై దాడి హేయం**

కర్ణాటక రాజధాని బెంగళూరులో సీపీఐ రాష్ట్ర కార్యాలయంపై ఆరెస్సెస్, బీజేపీ కార్యకర్తలు దాడిచేయడం హేయమైన చర్య అని చాడ వెంకటరెడ్డి విమర్శించారు. బుధవారం పార్టీ కార్యాలయంలోకి చొరబడి, ఆరు మోటర్ సైకిళ్లను తగలబెట్టి, కర్రలు, రాళ్లతో బీభత్సం సృష్టించడం సంఘ్‌పరివార్ ఆగడాలకు పరాకాష్ఠ అని పేర్కొన్నారు. మణిపూర్, అసోం, ఉత్తరప్రదేశ్‌ల్లో పార్టీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడంతోపాటు, గృహ నిర్బంధాలకు గురిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ దమననీతిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

# సర్కార్ దవాఖానలకు కార్పొరేట్ కళ

- అధునాతన సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వం
- అదనపు భవనాల నిర్మాణంతో పెరిగిన బెడ్ల సంఖ్య

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ దవాఖానలు అధునాతన సౌకర్యాలతో కొత్తకళను సంతరించుకున్నాయి. హైదరాబాద్‌తోపాటు, రాష్ట్రవ్యాప్తంగా బోధనా దవాఖానలు, జిల్లాస్థాయి, ఏరియా దవాఖానలు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆధునిక హంగులు సంతరించుకొన్నాయి. దవాఖానలకు వచ్చే రోగులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతోపాటు, అత్యవసర వైద్యసేవల విస్తరణలోనూ ప్రత్యేక దృష్టి సారించింది. దవాఖానలోని వార్డులు, ఓపీ విభాగాలను సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు అత్యవసర వైద్యసేవలు అందించే ఐసీయూలను మెరుగుపర్చి.. పేద, మధ్యతరగతికి కుటుంబాలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నది. అన్ని జిల్లా దవాఖానల్లో నవజాత శిశువుల సంరక్షణకోసం ప్రత్యేక యూనిట్లు ఏర్పాటుచేసింది. అందులోభాగంగానే నీలోఫర్‌లో ఏర్పాటుచేసిన ఇంటెన్సివ్‌కేర్ బ్లాక్‌లో దేశంలోనే ముఖ్యమైన అన్ని వసతులను కల్పించారు. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వైద్య, ఆరోగ్యశాఖ ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 22 ఎస్ఎన్‌సీయూలు (సిక్‌న్యూబర్న్ కేర్ యూనిట్లు), 61ఎన్‌బీఎస్‌యూ, 562 ఎన్‌బీసీసీలను ఏర్పాటుచేసింది. మరో 6 ఎస్ఎన్‌సీయూల నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఎస్ఎన్‌సీయూల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఎఫ్‌బీఎన్‌సీ శిక్షణ అందించి అంతర్జాతీయ ప్రమాణాలతో చిన్నారులకు వైద్యం, వైద్యశాలల్లో వసతులు కల్పించారు.





**అందుబాటులోకి 2,690 బెడ్లు**

తెలంగాణ ఏర్పడిన నాటినుంచి నాలుగేండ్లలో రాష్ట్రవ్యాప్తంగా పలు సర్కారు దవాఖానాల్లో అదనపు భవనాల నిర్మాణం చేపట్టారు. రాష్ట్ర రూ.372.47కోట్లతో విస్తరణ/అదనపు భవనాలను నిర్మించి కొత్తగా 2,690 బెడ్లను అందుబాటులోకి తెచ్చారు. అందులో.. తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ద్వారా రూ.129.35 కోట్లు వెచ్చించి 14 దవాఖానల్లో భవనాల విస్తరణ చేపట్టడంతో 720 బెడ్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏడు దవాఖానల్లో రూ.127.50 కోట్లు ఖర్చుచేసి 1050 బెడ్ల సామర్థ్యంతో మాతాశిశు సంరక్షణ కేంద్రాలు ఏర్పాటుచేశారు. నాబార్డు నిధులతో ఆరు దవాఖానల్లో 470 బెడ్లను అదనంగా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం రూ.61.56 కోట్లు వెచ్చించింది. నిలోఫర్ దవాఖానకు వస్తున్న రోగుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా మెటర్నిటీ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. 450 బెడ్ల సామర్థ్యంతో రూ.54.06 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ అదనపు భవనంలో నవజాత శిశువులకు ప్రత్యేక వైద్యసేవలు అందిస్తున్నారు.

**అదనపు భవనాలు, అందుబాటులోకి బెడ్ల సంఖ్య**

| ఆదనపు భవనాలు నిర్మించిన దవాఖాన పేరు | బడ్జెట్ రూ.కోట్లలో | గతంలో బెడ్లసంఖ్య | ప్రస్తుతం పెరిగినవి | మొత్తం బెడ్లసంఖ్య |
|---|---|---|---|---|
| మహబూబ్‌నగర్ బోధనా దవాఖాన | 8.40 | 250 | 100 | 350 |
| ఖైరతాబాద్ కమ్యునిటీ హెల్త్‌సెంటర్ | 10.15 | 50 | 40 | 90 |
| మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం | 8.77 | 6 | 44 | 50 |
| నారాయణ్‌ఖేడ్ ఏరియాదవాఖాన | 8.00 | 30 | 70 | 100 |
| నాగనూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ | 8.20 | 6 | 44 | 50 |
| గజ్వేల్ ఏరియా దవాఖాన (సీహెచ్‌సీ) | 21.30 | 50 | 50 | 100 |
| సిద్దిపేట దవాఖాన చైల్డ్ హెల్త్‌కేర్ సెంటర్ | 4.00 | -- | 50 | 50 |
| హుస్నాబాద్ యూపీహెచ్‌సీ | 3.00 | 30 | 20 | 50 |
| తూప్రాన్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ | 9.40 | 6 | 44 | 50 |
| భూపాలపల్లి దవాఖాన | 23.50 | 6 | 94 | 100 |
| చిట్యాల కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ | 9.50 | 30 | 20 | 50 |
| కమలాపూర్ పీహెచ్‌సీ | 3.98 | 6 | 24 | 30 |
| మణుగూరు దవాఖాన | 3.15 | 30 | 70 | 100 |
| హుజూరాబాద్ ఏరియా దవాఖాన | 10.00 | 50 | 50 | 100 |

## రాజధానిపై నేడు ఏపీ క్యాబినెట్ చర్చ

- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు

**అమరావతి:** రాజధాని అంశంపై ఏర్పాటుచేసిన జీఎన్ రావు కమిటీ నివేదికపై చర్చించేందుకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ క్యాబినెట్ భేటీ కానున్నది. రాజధాని ప్రాంత రైతుల ఆందోళన నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేస్తున్నారు. జీఎన్ రావు కమిటీ నివేదికను క్యాబినెట్ ఆమోదించే అవకాశం ఉన్నది. అమరావతి అభివృద్ధి, రిటర్నబుల్ ప్లాట్ల అంశంపై కూడా చర్చించే అవకాశం ఉన్నది. రైతుల ఆందోళన, సీఆర్డీఏ వ్యవహారాలపైనా క్యాబినెట్ చర్చించనున్నది. రాజధాని ప్రాంత రైతుల అభిప్రాయాల సేకరణకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తున్నది.

## టీడీపీ మాజీ ఎమ్మెల్యే హఠాన్మరణం

- 2014లో ఏలూరు నుంచి గెలిచిన బాడేటి బుజ్జి



**పశ్చిమగోదావరి:** టీడీపీ నేత, ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు మాజీ ఎమ్మెల్యే బడేటి కోట రామారావు (బుజ్జి) (55) హఠాన్మరణం చెందారు. గురువారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో బుజ్జికి గుండెపోటు రావడంతో దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందారు. దివంగత సినీనటుడు ఎస్వీ రంగారావు మేనల్లుడు బడేటి బుజ్జి. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ తరపున ఏలూరు నుంచి బుజ్జి మొదటిసారి పోటీచేసి ఓడిపోయారు. 2014లో టీడీపీ నుంచి పోటీచేసి 24,603 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2019 వరకు ఏలూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. 2019 ఎన్నికల్లో 4,072 ఓట్ల తేడాతో వైఎస్సార్సీపీ అభ్యర్థి కృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) చేతిలో బడేటి బుజ్జి ఓటమిపాలయ్యారు.

## ఇంటిపైకి దూసుకెళ్లిన కంటైనర్

- క్యాబిన్‌లో ఇరుక్కుని డ్రైవర్ మృతి
- టైరు పగులడంతో ప్రమాదం
- సూర్యాపేట జిల్లాలో ఘటన

మునగాల: టైరు పగులడంతో రోడ్డుపక్కన ఉన్న ఓ ఇంటిపైకి కంటైనర్ దూసుకెళ్లిన ఘటనలో డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందాపురం వద్ద 65వ జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఏడు గంటలకు చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ మేడ్చల్ నుంచి కాకినాడ వెళ్లేందుకు కేశినేని కార్గో కంటైనర్ గురువారం అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో బయలుదేరింది. 65వ నంబర్ జాతీయరహదారిపై సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందాపురం వద్దకు చేరుకోగానే కంటైనర్ వెనుక టైరు పగిలింది. దీంతో అదుపుతప్పి జాతీయరహదారిని దాటి సర్వీస్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న ముసుగుల సైదిరెడ్డి ఇంటి మీదికి దూసుకెళ్లింది. దీంతో ఇంటి ప్రహరీతోపాటు అక్కడ ఉన్న ఓ ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. డ్రైవింగ్ చేస్తున్న గిరిడ మోహన్‌రావు (53) కంటైనర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోగా స్థానికులు బయటకుతీశారు. ప్రమాదం జరిగిన తీరు తెన్నులను స్థానికులకు వివరించిన అనంతరం ఛాతిలో నొప్పి వస్తున్నదంటూ కన్నుమూశాడు. మృతుడి స్వస్థలం శ్రీకాకులం జిల్లా బుర్జా మండలం లచ్చయ్య పేటగా తెలిసింది. కంటైనర్‌లో ఉన్న మరోడ్రైవర్ లక్ష్మీకాంతరెడ్డికి ఎటువంటి గాయాలు కాలేదు. మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుమారుడు రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సత్యనారాయణమూర్తి తెలిపారు.



కంటైనర్ కింద నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనం, (ఇన్‌సెట్) మృతుడు మోహన్‌రావు (ఫైల్)

## సెల్ చార్జింగ్‌తో షాక్.. యువకుడి మృతి

**గుడిహత్నూర్ రూరల్:** సెల్‌చార్జింగ్ పెడుతూ విద్యుత్‌షాక్ తగిలి ఓ యువకుడు మృతిచెందిన ఘటన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని ఉమ్రి(బి)గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన పెందూర్ మంతు కుమారుడైన పరమేశ్వర్(17) బుధవారం రాత్రి 8.30 గంటలకు ఇంట్లో మొబైల్‌ఫోన్‌కు చార్జింగ్ పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి మృతిచెందాడు. పరమేశ్వర్ ఇచ్చోడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండోసంవత్సరం చదువుతున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గుడిహత్నూర్ ఎస్సై కొక్కెల రోహిణి తెలిపారు.



పరమేశ్వర్ (ఫైల్)

# కుప్పలుగా హైసెక్యూరిటీ నంబరు ప్లేట్లు

## డీలర్లు సమాచారమిచ్చినా ఆసక్తి కనబర్చని వాహనదారులు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

హైసెక్యూరిటీ నంబరు ప్లేట్లపై వాహనదారులు ఆసక్తి కనబరుచడంలేదు. కొత్త వాహనాలు కొంటున్నవారు రిజిస్ట్రేషన్‌కు ఫీజు చెల్లించినప్పటికీ వీటిని వాహనానికి బిగించుకోవడానికి నామోషీగా ఫీలవుతున్నారు. హైసెక్యూరిటీ నంబరు ప్లేట్లు నాణ్యత లేకుండటంతోపాటు వీటిని బిగించుకుంటే వాహనం లుక్ పోతుందనే ఉద్దేశంతో చాలామంది అనాసక్తి ప్రదర్శిస్తున్నారు. అక్టోబర్ 14 నుంచి నంబర్‌ప్లేట్ల బిగింపు ప్రక్రియ వాహన డీలర్ల పరిధిలోకి వెళ్ళడంతో బిగించే బాధ్యత డీలర్లపై ఉన్నది. వాహనాల అమ్మకాలు సాగినప్పటికీ అమ్మిన వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాక నంబర్‌ప్లేట్లను బిగించుకోవడం లేదు. మరోవైపు హైదరాబాద్‌లో కొని ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు సమయం కుదరక బిగించుకోవడంలేదు. ఇలా విడిచిపెట్టిన హైసెక్యూరిటీ ప్లేట్లు కేవలం నగరంలోనే 8 వేల వరకు వివిధ వాహన షోరూముల్లో ఉన్నట్లు సమాచారం. దీనిని గాడిలో పెట్టేందుకు రవాణాశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నా ఫలితం రావడం లేదు. నంబర్‌ప్లేట్ లేకుండా వాహనం దొరికితే విక్రయించిన షోరూం లేదా వాహన యజమానికి లక్షల రూపాయల్లో జరిమానా విధించడం లేదా ఏజన్సీని సస్పెండ్ చేయడం జరుగుతుందని రవాణాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. వాహనదారులపై జరిమానాలు వేసే ఉత్తర్వులు వస్తేనే హైసెక్యూరిటీ నంబర్‌ప్లేట్లను బిగించుకుంటారని షోరూం యజమానులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నిసార్లు సందేశం పంపినా వినియోగదారులు స్పందించడంలేదని వాపోతున్నారు. రవాణా చట్టంలో హైసెక్యూరిటీ నంబర్ ప్లేటు బిగింపు చట్టం పటిష్ఠంగా లేనందువల్లే వాహనదారులు ఫ్యాన్సీ నంబర్ ప్లేట్ల వైపు మొగ్గు చూపుతున్నారని అభిప్రాయపడుతున్నారు.



## కారును ఢీకొట్టిన బస్సు..నలుగురు మృతి

- చిత్తూరు జిల్లాలో విషాదం

**చిత్తూరు:** ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కేవీ పల్లి మండలం మహల్ క్రాస్‌లో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్నది. ఐదుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. మరోకరి పరిస్థితి విషమంగా ఉండటంతో దవాఖానకు తరలించారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

# నిజాయితీగా శ్రమించాం.. ఫలితం దక్కింది!


రితేష్ రానా

**గత పదేళ్లుగా లఘు చిత్రాల ద్వారా సృజనాత్మక ప్రయాణం సాగిస్తున్న రితేష్ రానా 'మత్తు వదలరా' సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమయ్యారు. తొలి ప్రయత్నంలోనే మర్డర్ మిస్టరీ కథాంశాన్ని ఎంచుకొని దానికి చక్కటి వినోదాన్ని కలబోసి జనరంజక చిత్రంగా తీర్చిదిద్దారు. మైత్రీమూవీ మేకర్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ద్వారా ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి తనయుడు శ్రీసింహా కథానాయకుడిగా అరంగేట్రం చేశారు. ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చిన ఈ చిత్రం విజయపథంలో పయనిస్తున్నది. ఈ సందర్భంగా దర్శకుడు రితేష్ రానా గురువారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..**

**మీ నేపథ్యం? సినీరంగంలోకి ఎలా వచ్చారు?**

నా స్వస్థలం హైదరాబాద్. ముగ్గురు మిత్రుల బృందంతో కలిసి గత పదేళ్లుగా లఘు చిత్రాల్ని రూపొందిస్తున్నాను. ఈ క్రమంలో ఓ కామన్‌ఫ్రెండ్ ద్వారా మైత్రీమూవీ మేకర్స్ చెర్రిగారిని కలవడం జరిగింది. మూడేళ్ల క్రితం ఆయనకు ఈ కథ చెప్పాను. కొత్తవాళ్లమైనా మా ప్రతిభ మీద నమ్మకంతో ఈ సినిమా బాధ్యతల్ని అప్పజెప్పారు.

**సినిమాకు ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన లభిస్తోంది?**

అన్ని కేంద్రాల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. మా టీమ్ అందరితో కలిసి హైదరాబాద్ థియేటర్స్‌లో సినిమా చూశాం. కథలోని సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలతో పాటు కామెడీ చాలా బాగుందని ప్రశంసిస్తున్నారు. తక్కువ థియేటర్లలో రిలీజ్ చేయడం వల్ల అందరికి సినిమా చూసే అవకాశం లభించడం లేదు. మరికొన్ని థియేటర్లు పెరిగితే సినిమా అందరికి చేరువవుతుందని అనుకుంటున్నా.

**మూడేళ్లు ఈ కథతో ప్రయాణం చేశారు. సెట్స్‌మీదకు వెళ్లే సరికి స్క్రిప్ట్‌లో ఏమైనా మార్పులు జరిగాయా?**

కథలో ఎలాంటి మార్పులు చేయలేదు. తొలుత అనుకున్న స్క్రిప్ట్‌నే యథాతథంగా తెరకెక్కించాం. మైత్రీమూవీమేకర్స్ మా టీమ్‌ను పూర్తిగా విశ్వసించారు. దాంతో మేము కోరుకున్న విధంగా సినిమాను తెరపైకి తీసుకొచ్చాం. 'హూ డన్ ఇట్' అనే జోనర్‌లో ఈ స్క్రిప్ట్‌ను రాసుకున్నాం. క్రైమ్ చేసిన వ్యక్తిని అన్వేషిస్తూ చేసే ఉత్కంఠభరిత ప్రయాణమే ఈ చిత్ర ఇతివృత్తం.

**తొలి చిత్రానికే మైత్రీమూవీ మేకర్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో దర్శకుడిగా అవకాశం దక్కించుకోవడం ఎలా అనిపించింది?**

అంతటి పేరున్న సంస్థ కాబట్టే ఈరోజు సినిమా ప్రేక్షకులకు చేరువైంది. లేదంటే విడుదల కోసమే చాలా కష్టాలు పడాల్సి వచ్చేది. పెద్ద సంస్థలో అవకాశం వచ్చింది కాబట్టి మమ్మల్ని మేము నిరూపించుకోవాలనే తపనతో పనిచేశాం. ప్రతి విషయంలో నిజాయితీగా శ్రమించాం కాబట్టే సినిమాకు అంతటా ప్రశంసలు లభిస్తున్నాయి.

**దిగ్గజ సంగీత దర్శకుడు కీరవాణి తనయులతో కలిసి ఈ సినిమాకు పనిచేయడం ఎలాంటి అనుభూతినిచ్చింది?**

మా కథకు శ్రీసింహా బాగా కుదిరాడు. తన బ్యాక్‌గ్రౌండ్‌ను ఏమాత్రం దృష్టిలో పెట్టుకోకుండా సినిమా కోసం కష్టపడ్డాడు. మేము కూడా అతన్ని ఓ న్యూకామర్‌లాగానే ట్రీట్ చేశాం. ఆడిషన్స్ చేసిన తర్వాతే అతన్ని ఈ సినిమాకు ఎంపిక చేసుకున్నాం. శ్రీసింహా కుటుంబ సభ్యులెవరూ కూడా సినిమా విషయంలో జోక్యం చేసుకోలేదు. కాలభైరవ కథానుగుణంగా మంచి నేపథ్య సంగీతాన్ని సమకూర్చాడు.

> **ఓ మిస్టరీ థ్రిల్లర్‌ను కొత్త పంథాలో ఆవిష్కరించాలనుకున్నాం. ఈ స్టోరీకి పాటలు, ఫైట్స్ అవసరం లేదనిపించింది. పాటలు కథను ముందుకు నడిపించేవిగా ఉండాలి. ఉత్కంఠభరితమైన కథనం, అనూహ్య మలుపులతో సినిమా ఆద్యంతం ప్రేక్షకుల్ని థ్రిల్‌కు గురిచేస్తున్నది.**

**టీవీ సీరియల్ ఎపిసోడ్‌లో మంచి వినోదం పండిందని ప్రశంసలు లభిస్తున్నాయి?**

అవును. ఓ తమిళ ధారావాహిక స్ఫూర్తితో ఆ ఎపిసోడ్‌ను డిజైన్ చేశాను. ఆ సీరియల్ ప్రహసనం థియేటర్లలో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తున్నది.

**ఇండస్ట్రీ వారు సినిమా గురించి ఏమంటున్నారు?**

రాజమౌళిగారు మూడుసార్లు సినిమా చూశారు. ఆయన ట్విట్టర్ ద్వారా మా టీమ్‌ను అభినందించారు. తొలిప్రయత్నంలోనే మంచి సినిమా చేశారని మెచ్చుకున్నారు. హీరో నిఖిల్ ఫోన్ చేసి బాగుందని చెప్పారు.

**మీ తదుపరి సినిమా గురించి?**

ప్రస్తుతం రెండు, మూడు కథలు సిద్ధంగా ఉన్నాయి. ఇంకా ఎవరితో సినిమా కన్‌ఫార్మ్ కాలేదు.


అంకిత

# రొమాన్స్ అంత ఈజీ కాదు!

నటరాజ్, నూరిన్, అంకిత నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'ఊల్లాల ఊల్లాల'. సత్యప్రకాష్ దర్శకుడు. సుఖీభవ మూవీస్ పతాకంపై ఏ.గురురాజ్ నిర్మించారు. జనవరి 1న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయిక అంకిత మాట్లాడుతూ 'మా స్వస్థలం ఢిల్లీ. నా విద్యాభ్యాసమంతా కర్ణాటకలోని బెల్గాంలో సాగింది. 2016లో 'మిస్ బెంగళూరు'గా టైటిల్ గెల్చుకున్నా. 'ఫోర్ లెటర్స్' అనే చిత్రం ద్వారా తెలుగులో కథానాయికగా పరిచయమయ్యాను. 'ఊల్లాల ఊల్లాల' నా ద్వితీయ సినిమా. ఇందులో నేను ధనవంతురాలైన..ఫ్యాషన్‌ను బాగా ఇష్టపడే అమ్మాయి పాత్రలో కనిపిస్తాను కథానుగుణంగా నా పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగుతుంది. గ్లామర్, అభినయ ప్రధానంగా దర్శకుడు నా పాత్రను బాగా తీర్చిదిద్దారు. తెరపై రొమాంటిక్ సన్నివేశాల్ని పండించడం అంత ఈజీ కాదు. షూటింగ్ టైమ్‌లో మన ముందు చాలా మంది ఉంటారు. వారి గురించి పట్టించుకోకుండా పాత్రలో లీనమై రొమాన్స్‌ను పండించడం కష్టంగా అనిపిస్తుంది. తెలుగు పరిశ్రమ వాతావరణం నాకు బాగా నచ్చింది. భవిష్యత్తులో ఇక్కడే సినిమాలు చేస్తాను. రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వంలో రెండు సినిమాలు చేయబోతున్నా' అని చెప్పింది.


'దర్బార్' చిత్రంలో రజనీకాంత్

# విలక్షణ పాత్రలో


జగపతిబాబు

విభిన్నమైన పాత్రలతో అలరిస్తున్న నటుడు జగపతి బాబు త్వరలో మరో విలక్షణ పాత్రలో కనిపించబోతున్నాడు. పారిశ్రామిక వేత్త, పార్లమెంట్ సభ్యుడు గల్లా జయదేవ్ తనయుడు అశోక్ గల్లా హీరోగా రూపొందుతున్న ఓ చిత్రంలో జగపతి బాబు కీలకపాత్రను పోషిస్తున్నారు. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో అమర్‌రాజా మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై పద్మావతి గల్లా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో జగపతిబాబు పాత్ర కొత్త పంథాలో సాగుతుందని చిత్ర బృందం తెలిపింది. ఇటీవల తొలిషెడ్యూల్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం త్వరలోనే రెండో షెడ్యూల్‌కు సిద్ధమైంది. జిబ్రాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫి: రిచర్డ్ ప్రసాద్, సహనిర్మాత: చంద్రశేఖర్ రావిపాటి.

# సందేశంతో 'లైఫ్‌స్టైల్'

నెహ్రూవిజయ్, రోజా, నిఖిల్, సంతోషి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'లైఫ్‌స్టైల్'. సీఎల్ సతీష్‌మార్క్ దర్శకుడు. కలకొండ నర్సింహ నిర్మాత. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక బుధవారం జరిగింది. మందాడి జగన్నాథం, కవి, వాగ్గేయకారుడు గోరటి వెంకన్న పాటల్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'సాంకేతిక మాయలో నేటి యువత చెడు అలవాట్లకు గురవుతున్నారు. కుటుంబాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రతి ఒక్కరికి కుటుంబం ముఖ్యమనే అంశాన్ని చర్చించే చిత్రమిది. నిజజీవిత ఘటనల ఆధారంగా రూపొందించాం. సందేశంతో ఆకట్టుకుంటుంది' అన్నారు. నేటి యువత సన్మార్గంలో నడించేలా ప్రేరణనిచ్చే చిత్రమిదని నిర్మాత తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.


సంతోషి, నెహ్రూ విజయ్

# మన ఊరిని గుర్తుకుతెస్తుంది!

'లంకెబిందెలు కాన్సెప్ట్‌తో 'ఉత్తర' చిత్రాన్ని తెరకెక్కించాం. గ్రామీణ నేపథ్యంలో ఆసక్తికరమైన కథ, కథనాలతో ఈ చిత్రం అందరిని ఆకట్టుకుంటుంది' అన్నారు శ్రీరామ్ నిమ్మల. ఆయన కథానాయకుడిగా తిరుపతి యస్ ఆర్ దర్శకత్వంలో రూపొందించిన ఈ చిత్రం జనవరి 3న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా శ్రీరామ్ నిమ్మల పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'మా స్వస్థలం హైదరాబాద్ శివారులోని దుండిగల్. ఓ గ్రామంలో స్వాతి, అశోక్ అనే జంట మధ్య ప్రేమాయణం ఎలాంటి మలుపులకు కారణమైంది? ఈజీ మనీ కోసం చేసిన ప్రయత్నంలో ఓ యువకుడు ఎదుర్కొన్న కష్టాలేమిటన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. ఓ అమ్మాయికి ఇచ్చిన మాట కోసం ఆమె ప్రియుడు ఏం చేశాడన్నది ఆసక్తిని కలిగిస్తుంది. ప్రతి ఒక్కరికి తమ సొంత ఊరిని గుర్తుకు తెచ్చే చిత్రమిది. నిజామాబాద్, చేవెళ్ల , దుండిగల్ ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. ప్రతి పాత్ర సహజంగా సాగుతుంది. కథానాయిక పాత్రలో చక్కటి వినోదం ఉంటుంది. అందమైన అమ్మాయికి ఉండే పొగరు, యాటిట్యూడ్‌తో హీరోను ముప్పుతిప్పలు పెడుతుంది. వారిద్దరి ప్రేమాయణం మంచి వినోదాన్ని పంచుతుంది. కథానుగుణంగా సురేష్ బొబ్బిలి అద్భుతమైన స్వరాల్ని సమకూర్చాడు. ప్రస్తుతం ఉమాశంకర్ దర్శకత్వంలో 'సాఫ్ట్‌వేర్ బ్లూస్' అనే చిత్రంలో నటిస్తున్నా' అన్నారు.


శ్రీరామ్








